
ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


ఇరాన్ క్షిపణి దాడుల్లో మరో భారత నావికుడు మృతి 08

ప్రజల బాధలపై మోదీ ఎప్పుడు మాట్లాడుతారు?
12 ఏళ్ల బిజెపి సర్కార్ హయాంలో సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను దెబ్బతీసింది : కాంగ్రెస్ 07


సంపుటి 09, సంచిక: 225 | బుధవారం | 15-07-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులు

# 2028 జూన్ 2 నాటికి పూర్తి చేయండి



● ఆ రెండు విమానాశ్రయాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి ● వరంగల్ తరహా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులోనూ ఎంఆర్‌ఒ, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించండి ● విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి ● ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించండి ● కేంద్రమంత్రి గడ్కరీని కోరిన సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం ముఖ్యమంత్రి పౌర విమానయాన శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో సమావేశమై రెండు విమానాశ్రయాలపై చర్చించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండ జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని సిఎం తెలిపారు. వరంగల్ ఎయిర్ పోర్టు, రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో నగరం కీలకంగా మారుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింతగా అభివృద్ధి చేస్తామని సిఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్హాలింగ్ (ఎంఆర్‌ఓ) ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028 జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్లు సిఎం



రేవంత్ రెడ్డి వివరించారు. అందుకు కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సిఎం స్పష్టం చేశారు. వరంగల్ విమానాశ్రయం తరహాలోనే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌ఓ, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలు (ఎఫ్‌టిఒ) నెలకొల్పాలని సిఎం కోరారు.దేశంలో ఎక్కడా లేనంత త్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్ర సృష్టించిందని ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు అభినందించారు. భూ సేకరణ విషయంలో త్వరగా స్పందించినందుకు సిఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలా విమానాశ్రయ డిజైన్ ఉంటుందని ఆయన చెప్పారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం తరువాయి 8లో

## అధికార, ప్రతిపక్షాలు వ్యక్తిగత

# దూషణలు ఆపాలి

● రైతులకు సాగు నీరు ఎలా అందించాలనే అంశంపై దృష్టి సారించాలి ● కాళేశ్వరం ప్రాజెక్టుపై సాగు నీటి ప్రాజెక్టుల ఇంజనీర్లతో ప్రత్యేక కమిటీ వేయాలి ● అసలు విషయం తేల్చి వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలి ● ఎస్ఐఆర్ ఓటర్ల నమోదు ప్రక్రియ గడువును 3 నెలలు పెంచాలి ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



### సింగరేణి పరిధిలోని అన్ని గనులు కేటాయించాలి

సింగరేణి సంస్థ పరిధిలోని తాడిచర్ల–2 బొగ్గు గనిని తిరిగి సింగరేణికి అప్పగించడం పట్ల సాంబశివవరావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో తాడిచర్ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఐ ఆందోళన చేసిందని గుర్తు చేశారు. సింగరేణి పరిధిలోని అన్ని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపాలని కోరారు.

ప్రజాపక్షం/హైదరాబాద్

అధికార పార్టీ కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్‌ఎస్ నాయకులు పరస్పరం వ్యక్తిగత దూషణల పర్వంతో రాజకీయ వికృత క్రీడకు, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అగ్రహం వ్యక్తం చేశారు. ముందు వ్యక్తిగత దూషణల పర్వాన్ని వెంటనే ఆపి రైతులకు సాగు నీరు ఎలా అందించాలనే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు కాళేశ్వరం ప్రాజెక్టుపై సాగు నీటి ప్రాజెక్టుల ఇంజనీర్లతో ప్రత్యేక కమిటీ వేయాలని, ఈ కమిటీలో కేంద్ర జల వనరుల నిపుణులతో పాటు రాజకీయ పార్టీలు సూచించే నిపుణులను చేర్చి పూర్తిస్థాయి అధ్యయనం చేయించి ఈ కమిటీ సిఫార్సు మేరకు తుది నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్రకార్యాలయం మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధా న కార్యదర్శి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ మాట్లాడారు. ఎల్‌నినో కారణంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సాగు నీటి సమస్య కంటే అధికార, ప్రతిపక్ష నాయకులు రాజకీయ పంతాలే ముఖ్యమన్నట్లుగా వ్యవహరిస్తున్నారని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాజకీయ నాయకుల భాష, సంస్కృతి చాలా అభ్యంతరకరంగా, ఇబ్బందికరంగా మారిందని, ఈ పదేళ్ల కాలంలో ఎప్పుడూ లేనటువంటి ఒక నీచమైన సంస్కృతికి తెర లేపారని, దీనికి ఆద్యుడు మాజీ సిఎం కెసిఆర్ అయితే, ఇప్పుడు ఆయనను మించిన భాషను వాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయాలా? వద్దా? అనే అంశం తేల్చేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు సాగు నీటి రంగ నిపుణులు కారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తరువాయి 8లో



## హెచ్‌ఎండిఎ చీఫ్ ఇంజినీర్ నివాసాల్లో ఎసిబి సోదాలు

● ఆదాయానికి మించిన ఆస్తుల గుర్తింపు ● ఇళ్లు, ప్లాట్లు, భూ పత్రాలు, వాహనాలు స్వాధీనం ● నాలుగు లక్షల నగదు, కిలోన్నర బంగారం, పన్నెండు కిలోల వెండి గుర్తింపు ● 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు ● ఎసిబికి చిక్కిన పెద్దపల్లి మున్సిపల్ ఎఇ

ప్రజాపక్షం/హైదరాబాద్/పెద్దపల్లి

రాష్ట్రంలో మరో అవినీతి అధికారి గుట్టురట్టు అయింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిఉన్నారన్న అభియోగాలపై అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఎ) చీఫ్ ఇంజినీర్ బి. రవీందర్‌పై కేసు నమోదు చేసింది. మంగళవారం ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులు, బినామీలకు చెందిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. సోదాల్లో సుమారు రూ.9.24 కోట్ల విలువైన ఆస్తులను అధికారులు గుర్తించారు. అయితే ఈ ఆస్తుల మార్కెట్ విలువ అధికారిక విలువ కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. సోదాల్లో కొండగల్, కిష్టాపూర్, పసుమాముల ప్రాంతాల్లో ఐదు ఓపెన్ ప్లాట్లు, నార్సింగి, నానక్‌రామ్‌గూడలో నాలుగు ఫ్లాట్లు, కొత్తూరు మండలం గూడూరు, శంషాబాద్ ప్రాంతాల్లో నాలుగు ఎకరాల వ్యవసాయ తరువాయి 8లో



## సిజిహెచ్‌ఎస్ ధరలతో ఆరోగ్యశ్రీకి సేవలందించలేం

● తెలంగాణ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటన ● ధరలు సవరించాలని వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సిజిహెచ్‌ఎస్) ప్యాకేజీ ధరలతోనే రాష్ట్ర ఆరోగ్య పథకాన్ని వర్తింపజేస్తే తాము సేవలందించలేమని తెలంగాణ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టిఎఎన్‌హెచ్‌ఎ) తెలిపింది. ఈ మేరకు టిఎన్‌హెచ్‌ఎ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేష్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర ఆరోగ్య పథకం సిఇఒను కలిసి వినతిపత్రం సమర్పించారు. పాత ఇహెచ్‌ఎస్ ధరల కంటే సిజిహెచ్‌ఎస్ ప్యాకేజీ తరువాయి 12లో

## సచివాలయం ముట్టడి..

# తీవ్ర ఉద్రిక్తం



● ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సెక్రటేరియట్ వైపు దూసుకెళ్లిన వందలాది మంది విద్యార్థులు
● నినాదాలతో దద్దరిల్లిన సచివాలయ పరిసరాలు
● అడ్డుకున్న పోలీసులు : ప్రతిఘటించిన వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు
● అరెస్ట్, స్టేషన్‌కు తరలింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యూ,ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్‌బి,ఎఐడిఎస్‌ఒ,ఎఐపిఎస్‌యు తదితర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో సచివాలయం' ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వందలాది మంది విద్యార్థులు, నాయకులు సచివాలయం వైపు దూసుకువెళ్లారు. విద్యార్థి సంఘాల చలో సచివాలయం పిలుపు నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ విద్యార్థులను, విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు అడ్డుకున్నప్పటికీ వందలాది మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చేరుకుని సచివాయం ముట్టడికి యత్నించారు. విద్యార్థి సంఘాల నేతృత్వంలో విద్యార్థులు ఒక్కసారిగా నినాదాలు చేస్తూ సచివాలయం సమీ పం వరకు దూసుకువెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘా లు నాయకులు విద్యార్థులు చేసిన నినాదాలతో సచివాలయం పరిసరాలు దద్దరిల్లాయి. సచివాలయం వైపు దూసుకువెళుతున్న విద్యార్థి నాయకులను పోలీసులు వెంబడించి అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తరువాయి 12లో

## ప్రభుత్వం చర్చలు జరిపేంత వరకూ

# దీక్ష విరమించ

● ప్రభుత్వం ఎందుకు చర్చలు జరపడం లేదో ప్రశ్నించండి : పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ● దీక్ష విరమించాలని ప్రతిపక్ష నేతలు, ప్రముఖులు విజ్ఞప్తి




**న్యూఢిల్లీ :** పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్షను విరమించడానికి నిరాకరించారు. కండరాల క్షీణత, తీవ్రమైన నొప్పి ఉన్నప్పటికీ, ప్రభుత్వం చర్చలు ప్రారంభించాలని ఆయన పట్టుబట్టారు. మంగళవారానికి ఆయన దీక్ష 17వ రోజు చేరింది. అలాగే కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన ఆందోళన 25వ రోజుకు చేరుకుంది. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై సిజెపి మంగళవారం బులెటిన్ విడుదల చేసింది. దీక్ష ప్రారంభించినప్పటి నుండి వాంగ్‌చుక్ బరువు 8.5 కిలోలు తగ్గారు. రక్తపోటు 109/70 ఎంఎం హెచ్‌జిగా నమోదైంది. వాంగ్‌చుక్ కండరాల బలాన్ని కోల్పోతున్నారని, తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. అందరిలాగే తాను కూడా దీక్ష విరమించమని ఆయనను బతిమిలాడానని, దీక్షను విరమించాలని తనను అడగడానికి బదులు, అసలు ప్రభుత్వం ఎందుకు చర్చలు జరపడం లేదో వారిని అడగండి అని సమాధానమిచ్చినట్లు దీప్కే ఎక్స్‌లో తరువాయి 8లో



## ఉమ్మడి ఎపి మాజీ మంత్రి ముద్రగడ కన్నుమూత

● రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల ప్రస్థానం ● కాపు రిజర్వేషన్ల కోసం నిరంతర పోరాటం చేసిన నాయకుడు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న తరువాయి 12లో

గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీ
వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ 03

వెంటనే ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి 12

## పోలవరంతో భద్రాద్రికి

# జల గండం?



● 4.88 లక్షల క్యూసెక్కులకే 71.3 అడుగుల వరద
● 2022 వరద ప్రమాద హెచ్చరికను దాటి ఉప్పెనగా మారిన వైనం
● బ్యాక్ వాటర్ లెక్కలు తేల్చకుంటే పెను ప్రమాదమే

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

పోలవరం ప్రాజెక్టు భద్రాచలం మన్యాన్ని జలగండంగా మార్చనుందా....? భారీ వరద వస్తే బ్యాక్ వాటర్ భద్రాద్రిని ముంచెత్తుతుందా..? ఇలాంటి అనేక భయాలు వెంటాడుతున్నాయి. అసలే ఇప్పుడు వరదల కాలం, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోయినప్పటికీ వాతావరణంలో పెనుమార్పులు సంభవించి భారీ వానలు పడితే జులై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వరదలు వచ్చే అవకాశాలు లేకపోలేదు. 2022లో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 71.3 అడుగులకు చేరింది. 24.88 క్యూసెక్కుల వరదనీరు ప్రవాహం నమోదైంది.1986 వరదల త ర్వాత అతి పెద్ద వరద 2022లో వచ్చింది. 1986 వరదల కంటే తక్కువే అయినప్పటికీ ఎక్కువ ప్రాంతాలు మునకకు గురయ్యాయి. ఈ వరదలు చూపిన ప్రమాద సంకేతా లు భవిష్యత్‌లో మరింత తీవ్రతరం కానున్నా యా, ఇదంతపోలవరం ప్రాజెక్టు వల్లే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి వరద తీరుతెన్నులు చూస్తే భద్రాచలానికి పొంచి ఉన్న ముప్పు అతి పెద్దదే అని ఇక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెండు తెలుగు రాష్ట్రాలు శాస్త్రీయ పద్ధతుల్లో లెక్కలు కట్టి నిజాలను ప్రజల ముంగిట ఉంచాలని కోరుతున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే సుమారు 50 లక్షల క్యూసెక్కుల గరిష్ట వరదనీటిని విడుదల చేసే సామర్థ్యంతో రూపొందించారు. ఇందులో సగం స్థాయి సామర్థ్యం 24.88 క్యూసెక్కుల వరద తరువాయి 12లో

## రాతియుగంలోకి ఇరాన్‌ను నెట్టేశాం

● రెండురోజులపాటు ఇంకా చావుదెబ్బ తీస్తాం ● చర్చలతో పరిష్కారానికి ఇంకా అవకాశం ఉంది ● అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన ● మళ్ళీ యుద్ధం మొదలైందని కాంగ్రెస్‌కు నోటీసు ● హోర్ముజ్ మాదేనని ఎంఒయు స్పష్టం చేసింది : ఇరాన్



**వాషింగ్టన్ :** ఇరాన్‌ను మళ్ళీ రాతియుగంలోకి నెట్టేశామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. మంగళవారం రాత్రి,బుధవారం రెండు రోజులపాటు మరింత చావు దెబ్బ తీయబోతున్నాం, ఈ విషయంలో వారు ఏమీ చేయలేరు అన్నారు. ఇరాన్‌కు చెందిన 84 శాతం సైనిక స్థావరాలను నిర్మూలించామని, ఇరాన్ సైన్యాలను చావుదెబ్బ తీశామన్నారు. పెద్ద పెద్ద నోళ్ళు తప్ప చెప్పుకోవడానికి వారి దగ్గర ఏమీ లేదన్నారు. కన్జర్వేటివ్ టాక్ షో సందర్భంగా హోస్ట్ హ్యూహెవిట్‌కు ట్రంప్ ఈ విషయం చెప్పారు. ఒకవైపు ఇరాన్‌ను నీచంగా చిత్రీకరిస్తూ, వారిపై విమర్శలు గుప్పిస్తూనే, ఇరాన్‌తో చర్చల ద్వారా ఒప్పందానికి ఇప్పటికీ ఇంకా అవకాశం ఉందని అన్నారు. పరిష్కారం సాధ్యం కాదనే విషయంపై తాను నిర్ణయం తీసుకోలేదన్నారు. క్యూబాలో కూడా ఇరాన్ తన డ్రోన్లు, క్షిపణులను నిల్వచేసే అవకాశం ఉందని, దానిపై ఇప్పుడు విచారణ చేస్తున్నామని, ఒకవేళ అలా నిల్వచేసే అదేమంత పెద్ద విషయం కాదని, అలా జరగనివ్వబోమని, దానిపై తాము చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌తో మళ్ళీ యుద్ధం ప్రారంభమైందని లాంఛనంగా అమెరికా తరువాయి 8లో

# 2029లో అమలులోకి 'ఒక దేశం – ఒక ఎన్నికలు'

'ఒక దేశం – ఒక ఎన్నికలు' బిజెపి ఆశాపూరిత పథకం. కాగా అది రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం, ప్రజాస్వామ్యం పనితీరుకు విరుద్ధం, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకమైన ఏకపక్ష నియంతృత్వ లక్షణం అనేది ప్రతిపక్షాల వాదన. దేశంలో ప్రతి ఏటా విడతలవారీ అసెంబ్లీ ఎన్నికల కారణాన ధనం వృధా వ్యయంతోపాటు అభివృద్ధి కుంటుపడుతుందనేది బిజెపి ప్రతివాదన. ఇది కేవలం సాకు మాత్రమేనని, అధికారం కేంద్రీకరణ, అధినాయకుని ఆకర్షక శక్తితో దేశమంతటికీ, అధికారం విస్తరణ, ప్రాంతీయ మనోభావాలను – ప్రాంతీయ పార్టీలను అణచివేసి ఏకపక్ష అధికారం నెలకొల్పటం బిజెపి ధ్యేయంగా ప్రతిపక్ష పార్టీల బలమైన వాదన. ఇది ఇంతటితో ఆగదని, పార్లమెంటరీ, ఫెడరల్ వ్యవస్థ బదులు యూనిటరీ పాలనా వ్యవస్థ (అధ్యక్ష తరహా పాలన)ను అభిలషించే బిజెపి సిద్ధాంతాన్ని నెరవేర్చుకునే దిశలో ప్రయాణానికి 'ఒక దేశం – ఒక ఎన్నికలు' బాటవేస్తాయని అనుమానాలు కూడా లేకపోలేదు. లోక్‌సభ సీట్లను 850కి పెంచి, నియోజకవర్గాల పునర్విభజనతో 2029 ఎన్నికలనుంచే మహిళా రిజర్వేషన్ అమలుకు మోదీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తున్నది.

చర్చలు, అపోహలు, తర్కవాదనలు ఎలా ఉన్నప్పటికీ 'ఒక దేశం– ఒక ఎన్నికలు' అమలులోకి తెచ్చే పట్టుదలతో నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ అంశం అధ్యయనం కోసం మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ అధ్యక్షతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ 2024 సెప్టెంబర్‌లో నివేదిక సమర్పించింది. లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు జరపటాన్ని సౌలభ్యం చేయటం ఎలా అన్నదే ఆ కమిటీకి ఇచ్చిన ఆదేశమైనందున అది అందుకు అనుకూలంగా నివేదిక ఇచ్చింది. ఆర్టికల్ 83(లోక్‌సభ కాలపరిమితి), ఆర్టికల్ 172(రాష్ట్ర అసెంబ్లీల పదవీకాలం) సవరించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని, ఆర్టికల్ 82 ఎ ని చేర్చాలన్నది కోవింద్ కమిటీ ముఖ్యమైన సిఫార్సుల్లో ఒకటి. ఈ సవరణకు రాష్ట్రాల ధృవీకరణ అక్కర్లేదట! రాష్ట్రాల్లో ఫిరాయింపులు తదితర కారణాలతో ప్రభుత్వాలు అర్థంతరంగా పడిపోయే అవకాశాన్ని అధిగమించేందుకు అసెంబ్లీలకు నిర్దిష్టమైన కాలపరిమితి ఉంటుంది. ప్రభుత్వం మెజారిటీ కోల్పోయినప్పుడు అసెంబ్లీని సస్పెన్షన్‌లో ఉంచి, రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంటుంది. పార్టీ లేదా పార్టీలు విభేదాలు సర్దుబాటు చేసుకుని మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఉంటుంది. లేదా ఎన్నికలు నిర్వహించాల్సివస్తే అవి సంబంధిత అసెంబ్లీ మిగతా కాలానికే పరిమితం చేయబడతాయి. మళ్లీ లోక్‌సభ ఎన్నికలతోపాటే అసెంబ్లీల ఎన్నికలు జరుగుతాయి. రాజకీయ అస్థిరతతో లోక్‌సభలో ఇదే పరిస్థితి (అర్థంతరంగా ప్రభుత్వం పడిపోవటం) తలెత్తితే – రాష్ట్రపతి పాలన విధించే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించనందున ఏమి చేస్తారు? ఇది వెల్లడించలేదు. పడిపోయిన ప్రభుత్వాన్నే ఆపద్ధర్మ ప్రభుత్వంగా కొనసాగిస్తూ త్వరలోనే ఎన్నికలు జరుపుతారా? అప్పుడు అసెంబ్లీల సంగతేమిటీ లేక అసెంబ్లీలకువలె లోక్‌సభకు కూడా ఫిక్స్‌డ్ టరం ప్రవేశపెడతారా? ఈ స్పష్టతకోసం కొంతకాలం వేచిచూడాలి.

ఒక దేశం – ఒక ఎన్నికల కోసం 129వ రాజ్యాంగ సవరణ బిల్లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ స్క్రూటినీలో ఉంది. 2029 నుండి ఏకకాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చట్రాన్ని రూపొందిస్తున్నామని ఆ కమిటీ చైర్మన్, బిజెపి ఎంపి పి.పి.చౌధురి ఇటీవల వెల్లడించారు. తాము ఇంతవరకు సంప్రదించిన పౌర సమాజ స్టేక్‌హోల్డర్స్‌లో దాదాపు 99శాతం 'ఒక దేశం – ఒకే ఎన్నికలు' ప్రతిపాదనను బలపరిచారని ఆయన చెప్పారు.

2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన్న కేంద్రప్రభుత్వ ప్రయత్నం అమలులోకి వస్తే, కనీసం 13 అసెంబ్లీల పదవీకాలం కుదించాల్సి ఉంటుంది, 10అసెంబ్లీలు రద్దు చేయాలి లేదా వాటి పదవీకాలం పొడిగించాల్సి ఉంటుంది. 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాలు – కర్నాటక, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, హిమాచల్‌ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, మిజోరం. వీటి ఎన్నికలను 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు జరపాలంటే ఈ అసెంబ్లీలను రద్దు చేయాలి లేదా వాటి పదవీకాలం పొడిగించాల్సి ఉంటుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు – 2029లో లోక్‌సభ ఎన్నికలతోపాటు జరుగుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించటం ఈ సందర్భంగా గమనార్హం. అలాగే 2027లో ఎన్నికలు జరిగే అసెంబ్లీల పదవీకాలాన్ని దాదాపు రెండు సంవత్సరాలు కోతపెట్టాల్సి ఉంటుంది. అవి – ఉత్తరప్రదేశ్, గుజరాత్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్. 2026లో ఎన్నుకోబడిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీల పదవీకాలం మూడేళ్లు మాత్రమే పూర్తవుతుంది. అలాగే బిహార్, ఢిల్లీ అసెంబ్లీల పదవీకాలం కూడా ఒక సంవత్సరం తగ్గుతుంది. గతలోక్‌సభ ఎన్నికలతోపాటు లేదా కొద్దినెలల అనంతరం అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, జమ్మూ –కశ్మీర్ ఎన్నికలను 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు జరిపేందుకు ఇబ్బంది ఉండదు.


ఇదో పెద్ద విన్యాసం. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చాక 1952 నుండి 1967 దాకా నాలుగు సార్వత్రిక ఎన్నికలు ఏకకాలంలోనే జరిగాయి. ప్రజల్లోని అసంతృప్తి, ప్రాంతీయ రాజకీయ శక్తుల ఆకాంక్షలు ఏకకాల ఎన్నికలను దారితప్పించాయి. తిరిగి పట్టాలెక్కించే ప్రయత్నం ఒక్క బిజెపి ఆకాంక్షగా కాకుండా ఉమ్మడి రాజకీయ ప్రయత్నంగా ముందుకు తెచ్చేందుకు పాలక బిజెపి చొరవ చేయకుండా అంతా ఏకపక్ష వ్యవహారంగా సాగించటం దాని రాజకీయ ఆకాంక్షల ప్రయోజనం అనుమానాలకు తావిస్తోంది. ●



## నావికులకు భద్రత, ఉగ్రవాదులకు నిధుల నియంత్రణకే ప్రాధాన్యం

**అంతర్జాతీయ జలాలలో నావికులకు భద్రత, ఉగ్రవాదులకు నిధులు అందకుండా అడ్డుకోవడం వంటి విషయాలకే భారతదేశం ప్రాధాన్యత ఇస్తుంది. అంతర్జాతీయ నియమావళికి అనుగుణంగా సముద్రంలో రవాణా కార్యకలాపాలు, సముద్రయానం కొనసాగాలని భారత్ గట్టిగా ఆకాంక్షిస్తోంది. నియమావళి ప్రకారం సముద్రయానం సాగినప్పుడు ఎలాంటి సమస్యలూ తలెత్తే అవకాశం ఉండదు. ఉగ్రవాదం రోజు రోజుకూ విస్తరిస్తున్న తరుణంలో వారికి వివిధ మార్గాలలో నిధులు అందకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. భద్రతామండలిలో భారతదేశం ఇప్పటివరకూ ఎనిమిదిసార్లు తాత్కాలిక సభ్యురాలుగా ఎన్నికై బాధ్యతలు నిర్వహించింది.**

– విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్




## ఉద్యోగానికి తొలిమెట్టు నైపుణ్యం

జులై 15 ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం (వరల్డ్ యూత్ స్కిల్ డే). ఐక్యరాజ్యసమితి 2014లో ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా యువతకు నాణ్యమైన నైపుణ్య విద్యను అందించడం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, స్వయం ఉపాధివైపు వారిని ప్రోత్సహించడం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో యువత పాత్రను బలోపేతం చేయడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. ప్రతి ఏడాది ఈ రోజు కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో యువత స్థానాన్ని, వారి నైపుణ్యాల ప్రాధాన్యాన్ని గుర్తు చేసే సందర్భంగా నిలుస్తోంది. ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవం దిశగా వేగంగా దూసుకుపోతోంది. కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), రోబోటిక్స్, ఆటోమేషన్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీలు ఉపాధి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 'స్కిల్' అనే పదానికి అపూర్వమైన ప్రాధాన్యం ఏర్పడింది. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. ఈ జనాభాను సరైన దిశలో నడిపితే భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రస్థానానికి చేరుకోగలదు. ఉన్నత విద్య పూర్తి చేసిన యువతలో కూడా పరిశ్రమలు కోరుకునే సాంకేతిక, డిజిటల్, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యాలు కొరవడుతున్నాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్కిల్ ఇండియా మిషన్, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన,డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటిఐలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా ఉపాధి ఆధారిత శిక్షణను విస్తరిస్తున్నాయి. అయినప్పటికీ ఈ కార్యక్రమాల ఫలితాలు ప్రతి గ్రామానికి, ప్రతి నిరుద్యోగ యువకుడికి చేరేలా అమలు జరగడం అత్యంత అవసరం. ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి యువతకు నైపుణ్యాలను అందించే ఉద్యమంగా ముందుకు సాగాలి.

**ఆళవందార్ వేణు మాధవ్**
8686051752,హైదరాబాద్

# అమెరికా–చైనా హైటెక్ పోటీకి కొత్త వేదిక షాంఘై



నిత్యా చక్రవర్తి

చైనాలోని షాంఘై నగరంలో ఈనెల 17 నుంచి 20 వరకు జరగనున్న ప్రపంచ కృత్రిమ మేధస్సు సదస్సు (వరల్డ్ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్/డబ్ల్యుఎఐసి) 2026 ప్రపంచ సాంకేతిక రంగంలో అత్యంత ప్రాధాన్యమైన సమావేశంగా భావిస్తున్నారు. ఈ సదస్సు కేవలం కొత్త కృత్రిమ మేధస్సు (ఎఐ) సాంకేతికతలను ప్రదర్శించే వేదిక మాత్రమే కాదు. కృత్రిమ మేధస్సు (ఎఐ) నిర్వహణ, అంతర్జాతీయ సహకారం, సాంకేతిక ప్రమాణాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎఐ సాంకేతికత అందుబాటు వంటి కీలక అంశాలపై భవిష్యత్ దిశను నిర్దేశించే సమావేశంగా ప్రపంచ దేశాలు దీనిని చూస్తున్నాయి. భారతదేశంతో పాటు ప్రపంచంలోని అనేక దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ప్రస్తుతం ప్రపంచ సాంకేతిక రంగంలో అమెరికా, చైనా మధ్య తీవ్రమైన ఆధిపత్య పోటీ కొనసాగుతోంది. సెమీకండక్టర్లు, సూపర్ కంప్యూటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఎఐ మోడళ్లు, డేటా సెంటర్లు, రోబోటిక్స్ వంటి రంగాల్లో రెండు దేశాలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. అందువల్ల షాంఘై సదస్సు ప్రపంచ ఎఐ భవిష్యత్తును నిర్ణయించే ఒక దౌత్య, సాంకేతిక వేదికగా కూడా మారింది. సుమారు ఇరవై ఆరు సంవత్సరాల క్రితం ఇదే షాంఘై నగరంలో జరిగిన కంప్యూటర్ సదస్సు డాట్‌కామ్ సంక్షోభం తర్వాత ఐటి పరిశ్రమ ఎదుర్కొన్న సవాళ్లపై చర్చించింది. ఆ సంక్షోభం నుంచి ప్రపంచ ఐటి రంగం క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ టెక్నాలజీ, సోషల్ మీడియా, బిగ్ డేటా వంటి దశలను దాటి ఇప్పుడు ఎఐ యుగంలోకి ప్రవేశించింది. ప్రస్తుతం ఎఐ రంగంలో భారీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతున్నది. అయితే ఈ పెట్టుబడులకు తగిన లాభాలు వస్తాయా? లేదా? అనే సందేహాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. కొందరు నిపుణులు 2000 సంవత్సరంలోని 'డాట్‌కామ్ బుడగ' మాదిరిగానే ఎఐ రంగంలో కూడా అతిగా పెట్టుబడులు పెరిగి భవిష్యత్తులో ఆర్థిక ఒత్తిడులు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అమెరికా ఇప్పటికీ ప్రపంచ ఎఐ రంగంలో అగ్రస్థానంలో ఉంది. భారీ పెట్టుబడులు, అత్యాధునిక పరిశోధన, ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక సంస్థలు, అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు ఈ రంగంలో అమెరికా బలాన్ని పెంచుతున్నాయి. అయితే ఎఐ రంగంలో అమెరికా సంస్థల మార్కెట్ విలువలు అసాధారణంగా పెరగడం వల్ల భవిష్యత్తులో పెట్టుబడిదారులకు ప్రమాదాలు ఎదురయ్యే అవకాశాన్ని ఆర్థిక విశ్లేషకులు ఊహిస్తున్నారు. ఎఐ రంగంపై అత్యధికంగా ఆధారపడటం నాస్‌డాక్ వంటి సాంకేతిక షేర్ మార్కెట్లపై కూడా ప్రభావం చూపవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు చైనా పూర్తిగా భిన్నమైన వ్యూహాన్ని అనుసరిస్తోంది. తక్కువ పెట్టుబడులతో, దేశీ య సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందిస్తూ, ఓపెన్ సోర్స్ ఎఐ నమూనాలను అభివృద్ధి చేస్తోంది. 'డీప్‌సీక్', 'క్వెన్' వంటి చైనా అభివృద్ధి చేసిన ఎఐ మోడళ్లు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వేగంగా ఆదరణ పొందుతున్నాయి. వీటిని ఉపయోగించడానికి అయ్యే వ్యయం తక్కువగా ఉండటంతో చిన్న సంస్థలు, విద్యా సంస్థ లు, పరిశోధనా కేంద్రాలకు కూడా ఎఐ అందుబాటులోకి వస్తోంది. చైనా అభిప్రాయం ప్రకారం కృత్రిమ మేధస్సు కొద్ది దేశాల ఆధిపత్య సాధనంగా కాకుండా ప్రపంచవ్యాప్తంగా అందరికీ ఉపయోగపడే ప్రజా సాంకేతిక వనరుగా మారాలి.

'ఉజ్వల భవిష్యత్తు కోసం ఎఐ భాగస్వామ్యం' అనేది ఈ ఏడాది డబ్ల్యుఎఐసి ప్రధాన అంశం. దీని ద్వారా సాంకేతిక పోటీతో పాటు అంతర్జాతీయ సహకారాన్ని కూడా ప్రోత్సహించాలనే లక్ష్యాన్ని చైనా ప్రకటించింది. ప్రపంచ ఎఐ పాలన, భద్రతా ప్రమాణాలు, డిజిటల్ అసమానత తగ్గింపు, ఎఐ పరిశ్రమలో న్యాయమైన వాణిజ్యం, హ్యూమనాయిడ్ రోబోటిక్స్, డిజిటల్ ఆస్తుల నియంత్రణ వంటి అనేక అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఈ సదస్సులో 1,400 మందికి పైగా ప్రముఖులు, వెయ్యికి పైగా కంపెనీలు పాల్గొననున్నాయి. మూడు వేలకుపైగా అత్యాధునిక ఎఐ ఉత్పత్తులు, మూడు వందలకుపైగా కొత్త సాంకేతిక



పరిష్కారాలు తొలిసారిగా ప్రపంచానికి పరిచయం కానున్నాయి. మేధో గణన (ఇంటెలిజెన్స్ కంప్యూటింగ్), ఎంబాడీడ్ ఎఐ, రోబోటిక్స్ వంటి విభాగాల్లో వందలాది సంస్థలు తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తాయి.

అమెరికా–చైనా పోటీకి ఇటీవల జరిగిన ఒక పరిణామం కొత్త ఊపునిచ్చింది. జర్మనీలో నిర్వహించిన అంతర్జాతీయ సూపర్ కంప్యూటింగ్ సదస్సులో చైనా తయారు చేసిన 'లైన్‌షైన్' సూపర్ కంప్యూటర్ ప్రపంచంలోనే అత్యుత్తమ సూపర్ కంప్యూటర్‌గా గుర్తింపు పొందింది. అమెరికా తయారు చేసిన 'ఎల్ కాపిటాన్'ను అధిగమిస్తూ ఈ కంప్యూటర్ సుమారు 20 శాతం అధిక పనితీరును కనబరిచినట్లు నిర్వహకులు ప్రకటించారు. ఈ విజయంతో అమెరికా సాంకేతిక ఆధిపత్యానికి గట్టి సవాలు ఎదురైంది. లైన్‌షైన్‌ను చైనా పూర్తిగా దేశీయ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. అమెరికా విధించిన అధునాతన చిప్‌లు, జిపియుల ఎగుమతి ఆంక్షల మధ్య కూడా చైనా స్వదేశీ చిప్‌లు, నిల్వ వ్యవస్థలు, ఇంటర్‌కనెక్ట్ సాంకేతికత, శీతలీకరణ వ్యవస్థలను ఉపయోగించి ఈ సూపర్ కంప్యూటర్‌ను రూపొందించింది. అంతేకాదు, ప్రస్తుతం ప్రపంచంలోని అధిక భాగం సూపర్ కంప్యూటర్లు జిపియులపై ఆధారపడుతుండగా, లైన్‌షైన్ మాత్రం సిపియుల ఆధారంగానే ఎక్సాస్కేల్ స్థాయి పనితీరును సాధించడం విశేషం. ఇది చైనా సాంకేతిక స్వావలంబనకు నిదర్శనంగా నిలిచింది. ఎఐ రంగంలో పెట్టుబడుల పరంగా అమెరికా ఇప్పటికీ భారీ ఆధిక్యంలో ఉంది. గత కొన్ని సంవత్సరాల్లో అమెరికా ట్రిలియన్ల డాలర్ల స్థాయిలో ఎఐ మౌలిక వసతులపై పెట్టుబడులు ప్రకటించింది. యూరప్, సౌదీ అరేబియా వంటి దేశాలు కూడా భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. అయితే ఎక్కువ పెట్టుబడుల కంటే తక్కువ ఖర్చుతో విస్తృత వినియోగాన్ని పెంచడంపై చైనా దృష్టి పెట్టింది. స్టార్టప్‌లకు లభించే పెట్టుబడుల్లో కూడా అమెరికా ముందంజలో ఉంది. 2024లో అమెరికా ఎఐ సంస్థలు వంద బిలియన్ డాలర్లకు పైగా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించగా, చైనా సంస్థలకు వచ్చిన పెట్టుబడులు దానికంటే చాలా తక్కువ. అయినప్పటికీ వినియోగదారుల వరకు ఎఐ సేవలను చేరవేయడంలో చైనా ప్రత్యేక విధానాన్ని అనుసరిస్తోంది. అమెరికాలో అనేక ఎఐ సేవలు నెలవారీ చందాలపై ఆధారపడితే, చైనాలోని అనేక సంస్థలు ఉచితంగా ఎఐ సేవలు అందించి ప్రకటనలు, క్లౌడ్ సేవలు, వ్యాపార ఎపిఐల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి.

పారిశ్రామిక రంగంలో ఎఐ వినియోగంలో చైనా మరింత వేగంగా ముందుకు సాగుతోంది. చైనా తయారీ పరిశ్రమల్లో మూడవ వంతుకు పైగా సంస్థలు ఇప్పటికే ఎఐని ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగిస్తుండగా, అమెరికాలో ఈ శాతం గణనీయంగా తక్కువగా ఉంది. అంటే అమెరికా అత్యుత్తమ ఎఐ నమూనాల అభివృద్ధిలో ముందంజలో ఉంటే, చైనా వాటిని పారిశ్రామిక రంగంలో విస్తృతంగా అమలు చేయడంలో ముందుందని అర్థమవుతున్నది. కాగా, నిపుణుల అభిప్రాయం ప్రకారం అమెరికా, చైనా రెండూ పూర్తి స్వయం సమృద్ధిని సాధించలేదు. ప్రతి దేశం కొన్ని రంగాల్లో ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరస్పర ఆధారపడే వ్యవస్థలోనే భవిష్యత్ అంతర్జాతీయ భాగస్వామ్యాలు రూపుదిద్దుకోనున్నాయి. చిన్న దేశాలు కూడా తగిన మౌలిక వసతులు, చౌకైన విద్యుత్, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఉపయోగించుకొని ఎఐ రంగంలో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించగలవని విశ్లేషకులు సూచిస్తున్నారు. భారతదేశం కూడా ఎఐ రంగంలో వేగంగా ముందుకు సాగుతోంది. డేటా సెంటర్ల నిర్మాణం, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, ఎఐ ఆధారిత పరిశోధనలకు ప్రభుత్వం ప్రాధా న్యం ఇస్తోంది. భారతీయ ఐటి సంస్థలు ఉత్పాదకత పెంపు కోసం ఎఐని విస్తృతంగా వినియోగిస్తున్నాయి. అయితే ఎఐ కారణంగా కొన్ని ఉద్యోగాలు తగ్గిపోవడం, కొత్త నైపుణ్యాల అవసరం పెరగడం వంటి సవాళ్లు కూడా ఉన్నాయి. నిరుద్యోగం ఇప్పటికే పెద్ద సమస్యగా ఉన్న భారతదేశం వంటి దేశాల్లో ఎఐ విస్తరణతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి భద్రత వంటి అంశాలపై సమతుల్య విధానాలు అవసరం. మొత్తం మీద షాంఘై ప్రపంచ ఎఐ సదస్సు విజయవంతమైతే అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎఐ సాంకేతికతను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి అంతర్జాతీయ కార్యాచరణ రూపొందే అవకాశం ఉంది. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, విపత్తు నిర్వహణ, ప్రజాసేవల రంగాల్లో ఎఐను సమర్థంగా వినియోగించడం ద్వారా పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదం చేయవచ్చు. అమెరికా, చైనా వంటి మహాశక్తులు పోటీతో పాటు సహకారాన్ని కూడా ప్రోత్సహించి ప్రపంచ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుంటే ఎఐ నిజమైన మానవాభివృద్ధికి శక్తివంతమైన సాధనంగా మారుతుంది. ఈ దిశగా విధాన రూపకల్పనలో భారతదేశం కూడా నిర్మాణాత్మక పాత్ర పోషించే అవకాశం ఉంది.

# నిజం, ఊహల మధ్య రేఖ మసకబారుతోందా?

ఒకప్పుడు ఫోటోను చూసినా, వీడియోను చూసినా వాస్తవానికి ప్రతిరూపంగా భావించేవారు. అంటే మనం చూసే ప్రతి చిత్రం, ప్రతి వీడియో వెనుక ఒక కెమెరా, ఒక సంఘటన, ఒక నిఖార్సయిన వాస్తవం ఉండేది. కానీ నేడు ఉత్పాదక కృత్రిమ మేధస్సు (జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎఐ) విస్తృతితో ఆ పాత నమ్మకం పునాదులతో సహా కదిలిపోతోంది. ఇప్పుడు మనిషి కంటికి అసాధ్యంగా అనిపించే దృశ్యమైనా, కెమెరా ఎన్నడూ చూడని ఘటన అయినా, కేవలం కొన్ని పదాల 'టెక్స్ట్ ప్రాంప్ట్'తో వాస్తవంలా కనిపించే అద్భుతమైన చిత్రాలు, వీడియోలు సృష్టించబడుతున్నాయి. ఈ పరిణామం నేపథ్యంలో ప్రధాన ప్రశ్న ఏఐ చిత్రాలు ఎంత అందంగా ఉన్నాయి? అనేది కాదు; మనకు కనిపిస్తున్నదంతా నిజమేనా? అన్నది. అసలు ఊహకు, నిజానికి మధ్య ఉన్న సరిహద్దు రేఖ మసకబారుతోందా? ఊహాశక్తి వాస్తవాన్ని కప్పివేస్తోందా? అనే ప్రశ్నలు ఇప్పుడు మనల్ని లోతుగా ఆలోచింపజేస్తున్నాయి.

నేటి దృశ్య కృత్రిమ మేధస్సు (విజువల్ ఎఐ) సామర్థ్యాలు మానవ ఊహాశక్తిని అపారంగా విస్తరించాయి. చంద్రుడిపై పాఠశాలలు, సముద్రం అడుగున నిర్మించిన నగరం, వర్షంలో నడుస్తున్న పురాణ యోధుడు, సూర్యాస్తమయం సమయం లో చంద్రుడిపై నడుస్తున్న ఒక భారతీయ వ్యోమగామి – ఇలాంటి వ్యాక్యాలు ఒకప్పుడు కేవలం ఊహల్లో మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు కొన్ని పదాలు టైప్ చేస్తే చాలు, కొన్ని క్షణాల్లోనే అవి ఫోటోరియలిస్టిక్ రూపంలో మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తున్నాయి. ఓపెన్ ఎఐ సోరా (Open AI Sora) వంటి అత్యాధునిక వ్యవస్థలు కేవలం స్టిల్ ఇమేజ్‌లను మాత్రమే కాకుండా, బహుళ పాత్రలు, నిర్దిష్ట చలనాలు, సంక్లిష్ట భావోద్వేగాలు, దృశ్య శైలిలో స్థిరత్వం కలిగిన 'ఫోటోరియలిస్టిక్' వీడియోలను కూడా సృష్టించగలవని నిరూపించాయి.

ఎఐ సృజనాత్మక ప్రపంచానికి విప్లవాత్మక అవకాశాలను తెరిచింది. సినిమా, విద్య, ప్రకటనలు, గేమింగ్, డిజైన్, వైద్యం వంటి ఎన్నో రంగాల్లో ఏఐ చిత్రాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. కళారంగంలో ఒక చిన్న బడ్జెట్ సినిమా నిర్మాణంలో దర్శకుడు పెద్ద స్టూడియో స్థాయి కాన్సెప్ట్ విజువల్స్‌ను ఏఐ అప్లికేషన్స్‌తో వేగంగా, తక్కువ బడ్జెట్లో రూపుదిద్దుకోవచ్చు.విద్యారంగంలో ఉపాధ్యాయులు సంక్లిష్టమైన విజ్ఞాన భావనలను దృశ్యరూపంలో చూపిస్తూ, విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లుగా సులభతరంగా విద్యాబోధన చేయవచ్చు. చరిత్రకారులు గతాన్ని దృశ్యరూపంలో పునర్నిర్మించవచ్చు; నగరనిర్మాణ శిల్పి ఇంకా కట్టని నగరాన్ని ముందే ఎఐ ఊహాశక్తితో వీక్షించవచ్చు. ఒక రచయిత తన నవలలోని ప్రపంచాన్ని కళ్ల ముందు నిలబెట్టగలడు. ఇలా ఎఐ మనిషి ఊహను వాస్తవంగా కనిపించే దృశ్యంగా మారుస్తూ అద్భుతాలను సృష్టిస్తూ... మనిషి ఊహకు రెక్కలుగా మారుతుంది.


**ఎఐ ఊహా చిత్రాలు – మనిషి ఇంద్రియశక్తికి సవాల్**

కృత్రిమ మేధస్సు మనిషి ఊహకు వాస్తవ రూపాన్ని ఇస్తూ అద్భుతాలను సృష్టిస్తుంది. అయితే ఇక్కడ ఆలోచించాల్సిన అసలు విషయమేమిటంటే — ఎఐ కేవలం ఊహా చిత్రాలను మాత్రమే గీయడం లేదు; అది నిజాన్ని గుర్తించే మనిషి ఇంద్రియశక్తినే పరీక్షిస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక (World Economic Forum) ప్రచురించిన ఒక వివరణలో, లాంకాస్టర్ యూనివర్సిటీకి చెందిన సోఫీ నైటింగేల్, డిజిటల్ ఫోరెన్సిక్స్ నిపుణుడు హానీ ఫరీద్‌ల సంయుక్త పరిశోధనలో ఒక దిగ్భ్రాంతికరమైన విషయం వెలుగుచూసింది. ఏఐ సృష్టించిన కృత్రిమ (సింథటిక్) ముఖాలు నిజమైన ముఖాల కంటే ఎక్కువ విశ్వసనీయమైనవిగా మనుషులు రేటింగ్ ఇచ్చారు. సగటున ఆ కృత్రిమ ముఖాలు నిజమైన ముఖాల కంటే 7.7% ఎక్కువ నమ్మదగినవిగా (trustworthy) గుర్తించబడ్డాయి. ఇది చాలా ప్రమాదకరమైన సంకేతం. మోసం గుర్తించడంలోనే కాదు, నిజం చూడడంలోనూ మనిషి కళ్లకు ఉన్న శక్తిని ఎఐ చిత్రాలు మోసం చేస్తున్నాయి.

ఇది అత్యంత ప్రమాదకరమైన పరిణామం. ఎందుకంటే ఇప్పటివరకు మనం మన కళ్లతో చూసినదే నిజం అనే భావన మీదే ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నాం. కానీ నేడు సామాజిక మాధ్యమాల్లో జరగని అల్లర్లు జరిగినట్టుగా, చెప్పని మాటలు చెప్పినట్టుగా, అసలు సంభవించని ప్రకృతి విపత్తులు జరిగినట్టుగా ఎఐ సృష్టించిన చిత్రాలు వైరల్ అవుతున్నాయి. అంటే ఇప్పుడు ఒక అబద్ధానికి కేవలం మరో అబద్ధపు మాటల మద్దతే కాదు — నిజంలా కనిపించే అబద్ధపు దృశ్యం కూడా సాక్ష్యంగా నిలుస్తోంది.

**డీప్‌ఫేక్ యుగం: 'జ్ఞాన సంక్షోభం' మరియు 'లైయర్స్ డివిడెండ్'**

ఎఐ ఇప్పుడు కేవలం చిత్రాల వరకే పరిమితం కాలేదు. వీడియోలు, స్వరాలు, ముఖ కవళికలు, మాట్లాడే తీరు — ఇవన్నీ కూడా నిజంలా సృష్టించగలుగుతోంది. డీప్‌ఫేక్ సాంకేతికతతో ఒక వ్యక్తి చేయని పనిని చేసినట్టుగా చూపించడం,




చెప్పని మాటలు చెప్పినట్టుగా వినిపించడం కూడా సాధ్యమవుతోంది. దీంతో ఒక కొత్త ప్రమాదం ముంచుకొస్తుంది. అదేమిటంటే, నిజాన్ని అబద్ధంగా మార్చడం మాత్రమే కాదు అబద్ధాన్ని కూడా నిజంలా చూపించగలగడం. దీనినే యునెస్కో (UNESCO, United Nations Educational, Scientific and Cultural Organization), 'జ్ఞాన సంక్షోభం (Crisis of knowing )' గా అభివర్ణించింది. అంటే మనం చూసేది, వినేది, సమాజంతో పంచుకునేది నిజమా? కాదా? అన్న మౌలిక జ్ఞానవ్యవస్థకే ముప్పు వాటిల్లుతోందని. ఈ పరిస్థితిలో ప్రమాదం రెండు దిశల్లో ఉంటుంది. మొదటిది, అసత్యాన్ని నిజమని నమ్మడం. సోషల్ మీడియాలో వైరల్ అయ్యే జరగని అల్లర్లు, లేని ప్రకృతి విపత్తులు, రాజకీయ నాయకులు చెప్పని మాటలను 'డీప్‌ఫేక్' (Deepfake) సాంకేతికత ద్వారా నిజమని నమ్మి ప్రజలు భావోద్వేగాలకు లోనుకావడం. రెండవది, నిజాన్ని అసత్యంగా త్రోసిపుచ్చడం. సమాజంలో నిజంగా జరిగిన సంఘటనను కూడా 'ఏఐ సృష్టించిన దృశ్యమే' అంటూ సులభంగా తప్పించుకోవడం. ఈ రెండో పరిస్థితినే నిపుణులు 'లైయర్స్ డివిడెండ్ (Liar's dividend)' అంటారు. అబద్ధాలకోరులకు ఎఐ ఒక రక్షణ కవచంగా మారుతోంది. ఒకప్పుడు కోర్టుల్లో, చరిత్రలో, వార్తల్లో ఫోటోలను బలమైన సాక్ష్యాధారాలుగా భావించేవారు. కానీ ఇప్పుడు ఒక చిత్రాన్ని నమ్మడానికి దాని మూలం, మెటాడేటా, ధృవీకరణ వంటి అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇకపై ఒక ఫోటోను చూడగానే ఈ ఫోటో నిజమా? కాదా?,దీన్ని ఎవరు సృష్టించారు? దీని మూలం ఏమిటి?, ఇది ఎలాంటి మార్పులకు గురైంది? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సి వస్తోం ది. అంటే నేడు నిజం ఒకప్పటిలా కంటికి కనిపించేదిగా మాత్రమే లేదు; మూలాలతో సహా ధృవీకరించుకోవాల్సిన అంశంగా మారుతోంది.

**కళాకారులకు ఏఐ వరమా? శాపమా?**

గంటలు, రోజుల తరబడి శ్రమించి ఒక చిత్రాన్ని గీసే కళాకారుడి స్థానంలో, కొన్ని సెకన్లలోనే ఎఐ వేలాది చిత్రాలను రూపొందిస్తుండటం సృజనాత్మక రంగంలో ఆందోళన కలిగిస్తోంది. ఇది మనిషి శ్రమను, కళ యొక్క విలువను తగ్గిస్తుందా అనే చర్చ ఇప్పుడు విస్తృతంగా జరుగుతోంది. అయితే, సాంకేతికత ఎప్పుడూ మానవ మేధస్సుకు పూర్తి స్థాయి ప్రత్యామ్నాయం కాలేదు. నేడు చాలామంది కళాకారులు ఎఐను ఒక శక్తివంతమైన సహాయక సాధనంగా (Copilot) ఉపయోగిస్తున్నారు. ఎఐ మనిషి ఆలోచనలకు వేగంగా రూపం ఇవ్వగలదు. కానీ మానవ జీవిత అనుభవం నుంచి, హృదయ లోతుల్లోంచి పుట్టే భావోద్వేగాన్ని మాత్రం ఎప్పటికీ భర్తీ చేయలేదు. ఒక కళాకారుడి ఊహకు ఎఐ రూపం ఇవ్వగలదు గానీ, ఆ ఊహ వెనుక ఉన్న జీవితం, అనుభూతి, భావ ప్రపంచాన్ని స్వయంగా సృష్టించలేదు.

**కృత్రిమ మేధస్సు పదునెక్కిన కత్తిలాంటిది**

ఒక పదునెక్కిన కత్తితో పండును కోయవచ్చు. అదే కత్తితో ఇతరులకు హాని కూడా చేయవచ్చు. కృత్రిమ మేధస్సు (ఎఐ) కూడా అలాంటిదే. స్వతహాగా ఎఐలో మంచి, చెడు అనే స్వభావాలు ఉండవు. దాన్ని ఉపయోగించే మనిషి ఆలోచనా విధానమే దాని ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. విద్య కోసం ఉపయోగిస్తే అది జ్ఞానాన్ని అందిస్తుంది. కళ కోసం ఉపయోగిస్తే సృజనాత్మకతను పెంచుతుంది. చరిత్ర కోసం ఉపయోగిస్తే అలనాటి చారిత్రాత్మక ఘట్టాలను కళ్లముందు నిలబెడుతుంది. కానీ హింస, మోసం, ద్వేషప్రచారం, వినాశనం కోసం ఉపయోగిస్తే సమాజాన్ని, దేశాన్ని, మనుషుల మధ్య ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. అంటే కృత్రిమ మేధస్సు కేవలం ఒక సాధనం మాత్రమే; అసలు సూత్రధారి మాత్రం మనిషి ఆలోచనా విధానమే.

అందుకే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా C2PA (Coalition for Content Provenance and Authenticity) వంటి ఓపెన్ స్టాండర్డ్‌లు, అలాగే కంటెంట్ క్రెడెన్షియల్స్ వంటి వ్యవస్థలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఇవి ఒక డిజిటల్ ఫైల్ ఎక్కడి నుంచి వచ్చింది, దానిలో ఎలాంటి మార్పులు జరిగాయి, దాన్ని ఎవరు సృష్టించారు వంటి 'ప్రోవెనాన్స్' (Provenance — మూల చరిత్ర) సమాచారాన్ని భద్రపరుస్తాయి. భవిష్యత్తులో నిజం కంటికి నేరుగా కనిపించకపోవచ్చు. కానీ దాని డిజిటల్ చరిత్రలో మాత్రం అది నిక్షిప్తమై ఉండే అవకాశం ఉంది.

ఎఐ మన కళ్లను మోసం చేయగలదు. కానీ సమాజం నైతిక ప్రమాణాలతో, వివేకంతో కొత్త నియమాలను నిర్మించుకుంటే 'నిజం' ఎన్నటికీ మాయమవదు; అది మరింత బాధ్యతాయుతమైన రూపంలో పునర్నిర్వచించబడుతుంది. సాంకేతికత ఎంత శక్తివంతమైనదైనా, నిజాన్ని శోధించే మానవ వివేకమే సమాజాన్ని రక్షించగలదు. సాంకేతికతను మానవ సమాజ అభివృద్ధికి ఉపయోగించినప్పుడే దాని సృష్టికి విలువ, గౌరవం, అర్థం, పరమార్థం ఉంటాయి. అందుకే మనమందరం సాంకేతికతను వివేకంతో ఉపయోగిస్తూ, నిజం, ఊహల మధ్య ఉన్న రేఖ మసకబారకుండా పదిలంగా కాపాడుకుందాం.

నసుబోలు రాజశేఖర్,
శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం,
9885739808,

# గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీ

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. ఐటిడిఎల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీస్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పిహెచ్‌సిలను మంజూరు చేస్తామన్నారు. కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు,ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనిసాంబశివ రావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టిజీఎంఎస్ఐడీసీ ఎండి డాక్టర్ గౌరవ్‌ఉప్పల్, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్,కొత్తగా నాలుగు డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకు గానూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు,ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్సులను మంజూరు చేయాలన్నారు. వర్ష కాలం నేపథ్యంలో పిహెచ్‌సిలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

కొత్తగూడెం సహా అటవీ ప్రాంతాల్లో ఉన్న అన్ని పీహెచ్‌సిలలో జనరేటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్వారిగూడెం, అన్నపెరటిపల్లి పిహెచ్‌సిలను అప్‌గ్రేడ్ చేస్తామని, గండుగులపల్లిలో కొత్త సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కొమురారం హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ఎల్లందు హాస్పిటల్‌లో కొత్త ఐసీయూను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

కొత్తగూడెం జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. అన్నిరకాల మెడిసిన్, డయాగ్నస్టిక్ కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అవసరమైన వైద్య పరికరాలు ప్రతి హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉండాలని,అవసరమైతే ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించాలన్నారు.

**అటవీ ప్రాంతాల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారికి పోస్టింగులు ఇవ్వండి**

భద్రాచలం, అశ్వారావుపేట వంటి అటవీ ప్రాంతాల్లో పనిచేసేందుకు ఆసక్తి కనబర్చిన డాక్టర్లు, సిబ్బందికి ఆయా హాస్పిటళ్లలలో పోస్టింగ్స్ ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శికి మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులు, సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్పిటల్స్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్ మానిటరింగ్ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేలకు మంత్రి వివరించారు.

**త్వరలోనే ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్సులు :** కొత్తగూడెం జిల్లాలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ మంజూరు చేశామని, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్సులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 7 డయాలసిస్ సెంటర్లు ఉండగా, కొత్తగా మరో 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేశామన్నారు. కేవలం 20 నిమిషాల ప్రయాణంతో పేషెంట్ డయాలసిస్ సెంటర్‌కు చేరుకునేలా డయాలసిస్ నెట్వర్క్‌ను విస్తరించామన్నారు. భద్రాచలం, అశ్వరావుపేట, ఎల్లందు సహా ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామనిమంత్రి హామీనిచ్చారు.

**కొత్తగూడెం వైద్య కళాశాల నిర్మాణాన్ని త్వరితగిన పూర్తి చేయండి: కూనంనేని**

కొత్తగూడెం వైద్య కళాశాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఎంసిహెచ్, జిజిహెచ్ మధ్య దూరం ఎక్కువగా ఉన్నందన ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలని సూచించారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని,అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు మంత్రి దామోదర రాజనర్సింహ స్పందిస్తూ కొత్తగూడెం ఎంసిహెచ్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్సును మానిటర్ చేసేందుకు ఒక డాక్టర్‌ను ప్రత్యేకంగా నియమించాలని అధికారులను ఆదేశించారు.



## ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి

### ఇసికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం నేతృత్వంలో టిపిసిసి ప్రతినిధి బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి.సుదర్శన్ రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రతినిధుల బృందం మంగళవారం కలిసి విజ్ఞప్తి చేసింది. ఓటరు నమోదు, సవరణ ప్రక్రియకు మరింత సమయం కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యంగా హైదరాబాద్ జిల్లాలోని 15 శాసనసభ నియోజకవర్గాల్లో ఓటరు సవరణ ప్రక్రియ ఆశించిన వేగంతో సాగడం లేదని తెలిపారు. జిల్లాలో సగటున కేవలం 21 శాతం మాత్రమే సవరణ పూర్తయిందని, ప్రస్తుతం మిగిలిన 10 రోజుల గడువు సరిపోదని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఎస్ఐఆర్ గడువును వెంటనే పొడిగించాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా సుమారు 4,500 పోలింగ్ కేంద్రాలు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఓటరు సవరణ ప్రక్రియ మందగించిందన్నారు. బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఒలు) ఇంటింటికీ వెళ్లడం లేదని, ఎన్యూమరేషన్ ఫారాలు సక్రమంగా అందించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ప్రక్రియను వేగవంతం చేయడానికి ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, జిహెచ్ఎంసి సిబ్బంది సహకారాన్ని వినియోగించాలని ఎన్నికల సంఘానికి సూచించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలిసిన వారిలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్, నవీన్ యాదవ్, డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్, మోతె రోహిత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన

# బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్–2026

### 14 దేశాల నుంచి 110 మంది ప్రతినిధుల హాజరు
### కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధిపై మూడురోజులపాటు చర్చలు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ కార్మిక రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్–2026 మంగళవారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీ, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సంయుక్తంగా సదస్సును ప్రారంభించారు. జూలై 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు ఈ అంతర్జాతీయ సదస్సు కొనసాగనుంది. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కార్మికులకు సామాజిక భద్రత, ఉద్యోగ భరోసా కల్పించినప్పుడే పరిశ్రమల్లో ఉత్పాదకత పెరుగుతుందని అన్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ), ఆటోమేషన్ వంటి సాంకేతిక మార్పులతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోందని, ఈ పరిస్థితుల్లో కార్మికులకు నైపుణ్యాభివృద్ధి, నిరంతర శిక్షణ, సామాజిక భద్రత అత్యంత అవసరమని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ ఉద్యోగాలపై ప్రపంచ దేశాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ దేశాల్లో అమలవుతున్న ఉత్తమ కార్మిక విధానాలను అధ్యయనం చేసి, వాటిలో ఉత్తమమైన వాటిని అన్ని దేశాలు అనుసరించేలా సిఫార్సులు రూపొందించడమే ఈ సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం కూడా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలను అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అడ్వాన్స్‌డ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతిక కోర్సులను అందిస్తోందని మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ సంస్థ టామ్‌కామ్ ద్వారా జర్మనీ, జపాన్, యూరప్, మధ్యప్రాచ్య దేశాలతో పాటు పలు దేశాల్లో తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.ఈ అంతర్జాతీయ సదస్సులో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బెలారస్, మలేషియా, నైజీరియా దేశాలకు చెందిన సుమారు 110 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. కార్మిక సంక్షేమం, సామాజిక న్యాయం, ఉపాధి భద్రత, ట్రేడ్ యూనియన్ల బలోపేతం, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై విస్తృత చర్చలు నిర్వహించి భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన సిఫార్సులు రూపొందించనున్నారు.

దేశంలోని అతిపెద్ద కేంద్ర కార్మిక సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆతిథ్యమిస్తున్న ఈ సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా సేవలందించాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఇహెచ్‌సిటి) బోర్డు సభ్యునిగా నియమితులైన స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్‌టియుటిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందంగౌడ్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును హైదరాబాద్‌లోని మఖ్ధూం భవన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సదానందం గౌడ్‌ను కూనంనేని సాంబశివరావు శాలువాతో సన్మానించి, ఇహెచ్‌సిటి బోర్డు సభ్యునిగా నియమితులైనందుకు అభినంధించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆరోగ్య సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో సమర్థవంతంగా సేవలందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, హెడ్ క్వార్టర్స్ సెక్రెటరీ వై.కరుణాకర్ రెడ్డి, సంఘ మాస పత్రిక సబ్ ఎడిటర్ శంకర్ మాతంగి తదితరులు పాల్గొన్నారు.

## కూనంనేనిపై ఫిర్యాదు వార్త పూర్తిగా అవాస్తవం

### ఛానల్స్‌లో వచ్చిన దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నా
### ప్రభుత్వంలో సిపిఐ, కాంగ్రెస్ కలిసే ఉన్నాయి
### ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుపై తాను కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షీ నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఓ ప్రముఖ టివి ఛానల్‌లో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమని, సదరు దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఖమ్మం పార్టమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వార్త ఛానల్‌లో ప్రసారమైన వార్తపై మంగళవారం ఆయన వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ కేవలం కాంగ్రెస్ ఎంపిను పిలిపించి ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి మాత్రమే వివరణ తీసుకున్నారని ఎంపి స్పష్టం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ ఎస్ఐఆర్ ప్రక్రియకుసంబంధించి వివరాలు సేకరించారని, అందులో భాగంగానే తాము కూడా పాల్గొన్నామని తెలిపారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాల రిపోర్టు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే తాము మీనాక్షికి కూలంకుషంగా వివరించామని చెప్పారు. రాజకీయ లబ్ధికోసం ఇలాంటి తప్పుడు వార్తను ప్రసారం చేయించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో సిపిఐ కాంగ్రెస్ కలిసికట్టుగా ఉన్నాయని తమ మధ్య ఎలాంటి విభేదలు లేవని రామసహాయం రఘురామిరెడ్డి స్పష్టం చేశారు.

# ఆ నీళ్లను ఎత్తిపోయండి

### గంగుల కమలాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడిగడ్డ బ్యారేజ్ వద్ద రోజుకు 9టిఎంసి నీళ్ల పోతున్నాయని,కన్నెపల్లి పంపులు ఆన్ చేసి, అన్నారం బ్యారేజిలో నీళ్లను ఎత్తిపోయవచ్చని, ఒక వేళ అన్నారం బ్యారేజ్ కూలిపోతే అందుకు బిఆర్‌ఎస్ బాధ్యత వహిస్తుందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కన్నెపల్లి పంపులను ఆన్ చెయాలని కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద,ముఠాగోపాల్,పాడి కౌశిక్ రెడ్డి,బండారి లక్ష్మా రెడ్డితో కలిసి గంగుల కమలాకర్ మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజ్ వద్ద రోజు 9 టి ఎంసిల నీళ్ళు పోతున్నాయని,కన్నెపల్లి పంపులు ఆన్ చేసి అన్నారం బ్యారేజ్‌లో నీళ్ళు ఎత్తిపోయవచ్చని సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోతుందని, సిఎం రేవంత్ రెడ్డికి తప్పుడు సలహాలు ఇస్తున్నారన్నారు. పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ కు ఏమైనా జరిగితే 28 మంది బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే బాధ్యత వహిస్తారన్నారు.

అన్నారం సుందిళ్ల బ్యారేజ్ కు ఏమైనా జరిగితే తాము రాజీనామా చేసి, రాజకీయాలకు దూరంగా ఉంటామని సవాల్ విసిరారు. కెపి వివేకానంద మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో సాగు,తాగునీటికి ప్రజలు, ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య మరింత ఎక్కువ అయ్యే అవకాశం కనిపిస్తోందన్నారు.

# తుది దశకు సిట్ దర్యాప్తు

### రెండో చార్జ్‌షీట్‌కు సన్నాహాలు
### పూర్తి దశలో కీలక సాక్షుల వాంగ్మూలాల నమోదు






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు సేకరించిన సాంకేతిక, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తోంది. దర్యాప్తు పూర్తయిన అనంతరం రెండో చార్జ్‌షీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేసే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కేసుకు సంబంధించిన పలువురు పోలీసు అధికారులు, బాధితులు, సాక్షులను సిట్ విచారించింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎబి.వెంకటేశ్వరరావు వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసింది. ఆయనను నిందితుడిగా కాకుండా సాక్షిగా విచారించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్, నిఘా వ్యవస్థ పనితీరు, అప్పటి పరిస్థితులపై ఆయనకు తెలిసిన వివరాలను అధికారులు నమోదు చేసినట్లు తెలిసింది. దర్యాప్తులో భాగంగా ఫోన్ ట్యాపింగ్ కోసం ఉపయోగించిన సాంకేతిక వ్యవస్థలు, కాల్ డేటా, డిజిటల్ పరికరాలు, సర్వర్ల నుంచి సేకరించిన సమాచారాన్ని ఫోరెన్సిక్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కేసులో ఉన్న ఆధారాలను బలోపేతం చేసే దిశగా సిట్ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో తొలి చార్జ్‌షీట్‌ను దాఖలు చేసిన సిట్, దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన కొత్త అంశాలు, అదనపు ఆధారాలు, తాజా సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా రెండో చార్జ్‌షీట్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇందులో మరికొంత మంది వ్యక్తుల పాత్ర, కుట్ర, అధికార దుర్వినియోగం వంటి అంశాలను ప్రస్తావించే అవకాశం ఉందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితులపై ఇప్పటికే పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని అరెస్టులు లేదా అదనపు అభియోగాలు నమోదయ్యే అవకాశాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకోవడంతో రెండో చార్జ్‌షీట్‌లో ఎలాంటి కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయన్న ఆసక్తి రాజకీయ, పోలీసు వర్గాల్లో నెలకొంది. ప్రస్తుతం సిట్ తుది నివేదిక, రెండో చార్జ్‌షీట్ సిద్ధీకరణపై దృష్టి సారించినట్లు సమాచారం.

# సింగరేణిని కెసిఆర్ జేబు సంస్థగా మార్చారు

### కేటీకే-8 గనిలో గేట్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గత పది సంవత్సరాలుగా సింగరేణిని కెసిఆర్ అప్పుల పాలు చేసి తన జేబు సంస్థగా మార్చాడని, బిఆర్ఎస్, కాంగ్రెస్ ఇద్దరు కలిసి 54 వేల కోట్ల సింగరేణి కి అప్పు చేశారని జీతాలకు బ్యాంకుల చుట్టూ తిరగవలసిన దుస్థితికి దిగజారిచ్చారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే8 సింగరేణి గనిలో మంగళవారం సింగరేణి భరోసా యాత్రలో భాగంగా బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పని శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరపరాజు రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరై ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, టిఆర్ఎస్ కాంగ్రెస్ వళ్ళ సింగరేణి సంస్థ 15 ఏళ్లు వెనక్కి వెళ్లిందని టిఆర్ఎస్ కాంగ్రెస్ రెండు దొందు, దొందేనని అన్నారు. దశాబ్దాలుగా దేశ అభివృద్ధికి ఇంధనంగా నిలుస్తున్న సింగరేణి కార్మికుల కృషి దేశానికి ఎంతో విలువైనదని కొనియాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలు, వైఫల్యాల కారణంగా సింగరేణి కార్మికుల్లో అభద్రతాభావం, ఆందోళన పెరిగిందని అన్నారు. సింగరేణిని దేశంలోనే అత్యంత కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థగా బలోపేతం చేయాల్సిన గత ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డిఎంఎఫ్) నిధులను సిద్దిపేట, సిరిసిల్ల, కొడంగల్ కు తరలించారని అన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిని దేశంలోనే ఆదర్శ ప్రభుత్వ రంగ సంస్థగా తీర్చి దిద్దుతామని, కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, బీజేపీ రాష్ట్ర, కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డి, రాష్ట్ర జిల్లా మండల నాయకులు, బీఎంఎస్ నాయకులు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


**సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) కార్యాలయం, సిద్దిపేట.**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

e-NIT No. 02/SE (R&B) SDPT/DSE/2026-27 తేది: 10.07.2026

| | | |
|---|---|---|
| 1 | పని పేరు మరియు సుమారు అంచనా కాంట్రాక్ట్ విలువ వివరాలు | "సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో గౌరవనీయులైన మంత్రి వినియోగిస్తున్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన, భోజనశాల, సిబ్బంది గదులు మరియు మరుగుదొడ్లతో కూడిన మీటింగ్ హాల్ షెడ్ నిర్మాణం." ఇసివి: రూ.84.00 అంచనా (సుమారుగా) |
| 2 | బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం | 17.07.2026 సా.4:00గం.లకు |
| 3 | బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం | 31.07.2026 మ.3:30గం.ల వరకు |
| 4 | టెండర్ ప్రారంభ తేది మరియు సయయం | టెక్నికల్ బిడ్ : 31.07.2026 సా.4:00గం.లకు కమర్షియల్ బిడ్ : 05.08.2026 సా. 4:00గం.లకు |
| 5 | సంప్రదించవలసిన సూపరింటెండింగ్ ఇంజనీర్ పేరు & చిరునామా | సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) సర్కిల్, సిద్దిపేట. ఫోన్ నెం. 8121127730. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు. |

మరిన్ని వివరాలకు 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in/లో 17.07.2026 సా.4:00గం.ల నుండి చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), సర్కిల్, సిద్దిపేట.

DIPR R.O. No. : 6034-PP/CL/ADVT/2026-27, Date: 14-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

జీడిమెట్ల సర్కిల్-55, క్యూబిజెడ్, సిఎంసి.

| NIT No. | పని పేరు | అంచనా మొత్తం | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు & మొబైల్ నెం. |
|---|---|---|---|---|---|
| NIT No. 11/DB/EE-III/JDM/C-55/QBZ/CMC/2026-27, Dated: 14.07.2026 | సిసి (CC) రోడ్డు నిర్మాణం, అదనపు క్యాచ్‌పిట్లు, హై మాస్ట్ పోల్స్ ఏర్పాటు మరియు ఏబి (AB) కేబుల్ సేకరణ (6 పనులు) | రూ. 58.656 లక్షలు | 15.07.2026 @ 3:00PM | 23.07.2026 @ 3:00PM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9989930549, హెడ్ డ్రాఫ్ట్‌మెన్, సెల్ నెం. 8712034411 |
| NIT No. | పని పేరు | అంచనా మొత్తం | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు & మొబైల్ నెం. |
| NIT No. 11/DB/EE-III/JDM/C-55/QBZ/CMC/2026-27, Dated: 14.07.2026 | బోనాల పండుగ (2 పనులు) | రూ. 2.00 లక్షలు | 15.07.2026 @ 3:00PM | 18.07.2026 @ 3:00PM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9989930549, హెడ్ డ్రాఫ్ట్‌మెన్, సెల్ నెం. 8712034411 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-III, జెడిఎం సి-55, సిఎంసి.

DIPR R.O. No. : 6051-PP/CL/ADVT/2026-27, Date: 14-07-2026

తెలంగాణ ప్రభుత్వము

**ఉపసంచాలకులు షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయము**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా

ఆర్.సీ.నం. A2/09/2026 :: టెండరు ప్రకటన :: తేది: 14.07.2026

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లోని (04) Post matric వసతి గృహాలకు 2026 2027 సంవత్సరానికి గాను దిగువ తెలుపబడిన సేవలు అందించుట కొరకు అర్హులైన వారి నుండి టెండర్లు కోరబడుచున్నవి.

| క్ర. సం. | సేవల వివరాలు | వివరాలు | ధరావత్తు (EMD) | టెండర్ షెడ్యూల్ ధర |
|---|---|---|---|---|
| | (04) Post matric వసతి గృహాలకు 2026-2027 సంవత్సరానికి గాను దిగువ సేవలు | | | |
| 1 | క్యాటరింగ్ (వంట చేయుటకు) | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | రూ. 40,000=00 | రూ.1000=00 |
| 2 | స్వీపింగ్ మరియు సోనిటేషన్ | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | | |
| 3 | డే మరియు నైట్ వాచ్ మెన్ (సేక్యూరిటీ సర్వీస్) | టెండరు షెడ్యూల్లో చూపబడినవి | | |

కావున ఆసక్తి గల కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకి సంబంధించిన పైన తెలుపబడిన సేవలను అందించుట కొరకు రూ.1000=00 Demand Draft "District SC Development Office, Kumuram Bheem Asifabad" జిల్లా పేరున టెండర్ ఫారం నియమ నిబంధనల ప్రకారం తేది: 15.07.2026 ఉ. 10.30 నుండి 20.07.2026 సాయంత్రం 4:00 గంటల వరకు షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయము, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుండి పొందవచ్చును. పూర్తి చేయబడిన టెండర్లు తేది 21.07.2026 నాడు సాయంత్రం 4:00 గంటల లోపు స్వీకరించబడును. ఇట్టి టెండరును అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), కుమురం భీం ఆసిఫాబాద్ కార్యాలయము నందు తేది: 22.07.2026 నాడు సమయం సాయంత్రం 03:30 PM గంటలకు తెరువబడును. గడువు తరవాత వచ్చిన టెండర్ ఫారములు స్వీకరించబడవు. ఇట్టి టెండర్లను వాయిదా వేయుటకు గాని, రద్దు పరుచుటకు గాని అదనపు కలెక్టరు (లోకల్ బాడీస్), కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గారికి పూర్తి అధికారము కలదు.

సం/- షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ అధికారి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా

DIPR R.O. No. : 6006-PP/CL/ADVT/2026-27, Date: 14-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఇఇ-II (56-కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT No. 16/EE-56/QBZ/CMC/2026-27, 16/EE-59/QBZ/CMC/2026-27 & NIT No. 15/EE-60/QBZ/CMC/2026-27, Dt:14.07.2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ప్రచురించబడినది. వివరాలకు @https://tender.eprocurement.gov.inలో లాగ్‌ఇన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల తేదీ వివరాలు క్రింది విధముగా ఉన్నాయి.

| NIT No. | పని పేరు | అంచనా మొత్తం (లక్షలలో) | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 16/EE-56/QBZ/CMC/ 2026-27, Dt: 14.07.2026 | బొల్లారం క్రాస్ రోడ్ వద్ద జంక్షన్ మెరుగుదల పనులు-1 మరియు సి.సి. రోడ్డు నిర్మాణం పనులు-2. | 80.80 | 17.07.2026 02.00 PM to 24.07.2026 02.00 PM | ఇ.ఇ., సర్కిల్-56, 59 & 60, సిఎంసి, కుత్బుల్లాపూర్. సెల్ నెం. 7995468066 / 7331181426 |
| NIT No. 16/EE-59/QBZ/CMC/ 2026-27, Dt: 14.07.2026 | దుండిగల్ వద్ద జంక్షన్ మెరుగుదల పనులు-1 | 24.00 | 17.07.2026 02.00 PM to 24.07.2026 02.00 PM | |
| NIT No. 15/EE-60/QBZ/CMC/ 2026-27, Dt: 14.07.2026 | శివాజీ విగ్రహం జంక్షన్ వద్ద జంక్షన్ అభివృద్ధి పని-1 | 45.00 | 17.07.2026 02.00 PM to 24.07.2026 02.00 PM | |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 56-కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి.
మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-56,59&60, క్యూబిజెడ్, సిఎంసి.

DIPR R.O. No. : 6000-PP/CL/ADVT/2026-27, Date: 14-07-2026




## బిఆర్ఎస్ పాలనలో రైతులు,నిరుద్యోగులకు నష్టం

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేది కాంగ్రెస్సే: పున్న

**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం):** బిఆర్ఎస్ కాలంలో 10 సంవత్సరాలలో 10 వేల మంది రైతులు చనిపోయారని,ఏకాలంలో రుణమాఫీ అంటూ ప్రజలను మోసం చేసింది బిఆర్ఎస్ కాదా అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత ప్రశ్నించారు. శాలిగౌరారం మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను బిఆర్ఎస్ నట్టేట ముంచిందని విమర్శించారు.నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను అప్పట్లో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసిఫ్ నగర్ కాల్వ పరిధిలోని రైతాంగానికి నష్టపరిహారం అందించి కాల్వ పనులను చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బాంధవుడిగా రైతులకు రైతు భరోసా ఏకకాలంలో అందించారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింత ధనంజయ్,బండపల్లి కొమురయ్య,తోటకూరి పరశురామ్, శేఖర్ బాబు,పాపారావు,భాషా పాల్గొన్నారు.

## మార్కెట్ ధర ప్రకారంగా నష్టపరిహారం

భూనిర్వాసిత రైతుల విన్నపం



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం కాలువ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెంది, భూనిర్వాసిత రైతులు మంగళవారం స్పెషల్ డిప్యూటి కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. లేదంటి భూమికి బదులుగా మరో ప్రాంతంలో భూమిని కేటాయించాలని కోరారు. నూతన భూసేకరణ చట్టం ప్రకారం తమకు న్యాయం చేయాలని, భూమిని నమ్ముకుని ఉన్న మాకు సత్వర న్యాయం అందేలా చూడాలని వినతిపత్రంలో వారు కోరారు. అతి విలువైన భూములను తాము కోల్పోతున్నామని, ప్రభుత్వం అర్ధం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో చిట్యాల మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మేడి శ్రీలత శ్రీను, భూనిర్వాసితులున్నారు.

## ఎకరాకు రూ.8వేలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** ఎల్‌నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం ఉన్నందున మెట్ట పంటలను సాగు చేసే రైతులకు ప్రోత్సహకంగా ఎకరాకు రూ.8వేలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్లంల యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తిరుమలగిరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఆశించినంత వానలు పడనందున రైతులను ఆదుకోవాలన్నారు. 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనందున ప్రభుత్వం మెట్ట పంటలకు అవసరమయ్యే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తిప్పిరాల శ్రీకాంత్, ఫయాజ్, కనుక అశోక్, జంపాల మల్లయ్య, నాగులగాని మల్లయ్య, మనోజ్ పాల్గొన్నారు.



### హుజూర్‌నగర్ ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోప్పోజు సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావితం వల్ల తక్కువ వర్షపాతం నమోదైందని, వరికి ప్రత్యామ్నయ పంటలైన మెట్ట పంటలను సాగుచేసి రైతులకు ప్రోత్సహకంగా 8వేల రూపాయలను ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13, 14 ,15 తేదీలలో మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు చేపట్టి తహసీల్దార్లకు మెమోరాండాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ అధ్యక్షులు జక్కుల రమేష్, ఇందిరాల వెంకటేశ్వర్లు, దొంతగాని సత్యనారాయణ, ఎల్లావుల రమేష్, జడ వెంకన్న, తెల్లబోయిన వీరయ్య పాల్గొన్నారు.

## కేంద్ర బృందం పరిశీలన

**ప్రజాపక్షం/మర్రిగూడ:** వీబీజీఆర్ఏఎంజీ కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు మంగళవారం యరగండ్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్ర బృందం సభ్యులు గ్రామంలో చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులన్నీ నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం యరగండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ వల్లంల సంతోష్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కార్యదర్శి లాల్ చంద్, అండర్ సెక్రటరీ రాజీవ్ రాణా,అసిస్టెంట్ డైరెక్టర్ నీతూ,జాయింట్ కమిషనర్ శేషు కుమార్,ఎస్‌బీఎం డైరెక్టర్ మురళి, నల్లగొండ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రేమకరణ్ రెడ్డి,డిఆర్‌ఓ వై. శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



# సహకార సంఘాలకు రవాణా భారం

మార్క్‌ఫెడ్ నిర్ణయాన్ని విభేదిస్తున్న పాలకవర్గాలు

ఎరువుల అమ్మకాల నిలుపుదలకు నిర్ణయం

ఎరువుల పంపిణీపై ప్రతిష్టంభన...!?

**ప్రజాపక్షం/సూర్యాపేట :** వ్యవసాయ సహకార సంఘాలపై ఎరువుల రవాణా భారం పడింది. ఇంత కాలం రవాణా చార్జీ లేకుండా ఉచితంగా ఎరువులను సరఫరా చేసిన మార్క్‌ఫెడ్ సంస్థ ఈనెల 9వ తేది నుండి రవాణా చార్జీలు చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ నిర్ణయాన్ని సహకార సంఘాలు విభేదిస్తున్నాయి. దీనితో సహకార సంఘాలు ఎంఆర్‌పి ధరలకు ఎరువులు అమ్మితే తమకు నష్టం వస్తుందని ఇక ఎరువులు అమ్మలేమంటూ చేతులెత్తేసిన పరిస్థితి. ఉన్న నిలువల వరకు ఎరువులు అమ్మకాలు జరుగుతామని చెప్పకనే చెబుతున్నారు. అవసరమైన ఎరువుల కోసం పెట్టిన ఆర్డర్లను రద్దు చేసుకుంటున్నారు. దీంతో రానున్న రెండు, మూడు రోజుల్లో ఎరువుల పంపిణీలో ఆటంకం కలగనుంది.

సూర్యాపేట జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాలు 37 ఉండగా వీటితోపాటు డిసిఎంఎస్, హాకా, రైతు సేవా కేంద్రాలతోపాటు ప్రైవేట్ డీలర్లతో కలిపి 400కు పైగా ఎరువుల దుకాణాలు ఉన్నాయి. రైతులకు అవసరమైన ఎరువులను మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా సరఫరా చేసుకొని అమ్మకాలు జరుపుతున్నారు. ప్రైవేట్ డీలర్ల



నుండి మార్క్‌ఫెడ్ సంస్థ రవాణా చార్జీలను మొదటి నుండి వసూలు చేస్తుండగా ప్రాథమిక సహకార సంఘాలకు, డిసిఎంఎస్, హాకా, రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసే ఎరువులకు ఎలాంటి రవాణా చార్జీని వసూలు చేయడం లేదు. వీరికి ఉచిత రవాణా చేయడంతో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు అమ్ముతున్నారు. ఉదాహరణకు ప్రస్తుతం యూరియా బస్తా ఒక్కంటికి ప్రభుత్వ ధర రూ.266.50 పైసలు ఉండగా ఆ ధరకే అమ్ముతున్నారు. కమీషన్ రూపంలో బస్తాకు రూ.12 లు వస్తుందని ఇందులో నుండే దిగుమతి చార్జీలు హమాలీలకు చెల్లించడంతో తమకు బస్తాకు కేవలం రూ.6 లే మిగులుతుందని సహకార సంఘాల ఉద్యోగులు చెబుతున్నారు.

**లారీ లోడ్‌కు రూ.15వేల నుండి 25వేలు భారం...**

ఎరువుల రవాణా చార్జీలు ఇక నుండి సహకార సంఘాలు ఈనెల 9వ తేదీ నుండి చెల్లించాలని మార్క్‌ఫెడ్ సంస్థ ఉత్తర్వులు జారీ చేయడంతో సహకార సంఘాల సభ్యులు ఒక్కసారిగా కంగుతిన్నారు. తమకు ఉచితంగా ఎరువుల రవాణా చేయకుంటే లారీ లోడ్‌కు రూ.15వేల నుండి రూ.25వేల వరకు అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు చార్జీ కలుపుకొని తాము ఎరువుల బస్తాలు అమ్మలేమని ఒక యూరియా బస్తా అమ్మాలంటే (ట్రాన్స్‌పోర్టు దూరాన్ని పరిగణలోకి తీసుకుంటే) రూ.300 నుండి రూ.325 వరకు అమ్మాల్సి వస్తుందని చెబుతున్నారు. ఎంఆర్‌పి ధరలకే అమ్ముతే బస్తాకు రూ.30 నుండి రూ.50వరకు అదనపు భారం తమపై పడుతుందని వాపోతున్నారు. ఎరువుల అమ్మకాల నిలుపుదలకు నిర్ణయం

మార్క్‌ఫెడ్ ఉత్తర్వులతో ఎరువుల అమ్మకాలను నిలుపుదలకు వ్యవసాయ సహకార పరపతి సంఘాలు నిర్ణయాలు తీసుకున్నాయి. యూరియా కోసం ఇప్పటికే ఆర్డర్లు పెట్టిన సహకార సంఘాలు వారు వాటిని రద్దు చేసుకుంటున్నారు. నిల్వలు ఉన్నంత వరకే అమ్మకాలు జరుపుతామని చెబుతున్న పరిస్థితి. రెండు, మూడు రోజుల్లో ఉన్న నిల్వలు కూడా అయిపోతే పరిస్థితి ఏంటన్నది అంతుచిక్కడం లేదు. ప్రైవేట్ ఎరువుల దుకాణాల నుండి కాకుండా రైతులు అత్యధికంగా సహకార పరపతి సంఘాల నుండే ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. వీరు ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తే ప్రతిష్టంభన తప్పదు. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే రైతులకు ఎరువుల కష్టాలు తప్పవు.



## బాధితుడితో పోలీసులు మర్యాదపూర్వకంగా సహకరించాలి

భువనగిరి డిఎస్‌పి బి. రవీందర్

**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రజలతో గౌరవప్రదంగా వ్యవహరించినప్పుడే పోలీసుల పట్ల విశ్వాసం, గౌరవం పెరుగుతుందని భువనగిరి డీఎస్పీ బి. రవీందర్ తెలిపారు. మంగళవారం భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్లను సందర్శించి స్టేషన్ల పని తీరు, రికార్డులు, పెండింగ్ కేసులు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటీషనర్, బాధితుడితో పోలీసులు మర్యాదపూర్వకంగా, సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. అలాగే, పోలీసు సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే సమాజంలో పోలీస్ శాఖకు మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. స్టేషన్‌లోని అన్ని రికార్డులను పరిశీలించిన డీఎస్పీ, ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం.రమేష్, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, అలాగే మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

**ప్రజాపక్షం/డిండి :** డిండి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు ముత్తని అంతరెడ్డి(53) మంగళవారం 3 గంటల సమయంలో తన పొలంలో మోటారు ఆగిపోవడంతో కొంత దూరంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు పోవడంతో ఏబి స్విచ్ ఆఫ్ చేసి మరళ ఫీజు సరిచేసి స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మెడకు 11కేవి వైరు తగిలి అక్కడికక్కడే మరణించాడు. అంతిరెడ్డి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతునికి కుమార్తె ఉన్నట్లు తెలిపారు.



## హమాలీల హక్కుల కోసం పోరాడిన నాయకుడు నర్సింహ

**ప్రజాపక్షం/రామన్నపేట :** ఏఐటియుసి యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు, సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగే నరసింహ ఆశయాలను కొనసాగిస్తూ, కార్మికులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఏఐటియుసి జాతీయ నాయకుడు ఉజ్జిని రత్నాకరావు పిలుపునిచ్చారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం ప్రాంగణంలో గొరిగె నర్సింహ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గొరిగే నరసింహ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ గొరిగే నరసింహ జీవితాంతం కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నిజాయితీపరుడైన ఉద్యమ కార్మిక నాయకుడని కొనియాడారు. సివిల్ సప్లై హమాలి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, కార్మిక ఉద్యమంలో ఆయన చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం మరింత బలంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరించి వేస్తుందని ఆయన ఆరోపించారు.కార్మికుల వర్గానికి సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఏఐటీ





యూసీ మండల అధ్యక్షులు బత్తుల సత్యం అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్,జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్ కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సివిల్ సప్లై యూనియన్ జిల్లా అధ్యక్షులు పల్లె శ్రీనివాస్,సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ,సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్,పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, రామన్నపేట సివిల్ సప్లై గోడౌన్ ఇన్చార్జి కుసుమ, డిఈఓ ఊర్మిళ, సివిల్ సప్లై హమాలి యూనియన్ నాయకులు గొరిగే శంకరయ్య పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యం

అధికారులకు కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లా ప్రజలకు మెరుగైన, నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్జరీ, ఈఎన్‌టీ, లాపరోస్కోపీ, రేడియాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పాథాలజీ, జనరల్ సర్జరీ, బ్లడ్ బ్యాంక్, నేత్ర వైద్యం (ఆఫ్తాల్మాలజీ) తదితర విభాగాల పనితీరు,అవసరమైన పరికరాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన నాణ్యమైన సర్జికల్ పరికరాలు, ఆధునిక వైద్య ఉపకరణాలు కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అవసరమైన అన్ని సదుపాయాలను దశల వారీగా కల్పిస్తా మని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాహుల్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జి. సత్యనారాయణ, డీసీహెచ్ మాత్రు నాయక్, సూపరింటెండెంట్ డాక్టర్ జయలత,డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుం ధతి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమేష్,హెచ్‌ఓడీలు, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 27వ వార్డులో సర్ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి రోజు కనీసం 2500 ఫా రాల లక్ష్యంతో పనిచేసి, నిర్దేశిత గడువులోగా పెండింగ్ ప్రక్రియను పూర్తి చే యాలని ఆదేశించారు. ఓటర్లు సకాలంలో ఫారాలు పూర్తి చేసి అందజేసేలా చ ర్యలు తీసుకోవాలని, ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. బిఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఫారం నింపాలని ఆదేశించారు. ఓటర్ల సంతకాలను చెక్ చేసుకోవాలని, మ్యాపింక్ కరెక్ట్‌గా చేయాలన్నారు.

## అన్ని వర్గాల అభ్యున్నతి.. సమగ్ర అభివృద్ధే ధ్యేయం

పనుల పురోగతి సమీక్షలో ఎమ్మెల్యే కుంభం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అన్ని వర్గాల అభ్యున్నతి, సమగ్ర అభివృద్ధే ధ్యేయమని పోచంపల్లిని అన్ని రకాలుగా ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని నిధుల కేటాయింపులో పెద్దపీట వేస్తూ ప్రజల ఆకాంక్షల మేరకు పని ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అధికారులు ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెచ్ఎండిఏ ద్వారా నియోజకవర్గానికి రూ.56 కోట్ల నిధులు తీసుకువచ్చామని, అందులో భాగంగా పోచంపల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పునరుద్ఘాటించారు.చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవించే నేత కార్మికుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని అన్నారు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణంతో పాటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్స్, శ్మశానవాటికల అభివృద్ధి, విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పన, అమృత్ పథకం కింద రిజర్వాయర్ నిర్మాణం వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.7.90 కోట్ల నిధులు కేటాయించామని, చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోచంపల్లి పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు హెచ్ఎండిఏ అధికారులు పబ్లిక్ హెల్త్, ఎలక్ట్రిసిటీ, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలి





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని, రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదైన ప్రస్తుత పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా మెట్ట పంటలు సాగు చేస్తున్న రైతులను ఆదుకునేందుకు ఎకరానికి రూ.8 వేల చొప్పున ప్రోత్సాహక నగదు అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం ఈ మేరకు మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డికి రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో రైతులు పత్తి, ఇతర మెట్ట పంటల సాగు ప్రారంభించినప్పటికీ విత్తనాల మొలక శాతం గణనీయంగా తగ్గిపోయిందని తెలిపారు. దీంతో తిరిగి విత్తనాలు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో మెట్ట పంటలకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో గువ్వల మట్టయ్య, ఎస్‌కె.రహీం, వెంకటేశ్వర్లు, మట్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ‘ప్రజాపక్షం’ కథనానికి కదిలిన అధికార యంత్రాంగం

లక్ష్మి దేవమ్మ దీనగాథకు చలించిన ఎమ్మెల్సీ సత్యం

రేషన్ కార్డు పునరుద్ధరణకు ఆర్‌డిఒ ఆదేశాలు -తహసీల్దార్ స్పందనతో దరఖాస్తు చేసిన అంధురాలు



బతికుండగానే చనిపోయిందంటూ రేషన్ కార్డు రద్దు..

ఆసరా పింఛన్ మాత్రం వస్తోంది...ఏడాదిగా రేషన్ బియ్యం దూరం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన అంధురాలైన లక్ష్మి దేవమ్మ దీనగాథ.. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**పజాపక్షం/నల్లగొండ :** చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన అంధురాలు లక్ష్మి దేవమ్మ బతికుండగానే మరణించినట్లు నమోదు చేసి రేషన్ కార్డును రద్దు చేయడంతో ఏడాదికాలంగా ప్రభుత్వ రేషన్ బియ్యానికి దూ రమైన విషాద గాథపై ప్రజాపక్షం దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది.ఈకథనాన్ని చదివిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వెంటనే స్పందించి నల్లగొండ ఆర్‌డిఓ అశోక్ రెడ్డికి ఫోన్ చేసి లక్ష్మి దేవమ్మ పరిస్థితిని వివరించారు. బతికే ఉన్న వ్యక్తిని మృతురాలిగా నమోదు చేసి రేషన్ కార్డు రద్దు చేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొం టూ, ఆమె రేషన్ కార్డును తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ సత్యం సూచనల మేరకు స్పందించిన ఆర్‌డిఓ అశోక్ రెడ్డి చిట్యాల తహసీల్దార్ మారనేని విజయ్ కుమార్ ను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి, రేషన్ కార్డు పునరుద్ధరణ కోసం లక్ష్మి దేవమ్మతో దరఖాస్తు చేయించారు.ఆమె దరఖాస్తును స్వీకరించి,నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. గమనార్హమైన విషయం ఏమిటంటే, లక్ష్మి దేవమ్మకు ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ మాత్రం ప్రతి నెలా సక్రమంగా వస్తుండగా, అదే ప్రభుత్వ రికార్డుల్లో ఆమెను మృతురాలిగా నమోదు చేసి రేషన్ కార్డును రద్దు చేయడం తీవ్ర నిర్లక్ష్యంగా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఏడాదికాలంగా ఆమె ప్రభుత్వ రేషన్ బియ్యానికి దూరమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజాపక్షం కథనం వెలుగులోకి తీసుకురావడంతో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.



## అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అవకాశం

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** జిల్లాలో అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ తుది అవకాశాన్ని కల్పించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ గద్వాల్, మానవపాడు, మల్దకల్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ , అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల నియామకాలకు సంబంధించి ఇప్పటికే నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాని అభ్యర్థులకు తుది అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఇప్పటివరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాని అభ్యర్థులు ఈ నెల 16,17 తేదీలలో సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అన్ని ఒరిజినల్ ధృవపత్రాలతో పాటు వాటి అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఈ రెండు రోజుల అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించబడదని స్పష్టం చేశారు. నిర్ణీత తేదీలలో హాజరు కానీ అభ్యర్థులను గైర్హాజరు అనర్హులు గా పరిగణించి, వారి దరఖాస్తులను తదుపరి ఎంపిక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోబడవని పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత అభ్యర్థులందరూ ఈ తుది అవకాశాన్ని వినియోగించుకుని, నిర్ణీత తేదీలలో సంబంధిత సిడిపిఒ కార్యాలయాలకు హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన పూర్తి చేసుకోవాలని సూచించారు.

## యాదవులకు శివకిరణ్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

**ప్రజాపక్షం/వంగూర్ :** కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి యాదవ బిడ్డకు క్షమాపణ చెప్పాలని అఖిలభారత యాదవ మహాసభ వంగూరు మండల శాఖ అధ్యక్షులు ఇడమోని తిరుపతయ్య యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆలయ బోర్డు మెంబర్‌గా ఎంపిక చేసిన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన శివ చరణ్ రెడ్డిని అరెస్టు చేసి పార్టీ నుండి బహిష్కరించాలని ఆయన డిమాండు చేశారు.



## ఉమామహేశ్వరాలయంలో వైభవంగా అమావాస్య వేడుకలు

### ఆలయంలో అన్నదానం ప్రారంభిస్తున్న భక్తులు

**ప్రజాపక్షం/మక్తల్ :** అమావాస్య పర్వదినం సందర్భంగా మక్తల్ పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో వెలిసిన శ్రీ ఉమా మహేశ్వరాలయంలో అమావాస్యం వేడుకలు వైభవంగా జరిగాయి. మంగళవారం అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు సిద్దరామయ్య స్వామి, మహేష్ స్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటల నుండి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకం విశేష పూజలు అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ గావించారు. అలంకరణ అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వహించారు. తదుపరి మహా మంగళహారతి అనంతరం సందుల సొంతమ్మ తిప్పిరెడ్డి దంపతులు అన్నదాన కర్తలుగా వ్యవహరించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.ఆంజనేయులు, సూర్య, చిన్న కృష్ణయ్య, పోలేపల్లి అనంతకుమార్, నారాయణరెడ్డి, నవీన్, పి.నాగరాజు, సివి నాని, వంశీ, రవి, ఆంజనేయులు, గుడిగండ్ల నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

## కోటి లింగాల క్షేత్రంలో ఘనంగా జరిగిన రుద్రహోమం

**ప్రజాపక్షం/కొత్తకోట :** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్దమైన శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్త దేవస్థానము దగ్గర గల ధ్యానమందిరంలో అమావాస్య సందర్భంగా లోకకళ్యానార్థం రుద్రహోమం చేయడం జరిగింది. వర్షాలు కురవాలని పంటలు బాగా పండాలని వరుణ సహిత రుద్రహోమం చేసి పూర్ణాహుతి సమర్పించి కూష్మాండ బలి ఇచ్చి అనంతరం భక్తులకు అన్నదానం చేయడం జరిగింది.

## పర్యావరణాన్ని కాపాడుదాం

### గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంగా గోపాల్‌దిన్నె గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచు దొడ్ల కవిత బాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేస్తూ వాటి ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచు దొడ్ల కవిత బాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు మనకు ప్రాణవాయువు (ఆక్సిజన్) అందించి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తాయని తెలిపారు. పచ్చదనం పెరిగితే పర్యావరణ సమతుల్యత నెలకొని వర్షపాతం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా అవి పెద్ద చెట్లుగా ఎదిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని గ్రామ ప్రజలకు సూచించారు. ప్రతి కుటుంబం మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి కరుణాకర్, వార్డు సభ్యులు కురుమయ్య, చంద్రయ్య, నరేష్, గ్రామ రైతులు, గ్రామస్తులు, పాల్గొని మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



### ఓటర్ల నమోదు డిజిటలైజేషన్‌ను

# గడువులోగా 100% పూర్తిచేయాలి

### పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఓటర్ల జాబితాలో శుద్ధికరణలో భాగంగా చేపడుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, ఈనెల 24వ తేది లోపు పట్టణంలోని 31 పోలింగ్ కేంద్రాల్లో వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి అర్హుడైన ఓటరు వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా డిజిటల్ విధానంలో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న 112వ, 113వ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, అక్కడ కొనసాగుతున్న ఓటర్ల నమోదు డిజిటలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణంలోని 112వ పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న నమోదును పరిశీలించిన కలెక్టర్, అక్కడ మొత్తం 1,199 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు కేవలం 32 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయిందని అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం 113వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ మొత్తం 1,540 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 33 శాతం మేర మాత్రమే నమోదు పూర్తయిందని తెలుసుకుని డిజిటలైజేషన్ పురోగతిని పెంచాలని ప్రతిరోజు 60 ఓటర్ల వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పట్టణ పరిధిలో మొత్తం 31 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటి పరిధిలో 35,536 మంది నమోదిత ఓటర్లు ఉన్నారని మంగళవారం ఉదయం 8 గంటల వరకు 14,867 మంది ఓటర్లు వివరాలు మాత్రమే డిజిటలైజేషన్ ప్రక్రియలో నమోదు అయినట్లు ఆన్‌లైన్‌లో వెల్లడయ్యాయని కలెక్టర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సదరం క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెప్మా మహిళా కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి జూలై 30 లోగా గురుకుల విద్యార్థులందరికి యూనిఫాంల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఐతోల్ గ్రామంలో మంగళవారం జిల్లా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక అధికారి, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి.షఫియుల్లా , జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి గ్రామంలో పర్యటించి గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, నాగర్‌కర్నూల్ రెవెన్యూ డివిజనల్ అధికారిని అర్చన, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, డి.టీ.కిరణ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మత్తుగుండ్ల పాఠశాల వంట ఏజెన్సీని రద్దు చేసిన కలెక్టర్

### పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ



**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన మధ్యాహ్న భోజన వంట ఏజేన్సీని జిల్లా కలెక్టర్ ప్రియాంక రద్దు (సస్పెన్షన్) చేశారు. మంగళవారం వత్తు గుండ్ల ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీకి వెళ్లిన కలెక్టర్ అక్కడ విద్యార్థులు చేస్తున్న భోజనంలో అన్నంతో పాటు నీళ్లచారు ఉండటం గమనించిన కలెక్టర్ ఆ పాఠశాల ఉపాధ్యాయుడు, వంట ఏజేన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మెనూలో వెజిటబుల్ కర్రీ, సాంబార్ ఉందని, కానీ విద్యార్థులకు కేవలం (నీళ్ల శాతమే ఎక్కువగా ఉన్న) చారును వడ్డించడం ఏమిటని వంట ఏజేన్సీ నిర్వాహకులను నిలదీశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించకుండా, భోజనాన్ని రుచి చూడకుండా సంబంధిత ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారని, విద్యార్థులకు ఎలా వడ్డింపచేశారని ప్రశ్నించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్ ఆ పాఠశాల వంట ఏజేన్సీ ని (సస్పెన్షన్) రద్దు చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈఓ గోవింద రాజులు ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఆ గ్రామంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ పత్రాలు పూరించే ప్రక్రియను పరిశీలించి, నాలుగు రోజులలో గ్రామంలోని ఓటర్ల అందరితో ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకుని డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సాయిబాబా, తాహసీల్దార్ తిరుపతయ్య, బీఎల్ఓ పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.



## మేడికొండ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### స్విఫ్ట్ కారు బోల్తా.. ఇద్దరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/అయిజ :** జోగులాంబ గద్వాల్ జిల్లా అయిజ మండలం మేడికొండ గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. టిఎస్ 07 ఇయు 2460 నెంబర్ గల స్విఫ్ట్ కారు మంత్రాలయం నుంచి గద్వాల వైపు వస్తుండగా అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గద్వాల ప్రాంతానికి చెందిన శివ, రంగ అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# కామ్రేడ్ బొల్లెద్దుల సేవలు చిరస్మరణీయం

### శ్రీను మరణం దురదృష్టకరం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** సిపిఐకి కామ్రేడ్ బొల్లెద్దుల శ్రీనివాసులు చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ ఎం.బాల్‌నరసింహ సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. కామ్రేడ్ బొల్లెద్దుల శ్రీనివాసులు విద్యార్థి దశ భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం ఎర్రజెండా చేత పట్టుకొని పేదల ప్రక్షాళన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ధర్నాలు, రాస్తారోకోలు చేశారని గుర్తుచేశారు. సిపిఐ పెద్దకొత్తపల్లి మండల్ కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు సోమవారం ఉదయం నాలుగు గంటల సమయంలో గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మండలంలోని దేవుని తిరుమలాపురం, గ్రామంలోని మృతుని బొల్లెద్దుల శ్రీనివాసులు ఇంటికి వెళ్లి ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాల నరసింహ మాట్లాడుతూ కామ్రేడ్ బొల్లెద్దుల శ్రీనివాసులు, కామ్రేడ్ సీనియర్ నాయకులు విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ప్రజానాట్యమండలి కళాకారుడిగా అనేక పోరాటాలు చేశారని సిపిఐ పెద్దకొత్తపల్లి మండల కార్యదర్శిగా నేటి వరకు ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. కామ్రేడ్ శ్రీనివాసులు మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటు అన్నారు. అనంతరం కామ్రేడ్ బొల్లెద్దుల శ్రీనివాసులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కేశవులు గౌడ్, టీ.నరసింహ, చంద్రమౌళి, టి.కిరణ్‌కుమార్, మండల సహాయ కార్యదర్శి ఎం.లక్ష్మి నారాయణ, దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బండి లక్ష్మీ పతి, కల్వకోల్ సిపిఐ కార్యదర్శి సంఘం కృష్ణ, ప్రజానాట్య మండలి కళాకారులు టి.మల్లేష్, సంగం వాసు, సిపిఐ పార్టీ వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**ప్రజాపక్షం/పానుగల్ :** మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కుటుంబ సభ్యులపై సిఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలపై పానుగల్ మండల బిఆరెస్ పార్టీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే సూపర్ ఎల్‌నినో, కరువు పరిస్థితులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందని ఒక జర్నలిస్టు అడగగా అందుకు సమాధానంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు, రైతుల రక్తంను పంట పొలాలలో చిందించడానికి సిద్ధమేనని ఒక సిఎం స్థాయిలో ఉండి మాట్లాడటం అవివేకం అన్నారు. పాలనపై దృష్టి పెట్టకుండా ప్రజా ప్రభుత్వం పేరిట దోపిడీ చేస్తూ ప్రతి పక్ష నాయకులను ముఖ్యమంత్రి స్థాయి మరిచి అసభ్య పదజాలంతో మాట్లాడటం సిగ్గుచేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు మండల మాజీ కోఆర్డినేటర్ వెంకటయ్య నాయుడు, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కిష్టాపూర్ తండా సర్పంచు కోషోర్ నాయక్, నాయకులు సుధాకర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ మిద్దె కృష్ణ, మాజీ సర్పంచు బాలస్వామి, అలీం, అడవన్న, వడ్డే పాపన్న, రామకృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**జడ్చర్ల పోలీస్ స్టేషన్ ఫిర్యాదు :**



**జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల రైతులనుద్దేశించి మాట్లాడిన మాటలు రైతుల ఆత్మహత్యలు చేసుకునే విధంగా ఉన్నాయని జడ్చర్ల టిఆర్ఎస్ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మంగళవారం నాడు జడ్చర్ల పోలీస్ స్టేషన్లో సిఐ కమలాకర్‌ను కలిసి వారు ముఖ్యమంత్రి చేస్తూ ఫిర్యాదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, రఘుపతిరెడ్డి, రాములు, ప్రశాంత్‌రెడ్డి, అలీమ్ ఇంతియాజ్, మచ్చల శ్రీను, నాగరాజు, కరెక్టే శ్రీను, విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

### బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు దారమోని గణేష్, హాజీలాపూర్ సర్పంచు రమేష్ గౌడ్‌లు ఆరోపించారు. మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గంలోని కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలో స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు కనీస మౌలిక వసతుల కల్పనలో, ఉపాధ్యాయుల సర్దుబాటులో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు అయిపోయినప్పటికీ ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో విద్యార్థులకు విద్యాబోధనలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని, అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు రాకపోవడం సిగ్గుచేటు, ఎక్కడ కూడా ఉపాధ్యాయులు తరగతుల వారిగా లేకపోవడం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వారి విద్యా బోధనకు తీవ్రమైన నష్టం ఏర్పడుతుందని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి కార్పొరేట్ పాఠశాలకు కొమ్ముకాస్తూ, ప్రైవేటు పాఠశాలలను అదే విధంగా గురుకుల పాఠశాలలను నీరు గారుస్తున్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖ పైన ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులను కల్పించాలి. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియమించాలని, నూతన పాఠశాల భవనాలను నిర్మించాలని లేని యెడల ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని గణేష్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచు సిద్దమోని రమేష్ గౌడ్, శేఖర్ గౌడ్, రామకృష్ణ, పెరుమాళ్ల కృష్ణ,రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో పార్టీలు ముందుండాలి

### మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైన వజ్రాయుధమని, రాజకీయ పార్టీలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందుండాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఓటమి, గెలుపులతో సంబంధం లేకుండా నాయకులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై పోరాడాలని ఆయన స్పష్టం చేశారు. వనపర్తి పట్టణంలో ప్రస్తుతం సాగుతున్న సర్ (ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియ విధానంపై నిరంజన్‌రెడ్డి తన స్వగృహంలో ముఖ్య నాయకులు, బిఆర్ఎస్ పార్టీ బిఎల్ఏ లతో కలిసి ఒక సమీక్షా సమావేశాన్ని నిర్వహింఆరు. మందకోడి నమోదుపై నిరంజన్ రెడ్డి అసంతృప్తి ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమం మందకొడిగా సాగుతోందని పార్టీ శ్రేణులు మరింత చురుకుగా పనిచేసి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, గట్టు యాదవ్, బి.లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, కురుమూర్తి యాదవ్, స్థానిక కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మరో ముందడుగు

**ప్రజాపక్షం/పెబ్బేరు :** వనపర్తి నియోజకవర్గంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియలో మరో కీలక ముందుడుగు పడింది. స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృషితో మంగళవారం పెబ్బేరు మండల పరిధిలోని అయ్యవారిపల్లి పల్లెగుట్ట సమీపంలో ప్రతిపాదిత స్థలాన్ని తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ నవత పరిశీలించారు. స్థల పరిశీలన అనంతరం రహదారి అనుసంధానం, నీటి లభ్యతతో పాటు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల పరంగా ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని ఆమె పేర్కొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ద్వారా వనపర్తి జిల్లా రైతాంగంతో పాటు విద్యార్థులకు కూడా ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి స్థానిక నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ నాయుడు, బాలకృష్ణ నాయుడు, బాలరాజు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మాపూర్ బిటి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/అమరచింత :** అమరచింత మండల పరిధిలోని ధర్మాపూర్ కు మంజూరైన బిటి రోడ్డు పనులను మంగళవారం గ్రామ సర్పంచి సావిత్రమ్మ శ్రీనివాస కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, అమరచింత పట్టణ అధ్యక్షుడు రవికాంత్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ధర్మాపూర్ గ్రామానికి బిటి రోడ్డు లేక ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి రెండు కోట్ల నిధులను బిటి రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామస్తులు అనేకసార్లు మాజీ ఎమ్మెల్యేకు విన్నవించిన లాభం లేకుండా పోయిందని పేర్కొన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా నిధులను కేటాయించి బిటి రోడ్డు నిర్మాణ పనులకు కృషి చేసిన రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గీత పారిశ్రామిక సహకార సంస్థ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్,లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్‌రెడ్డి, నాయకులు జింక రవి, శివ తదితరులు పాల్గొన్నారు.



# అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే భరోసా

### రూ.3.5 లక్షల మేర నష్టం వాటిలిందన్న పండ్ల వ్యాపారి

### నష్టం వివరాలపై అధికారులకు నివేదిక పంపనున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెల్లడి

**ప్రజాపక్షం/వనపర్తి న్యూ టౌన్ :** పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో బోలెమోని రాధమ్మకు చెందిన పండ్ల దుకాణంలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం ఘటనాస్థలికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఉండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రమాదంలో సుమారు రూ.3.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. బోలెమోని రాధమ్మ కుటుంబం 15 సంవత్సరాలుగా పండ్ల వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తోందని, ప్రభుత్వం సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధు మాట్లాడుతూ, జరిగిన నష్టాన్ని అంచనా వేసి పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సాయం కోసం అవసరమైన ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ఎమ్మెల్యేతో పాటు ఘటనాస్థలిని సందర్శించి పరిశీలించారు.

# జవహర్‌నగర్ రూపురేఖలు మారుస్తాం

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జవహర్ నగర్ ప్రాంతాన్ని పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సామాజికఆర్థిక అభివృద్ధి సమన్వయంతో దేశానికే ఆదర్శంగా నిలిచే సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్పష్టం చేశారు. జవహర్ నగర్‌లో వేస్ట్ టుఎనర్జీ ప్లాంట్, ల్యాండ్‌ఫిల్, పరిసర కాలనీల్లో మంగళవారం ఉన్నతస్థాయి అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. ఈ పర్యటనలో ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, అదనపు కమిషనర్ సి.ఎన్. రఘుప్రసాద్, డిప్యూటీ కలెక్టర్, ఐఐటి బాంబే నిపుణులు, జేపాల్ ప్రతినిధులు, రెయిన్‌బో హోమ్స్ ప్రతినిధి అనురాధ, అగ్రెన్ రిసోర్స్ ల్యాబ్ (ఎఆర్ఎల్) ప్రతినిధులు, మరియు రాంకీ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

**విద్యుత్ ఉత్పత్తి, బయోగ్యాస్ సాంకేతికతలపై సమీక్ష..** అధికారుల బృందం తొలుత 'వేస్ట్‌టుఎనర్జీ ప్లాంట్ (ఫేజ్–I)'ను సందర్శించి, వ్యర్థాల సేకరణ నుండి విద్యుత్ ఉత్పత్తి వరకు జరుగుతున్న ప్రక్రియలను పరిశీలించింది. ప్లాంట్ నిర్వహణ, కాలుష్య నియంత్రణ ప్రమాణాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. అనంతరం జవహర్ నగర్ ల్యాండ్‌ఫిల్ ప్రాంతాన్ని పరిశీలించగా, ఐఐటి బాంబే నిపుణులు ప్రతిపాదించిన శాస్త్రీయ ల్యాండ్‌ఫిల్ రిమిడియేషన్, పాత వ్యర్థాల శుద్ధి, భూభాగ పునరుద్ధరణ, లీచేట్ నియంత్రణ, మీథేన్ వాయువు నిర్వహణపై ఒక సాంకేతిక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆధునిక బయోగ్యాస్ సాంకేతికత ద్వారా సేంద్రియ వ్యర్థాల నుండి ఇంధనం, విద్యుత్, ఎరువులను ఉత్పత్తి చేస్తూ.. ల్యాండ్‌ఫిల్‌పై ఆధారాన్ని తగ్గించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

**మూలస్థాయిలోనే చెత్త విభజన ముఖ్యం...** 'వ్యర్థాల నిర్వహణలో మూలస్థాయిలోనే తడి– పొడి చెత్తను వేరు చేయడం అత్యంత కీలకం. ప్రతి ఇంటి నుంచి డోర్‌టు డోర్ సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారానే పరిశుభ్రమైన పట్టణ వాతావరణాన్ని సాధించగలం.' అని జయేష్ రంజన్ అన్నారు.

### ప్రజా సమస్యలపై ఆరా సమగ్ర కార్యాచరణకు ఆదేశం

పర్యటనలో భాగంగా అధికారులు వైఎస్ఆర్ నగర్, గబ్బిలాలపేట ప్రాంతాలను సందర్శించి స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, ఆరోగ్య సేవలు, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలపై ఆరా తీశారు. జవహర్ నగర్ అభివృద్ధి కేవలం వ్యర్థాల నిర్వహణకే పరిమితం కాకూడదని, స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ధ్యేయంగా పనిచేయాలని జయేష్ రంజన్ అధికారులను ఆదేశించారు. స్థానికులకు స్థిరమైన ఉపాధి, మహిళలకు స్వయం ఉపాధి, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, చిన్నారులకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్య సేవలు అందించేలా అన్ని ప్రభుత్వ శాఖలు, పరిశోధనా సంస్థలు, స్థానిక ప్రజలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## సర్ ప్రక్రియ బాధ్యతగా చేపట్టాలి

మండల అభివృద్ధి అధికారి అపర్ణ



**ప్రజాపక్షం/షాబాద్:** సర్ ప్రక్రియ బాధ్యతగా చేపట్టి, వేగవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి అపర్ణ కోరారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంట, మాచన్‌పల్లి, హైతాబాద్, చందనవెల్లి, పోతుగల్, రుద్రారం గ్రామాలు సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు కల్గిన ప్రతి ఒక్కరూ ఫారమ్ నింపి పంచాయతీ కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రభియా సుల్తానా, అంగన్‌వాడీ టీచర్ కుసుమ కుమారి ఉన్నారు.

## యువతకు మెరుగైన క్రీడా సౌకర్యాలు

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** యువతకు మెరుగైన క్రీడా సౌకర్యాల కల్పన లక్ష్యమని, బైరామల్‌గూడ ఫ్లైవర్ కింద ఆట స్థలాన్ని రాత్రి సమయంలో వినియోగించే విధంగా క్రీడా సౌకర్యాలు కల్పిస్తామని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బైరామల్‌గూడ ఫ్లైవర్ కింద ఏర్పాటు చేసిన ఆట స్థలాలను పరిశీలించి, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. యువతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని, రాత్రి సమయంలో కూడా సురక్షితంగా ఆటలు ఆడుకునేలా హైమాస్ లైట్, ఎల్ఈడీ లైటింగ్‌ను ఏర్పాటు చేసే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశించారు. క్రీడలతో యువత ఆరోగ్యవంతమైన జీవనశలిని అలవర్చుకోవడంతో పాటు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఎక్కువ ఉంటుందన్నారు.

## బిసి సంఘాల మనోభావాలు దెబ్బతింటే క్షమించండి : జక్కిడి





**ప్రజాపక్షం/హయత్‌నగర్ :**సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్‌లలో వస్తున్న ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దని టిపిసిసి ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు కొద్దీ రోజులుగా సోషల్ మీడియాలో తన కుమారుడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి, యాదగిరి గుట్ట టెంపుల్ డైరెక్టర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌ని ఫ్లెక్సీ విషయంలో తిట్టాడని, నేను గౌడ సోదరులను తిట్టానని మా రాజకీయ ప్రత్యర్థులు ఎఐ ద్వారా వాయిస్ రికార్డ్‌లు చేసి బిసి సంఘాలను రెచ్చగొట్టి మా ఇంటిమీదికి దాడికి ఉసిగొల్పారన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే బిసి సంఘాలను రెచ్చగొట్టి రాజకీయ ఉనికి లేకుండా చేయాలనీ పన్నిన కుట్రలో భాగమే ఈ వాయిస్ రికార్డ్‌లు అని తెలిపారు. గౌడ, యాదవ సోదరుల మనోభావాలు దెబ్బతింటే క్షమించాలని జక్కిడి ప్రభాకర్ రెడ్డి కోరారు. సమావేశంలో పల్లె గణేష్ గౌడ్, మన్సూరాబాద్ గౌడ సంఘం నాయకులు పాతూరి వెంకట స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్ళు ఇవ్వాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప వివరించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులోని న్యూ టౌన్‌షిఫ్ కాలనీలో కౌన్సిలర్ సింగపాగ శిరీష అనిల్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ పైపులైన్ పనులను చైర్మన్ బసవేశ్వర్ అప్ప ప్రారంభించారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ జీటి వసంత శ్రీనివాస్, వెంకట్‌రాంరెడ్డి, వెల్‌జర్ల సర్పంచ్ బాబునాయక్, చిల్కమర్రి సర్పంచ్ రవీందర్‌రెడ్డి, శంకర్ నాయక్, కృష్ణయ్య, చెన్నయ్య గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్ చౌదరి, లక్ష్మీ నారాయణ గౌడ్, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## అర్హులైన ఓటర్లు జాబితాలో పేర్లు నమోదు చేసుకోండి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** అర్హులైన ఓటర్లు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని రెండవ వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్ కోరారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అంధించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బచ్చలి నరేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా బోగస్ ఓట్లు మారిపోయాయని, వాటిని నియంత్రించేందుకే ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని వివరించారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించి అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్పించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఏమైన ఉంటే ప్రస్తుతం సరి చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నరేష్, రమేష్‌తోపాటు బిఎల్‌ఓలు, బిఎల్ఏలు పాల్గొన్నారు.

## సిఎం పర్యటన.. డ్రోన్లు, పారాగ్లైడర్ల నిషేధం

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్లు, పారాగ్లైడర్ల వినియోగంపై నిషేధాజ్ఞలు జారీ చేసినట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి తెలిపారు. రిమోట్ కంట్రోల్డ్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల వినియోగాన్ని భారతీయ నాగరిక భద్రతా సంహిత (బిఎన్ఎస్ఎస్)సెక్షన్ 163 ప్రకారం నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఈ 25 వరకు గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో అమల్లో ఉంటాయి. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిషేధాజ్ఞలు అమలు చేయబడ్డాయి. ఉగ్రవాద, సంఘవిద్రోహ శక్తుల నుంచి ఎలాంటి ముప్పు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ ఉత్తర్వులు జారీ చేశారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని, ప్రజలు పోలీసు శాఖకు సహకరించి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు పాత విధానంలోనే.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి కృష్ణయ్య డిమాండ్



**ప్రజాపక్షం/కవాడిగూడ:** రాష్ట్రంలో 14 లక్షల కళాశాల విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8వేల కోట్లు పాత పద్ధతిలో వెంటనే విడుదల చేయాలంటూ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్. కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. బిసి సంఘం నేతలు నీలం వెంకటేష్, అనంతయ్య, మోడీ రాందేవ్, భగీల్ల సతీష్, జిల్లపల్లి అంజి అధ్యక్షతన మంగళవారం ఇందిరాపార్క్‌లోని ధర్నా చౌక్ వద్ద జరిగిన కార్యక్రమం దీక్ష బీసీ సంఘాల నాయకులు, విద్యార్థుల నినాదాలతో దద్దరిల్లింది. దీక్ష కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పలు బిసి సంఘాల, కుల సంఘాల నాయకులు సంఘీభావం తెలిపి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు విషయంలో ప్రభుత్వం మొండివైఖరి కాకుండా వెంటనే చెల్లించే విధంగా చర్య తీసుకోలన్నారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే బిసిల తిరుగుబాటు తప్పదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొత్త స్కీం పెట్టకుండా ఉన్న స్కీము తీసేస్తున్నారని ఆరోపించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు కట్టలేక, కళాశాలకు వెళ్లలేక, సర్టిఫికెట్లు తీసుకోలేక నరక యాత్ర అనుభవిస్తున్నారని, కళాశాలల యజమాన్యం కూడా ఫీజులు పెండింగ్ ఉండటంతో జీతాలు ఇవ్వలేక 200 కళాశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించకుండా రూ.300 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, విద్యార్థులకు విద్యని దూరం చేసే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతున్నారని కృష్ణయ్య ఆరోపించారు. ఇదిలాఉండగా బిసి సంఘం నేతలు, విద్యార్థులు సిఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు రాజేందర్, రామ్‌దత్, మల్లేష్, భీమ్ రావు, రామకోఠి, రామ్మూర్తి గౌడ్, అనురాధ, పద్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి ఆదేశం




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** భవిష్యత్ తాగునీటి అవసరాలు.. జలాశయాల్లో నీటి లభ్యత.. ట్యాంకర్ నిర్వహణ.. వర్షపు నీటి సంరక్షణ.. ఎంసిసి ఫిర్యాదుల పరిష్కారం.. సీవరేజ్ నిర్వహణ.. పెండింగ్ పనులు.. రెవెన్యూ వసూళ్లు... తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎండి అశోక్‌రెడ్డి మాట్లాడు సింగూర్..మంజీరా జలాశయాలకు ఆశించిన స్థాయిలో వరద ప్రవాహాలు రాని పరిస్థితి ఏర్పడితే, ఆ వ్యవస్థపై ఆధారపడిన ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సింగూర్ మంజీరా నుంచి నీటి సరఫరా అవుతున్న ప్రాంతాలు, ఆయా ప్రాంతాల కనీస నీటి అవసరాలు, సరఫరా తగ్గితే ఏర్పడే లోటు, గోదావరి, కృష్ణా, మిషన్ భగీరథ తదితర వనరుల నుంచి ఎంత నీటిని మళ్లించవచ్చనే అంశాలను లెక్కించాలని సూచించారు. ప్రత్యామ్నాయ నీటిసరఫరాకు అవసరమైన ఇంటర్‌కనెక్షన్, పైప్ లైన్లు, జంక్షన్లు, వాల్వులు, పంపింగ్ సదుపాయాలు, రిజర్వాయర్ ఇన్‌లెట్, ఔట్‌లెట్ మార్పులు, ప్రాంతాలవారీ నీటి కేటాయింపుతో కూడిన పూర్తి కంటింజెన్సీ ప్రణాళికను జూలై 16 లోగా సమర్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పంకజ, సంతోష్, డైరెక్టర్లు సుదర్శన్, నారాయణ, వాస సత్యనారాయణ, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఒలపై దాడులు సహించం

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లపై జరుగుతున్న దాడుల పట్ల తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బుద్ధ భవన్‌లోని మహిళా కమిషన్ క్యాంపు కార్యాలయంలో చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మిని బాధిత బిఎల్‌ఓలు కలిసి వినతిపత్రం సమర్పించారు. వివరాల సేకరణకు వెళ్లిన తమపై కొందరు దాడులకు తెగబడుతున్నారని, ఈ దాడులను నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రక్షణ కల్పిస్తేనే విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. బిఎల్‌ఓల వినతిపై తక్షణమే స్పందించిన చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి స్వయంగా బాధిత మహిళా ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న భద్రతా సమస్యలను సిపికి వివరించి, వారికి తక్షణమే తగిన రక్షణ కల్పించాలని కోరారు. 'విధుల్లో ఉన్న మహిళా సిబ్బందిపై దాడులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయి. బిఎల్‌ఓలు ఎవరూ భయపడాల్సిన పనిలేదు, మహిళా కమిషన్ మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. అందరూ నిశ్చింతగా విధులకు హాజరుకావచ్చు.' అని గద్వాల్ విజయలక్ష్మి వారికి భరోసా కల్పించారు.

## ఇసుక డంపింగ్ గోదాములు సీజ్ చేసిన మైనింగ్ అధికారులు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా రవాణా చేసి డంపింగ్ చేస్తున్న ఇసుక గోదాములపై మైనింగ్, రెవిన్యూ శాఖ అధికారులు కొరడా జూలిపించారు. మంగళవారం ఉదయం నుండే షాద్‌నగర్ మున్సిపాలిటిలో ఎక్కడేక్కడ ఇసుక డంపింగ్ చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకొని సోదాలు చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎలాంటి వే బిల్లులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయాల్లో అక్రమంగా ఇసుకను రవాణా చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతానికి సమీప వాగులతోపాటు మక్తల్, కొత్తకొట, కోయిలకొండ వంటి అనేక ప్రాంతాల నుండి రాత్రి సమయాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే వచ్చిన సమాచారం మేరకే ఈ తనిఖీలు చేస్తున్నామని వివరించారు. అక్రమంగా పెద్ద పెద్ద టిప్పర్లు, లారీల్లో వచ్చిన ఇసుకను గోదాముల్లో డంప్ చేసుకొని ఎక్కువ ధరకు విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారనే సమాచారంతోనే తనిఖీలు చేపట్టినట్లు మైనింగ్ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వే బిల్లులతో తీసుకువచ్చిన ఇసుకను ఎవరు కొనుగోలు చేయడం లేదని, ఇందుకు ఈ అక్రమ రవాణా ఇసుకనే అంటు తమకు వచ్చిన సమాచారంతోనే తనిఖీలు చేపట్టామని అధికారులు వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపారం చేసుకోవాలే తప్పా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు ఉన్నఫలంగా వచ్చి తనిఖీలు చేయడం ద్వారా తమ వ్యాపారం పూర్తిగా దెబ్బతింటుందని చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఫరూఖ్‌నగర్ మండల జీపిఓ జయమ్మను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

## ఆర్‌ఆర్ యాక్ట్ ఎత్తివేతకు సిఎంతో మాట్లాడుతా

ఫీజుల కోసం గన్‌పార్క్ వద్ద విద్యార్థుల నిరసనలో విహెచ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెండింగ్ ఫీజుల చెల్లింపు విషయమై విద్యార్థులపై రెవెన్యూ రికవరీ (ఆర్‌ఆర్) యాక్ట్‌ను ఎత్తివేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానని ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ సలహాదారులు, మాజీ ఎంపి వి.హనుమంతరావు హామీనిచ్చారు. మంగళవారం హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద తెలంగాణ విద్యార్థి జెఎసి చైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో "విద్యార్థులు పుస్తకాలు చదువుతూ... మా ఫీజులు మాకివ్వాలి" అంటూ నిరసన వ్యక్తంచేశారు. విహెచ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్య ఆగిపోకుండా ఫీజులు చెల్లించాలన్నారు. విద్యార్థుల సమస్యను తీర్చేందుకు కృషిచేస్తానన్నారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఫీజులు చెల్లించే స్థోమత లేక పేద విద్యార్థులు సీట్లు వదులుకొంటున్నారని, దీంతో వారు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సిఎం మౌనం వీడి, 14లక్షల మంది విద్యార్థులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణపై కమిటీ వేసిన ప్రభుత్వం అమలులో జాప్యం ఎందుకు చేస్తున్నదని ప్రశ్నించారు. విద్యారంగంపై మొద్దునిద్ర వీడి తక్షణమే రూ.8వేల కోట్ల ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేముల రామకృష్ణ మాట్లాడుతూ విద్యాశాఖపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి నందగోపాల్, కార్యదర్శులు సానియా, ఉదయ్ రక్షకదళం, వినయ్, వాణి, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమం

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉపాధ్యాయ, ఉద్యోగ,విద్యా రంగ సమస్యల పరిష్కారానికి అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలసి ఐక్య పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిఎస్) స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. యుయస్పిసి స్టీరింగ్ కమిటీ సమావేశం హైదరాబాద్‌లోని టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో టిటిఎ అధ్యక్షుడు ఎస్ హరికృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. టెట్ లో సర్వీసు వెయిటేజ్ ఇవ్వాలని, సబ్జెక్టు వారీ పేపర్లతో స్పెషల్ టెట్ నిర్వహించాలని, బిసి, గిరిజన గురుకులాల టైమ్‌టేబుల్‌ను మార్చాలని, , మోడల్ స్కూల్స్ ను విద్యాశాఖలో విలీనం చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, 5 వాయిదాల కరువు భత్యం (డిఎ) ను వెంటనే ప్రకటించాలని, పిఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని స్టీరింగ్ కమిటీ సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమావేశంలో యుఎస్పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ఎ వెంకట్(టిఎస్ యుటిఎఫ్) సిహెచ్ అనిల్ కుమార్, ఎన్.తిరుపతి( టిపిటిఎఫ్), ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి (డిటిఎఫ్), కొమ్ము రమేష్ (బిటిఎఫ్), యానం విజయకుమార్, ఇటికాల రవీందర్(ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం), బి.కొండయ్య (ఎంఎస్ టిఎఫ్), లక్ష్మణ్(టిటిఎ), రవీందర్, లక్ష్మయ్య యాదవ్(టిపిటిఎఫ్) పాల్గొన్నారు

# కొత్త తేదీ ప్రకటించాలి

**• మహారాష్ట్రలో టెట్ పేపర్ లీక్ వ్యవహారంలో రాహుల్ డిమాండ్ • లీకేజీ బాధ్యతలపై వెంటనే చర్యలు తీసుకోవాలి • నష్టపోయిన అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపివ్వాలి**



**న్యూఢిల్లీ/ఇండోర్ :** భారత విద్యారంగంలో అనేక లోపాలు బయటపడుతున్నాయి. నీట్ పేపర్ లీక్, పరీక్షల్లో అవకతవకలు జరుగుతుండగా, రాష్ట్రాల్లోనూ జరిగే పరీక్షల కూడా పెద్ద ఎత్తున అక్రమాలు బయటపడుతున్నాయి. ఇటీవల మహారాష్ట్రలో టెట్ పరీక్షకు ఒక రోజు ముందే పేపర్ లీక్ అయింది. దీంతో పరీక్షను రద్దు చేశారు. కాగా పరీక్షకు మరో కొత్త తేదీని ప్రకటించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ పరిస్థితి వల్ల నష్టపోయిన అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. థానే జిల్లాలో ప్రశ్నపత్రంలోని కొంత భాగం లీక్ అయినట్లు పోలీసులు గుర్తించి ముగ్గురిని అరెస్టు చేసిన తర్వాత, జూన్ 28న జరగాల్సిన టెట్ పరీక్షను ఒక రోజు ముందుగానే వాయిదా వేశారు. ఆ తర్వాత మహారాష్ట్ర పోలీసులు మరికొందరు అనుమానితులను అరెస్టు చేయడంతో, మొత్తం అరెస్టుల సంఖ్య పదికి చేరింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర టెట్ ప్రశ్నపత్రం లీక్ కావడంతో పరీక్ష రద్దయిందని, ఆరు లక్షల మంది అభ్యర్థులు అనిశ్చితిలో పడ్డారని రాహుల్‌గాంధీ మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. రెండు వారాలు గడిచినా, కొత్త తేదీ గురించి ఎటువంటి సమాచారం లేదని మండిపడ్డారు. లీక్‌కు బాధ్యులైన వారు ఇంకా పట్టుబడకుండా తిరుగుతుండగా, అభ్యర్థులు మాత్రం పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'కష్టపడి, నిజాయితీగా పనిచేసిన వారే మన దేశ ప్రస్తుత, భవిష్యత్తు ఉపాధ్యాయులు— భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దే వారు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి సన్నద్ధమై, దరఖాస్తులు నింపి, ఫీజులు చెల్లించి, మారుమూల ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలకు వెళ్లినప్పటికీ, ఎటువంటి సమాచారం లేకుండా వేచి చూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. 'ముఖ్యమంత్రి గారూ (దేవేంద్ర ఫడ్నవీస్) నేడు మూడు విషయాలు అవసరం: 1. కాలక్రమం: కొత్త టెట్ తేదీని వెంటనే ప్రకటించండి. 2. బాధ్యత: లీక్‌కు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి, అభ్యర్థులపై కాదు. 3. భవిష్యత్తు పరిరక్షణ: ఈ లీక్ కారణంగా ఒక సంవత్సరం వృథా అయిన వారికి వయోపరిమితిలో సడలింపు ఇవ్వండి' అని గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వ్యవస్థ వైఫల్యం వల్ల కలిగే భారాన్ని అభ్యర్థులు మోయాల్సి రావడం అన్యాయమన్నారు. విద్యా విప్లవానికి సమయం ఆసన్నమైందని, వ్యవస్థాగత వైఫల్యాల పర్యవసానాలను అనుభవించడం కాకుండా, యువత తమ కష్టానికి తగిన ఫలితాలను పొందే వ్యవస్థను నిర్మించాలని గాంధీ అన్నారు. ఇదిలా ఉడంగా, మహారాష్ట్రలో టెట్ పేపర్ లీక్ వ్యవహారానికి సూత్రధారులుగా అనుమానిస్తున్న బిజేంద్ర కుమార్ గుప్తా, సోనుకుమార్ కిషన్‌లాల్‌లను పట్టుకునేందుకు, ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రస్తుతం ఆర్థిక, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తోందని ఒక అధికారి తెలిపారు.

**నీట్ యుజి పేపర్ లీక్ నిరసనగా సైకిల్ ర్యాలీ**

నీట్ యుజి పరీక్షా పత్రం లీక్ వ్యవహారంలో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధికార బిజెపిని లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడింది. ఈ అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. నీట్ యుజి పరీక్షలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా ఇండోర్ నుండి భోపాల్ వరకు చేపట్టిన 'యువ స్వాభిమాన్: జెన్ – జి' సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు జితు పట్వారీ ప్రసంగిస్తూ ప్రవేశ, నియామక పరీక్షలలో పదేపదే జరుగుతున్న అవకతవకలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయన్నారు. మే నెలలో జరిగిన నీట్ యుజి పరీక్ష రద్దు కారణంగా దేశంలో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన ఆరోపించారు. పరీక్షలో జరిగిన అవకతవకలకు ప్రధాన్ నైతిక బాధ్యత వహించి, తన పదవికి రాజీనామా చేయాలని ఆయన పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో బిజెపి రెండున్నర దశాబ్దాల పాలనలో ప్రభుత్వ నియామక పరీక్షలలో భారీగా అక్రమాలు, అవినీతి జరిగాయని పట్వారీ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 50 శాతం ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇండోర్ నుండి ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ మంగళవారం రాత్రి అష్టాకు చేరుకుంది. బుధవారం అష్టా నుండి భోపాల్‌కు కొనసాగుతుంది.



# ప్రజల బాధలపై మోదీ ఎప్పుడు మాట్లాడుతారు?

**12 ఏళ్ల బిజెపి సర్కార్ హయాంలో సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను దెబ్బతీసింది : కాంగ్రెస్**



**న్యూఢిల్లీ:** జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతానికి పెరిగిన నేపథ్యంలో మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. గత 12 ఏళ్ల బిజెపి ప్రభుత్వ హయాంలో ధరల పెరుగుదల సామాన్య కుటుంబాల బడ్జెట్‌లను దెబ్బతీసిందని మండిపడింది. సామాన్య ప్రజల బాధల గురించి ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడు మాట్లాడతారని ప్రశ్నించింది. సోమవారం విడుదల చేసిన ప్రభుత్వ గణాంకాల ప్రకారం, మే నెలలో 3.93 శాతంగా ఉన్న వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 4.38 శాతానికి పెరిగింది. ఆహార వస్తువుల ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా అధికారులు పేర్కొన్నారు. జనవరి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త శ్రేణి ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం రిజర్వు బ్యాంకు 4 శాతం మార్కును దాటడం ఇదే తొలిసారి. ఈ కొత్త శ్రేణికి 2024నే ప్రాతిపదిక సంవత్సరంగా నిర్ణయించారు. బిజెపి ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో తప్పుడు హామీలు మాత్రమే పెరిగాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. మరోవైపు మాత్రం ద్రవ్యోల్బణం, నిరుద్యోగం రూపంలో ప్రజలపై తీవ్ర భారం పడిందని విమర్శించారు. ప్రభుత్వ గణాంకాలే జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 17 నెలల గరిష్ఠ స్థాయికి చేరినట్లు చూపిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 4.74 శాతంగా నమోదైందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు బ్యాంకు వడ్డీ రేట్లు కూడా పెరిగే అవకాశం ఉందని అన్నారు. అలాంటి పరిస్థితి వస్తే గృహ, వాహన రుణాల ఈఎంఐలు మరింత పెరిగి మధ్యతరగతిపై అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద పారిశ్రామిక వర్గాల లాభాలు పెరుగుతుంటే, ధరల భారం మాత్రం సామాన్య ప్రజలే భరిస్తున్నారని జైరామ్ రమేశ్ ఆరోపించారు. పెట్టుబడిదారులకు అండగా నిలుస్తున్న ప్రధాని మోదీ, సాధారణ ప్రజల కష్టాల గురించి ఎప్పుడు మాట్లాడతారు అని ప్రశ్నించారు. కాగా, మేలో 4.78 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం జూన్‌లో 5.32 శాతానికి చేరింది. వెండి, బంగారం, వజ్రాలు, ప్లాటినం ఆభరణాలు, అల్లం, టమాటా, కిస్మిస్ వంటి వస్తువుల ధరలు అధికంగా పెరిగిన వాటిలో ఉన్నాయి. మరోవైపు బంగాళాదుంప, బఠానీలు, కార్లు, జీలకర్ర, మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరల పెరుగుదల తక్కువగా నమోదైనట్లు ఎన్ఎస్ఓ వెల్లడించింది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా నమోదుకాగా, గ్రామీణ ప్రాంతాల్లో అది 4.74 శాతం, పట్టణ ప్రాంతాల్లో 3.92 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాలపై ధరల పెరుగుదల ప్రభావం మరింత ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

# జూన్‌లో 9.87 శాతానికి పెరిగిన ద్రవ్యోల్బణం



**న్యూఢిల్లీ :** ఆహార, ఆహారేతర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో, టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యుపిఐ) మే నెలలో 9.68 శాతం ఉండగా, జూన్‌లో 9.87 శాతానికి పెరిగింది. ఈ భారీ పెరుగుదల పశ్చిమాసియా సంక్షోభం, భారత్‌కు ముడిచమురు దిగుమతిలో కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద ఏర్పడిన దిగ్బంధం, దాని ప్రభావం వల్ల ఆహార ధరలపై పడిన ఒత్తిడిని ప్రతిబింబిస్తోంది. 'ఖనిజ నూనెలు (పెట్రోలియం ఉత్పత్తులతో సహా), ఆహార పదార్థాలు, ప్రాథమిక లోహాల తయారీ, రసాయనాలు, రసాయన ఉత్పత్తుల తయారీ రంగాలు జూన్‌లో డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ టోకు ధరల సూచీ (డబ్ల్యుపిఐ) గణాంకాలను విడుదల చేస్తూ పేర్కొంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఇంధనం, విద్యుత్ రంగంలో టోకు ద్రవ్యోల్బణం మే నెలలోని 30.33 శాతం నుండి జూన్ నెలలో 27.41 శాతానికి మారింది. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం మే నెలలోని 3.60 శాతం నుండి జూన్ నెలలో 5.49 శాతానికి పెరిగింది. జూన్ నెలలో ఆహారేతర వస్తువుల డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణం 11.07 శాతంగా, ఖనిజాల విషయంలో 9.45 శాతంగా నమోదైంది. తయారీ ఉత్పత్తుల విషయంలో ద్రవ్యోల్బణం మే నెల మాదిరిగానే 7.48 శాతం వద్ద స్థిరంగా ఉంది. రిటైల్ లేదా వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం కూడా పెరిగింది. ఇది అంతకుముందు నెలలో ఉన్న 3.93 శాతం నుండి జూన్ నెలలో 4.38 శాతానికి చేరి, గత 17 నెలల గరిష్ట స్థాయిని తాకింది. ద్రవ్య విధానాన్ని రూపొందించేటప్పుడు ప్రధానంగా సిపిఐని పరిగణనలోకి తీసుకునే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రధాన ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద (ఇరువైపులా 2 శాతం మార్జిన్‌తో) ఉంచేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. అంతర్జాతీయ ఇంధన ధరల పెరుగుదల ప్రభావం రిటైల్ పెట్రోల్, డీజిల్ ధరలపై పడటం వల్ల పెరిగిన 'ఇన్‌పుట్ ఖర్చులు' (ఉత్పత్తి వ్యయాలు) కారణంగా, గత నెలలో ఆర్‌బిఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తన ద్రవ్యోల్బణ అంచనాను 4.6 శాతం నుండి 5.1 శాతానికి పెంచింది.


ఫారం-6

[చట్టం - 30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ -1 రూల్ 19 ప్రకారం]

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం**

**కలెక్టర్, వరంగల్ వారి ప్రాథమిక ప్రకటన**

**(preliminary notification)**

**Gazette No. 44/WGL/2026, Date: 11.07.2026**

**ఫైల్ నెం. G/1736/2026** **తేది: 11-07-2026**

**ఫైల్ నెం. A/493/2017** **తేది: 17-06-2026**

కార్యనిర్వాహక ఇంజనీర్ జె చొక్కారావు దేవాదుల లిఫ్ట ఇరిగేషన్ స్కీం ములుగు డివిజన్ నెం. 4 గారి రిక్విజిషన్ ప్రకారం ఈ దిగువ నిర్దిష్టపరిచిన వరంగల్ జిల్లాలోని దుగ్గొండి మండలం, మహ్మదాపురం గ్రామములో ఉన్న భూమి విస్తర్ణం [**1.10**] **ఎకరములు** ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా రంగయ్య మరియు ఎర్రయ్య చెరువు 13 R-డిస్ట్రిబ్యూటరి ప్రధాన ఎడమ కాల్వ కి.మీ.0.000 నుండి 0.250 (TE) వరకు త్రవ్వకము నిమిత్తం. ఈ దిగివ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున, భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టము - 2013 లోని సెక్షన్ 11 [1] అనుసరించిప్రకటన జారీ చేయనైనది.

భూసేకరణలోని సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం 2013 [నెం.30/2013] లోని 10 [A] అనుసరించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము GO NO 63 నీటిపారుదల మరియు వాణిజ్య ప్రాంత అభివృద్ధి శక Dt:09.07.2017 అనుసరించి మినహాయించదగిన పరిదిలో ఉన్నందున చాప్టర్- 2. లోని సామాజిక ప్రభావం అధ్యాయన నివేదిక మరియు చాప్టర్- 3. లోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములు వర్తించవు.

కావున ఈ ప్రాజెక్ట్ క్రింద, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం, మహ్మదాపురం గ్రామములోని విస్తీర్ణం [**1.0850** ] **ఎకరములు** గల భూమి ఈ క్రింది చూపిన విధంగా భూసేకరణలో ఉన్నదని ప్రాథమిక ప్రకటన జారిచేయనైనది

షెడ్యూల్

గ్రామము : మహ్మదాపురం మండలం: దుగ్గొండి జిల్లా: వరంగల్

(కి.మీ. 0.000 నుండి 0.250 (TE)]

| క్రమ సంఖ్య | సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | పట్టాదారు మరియు అనుభవదారు పేరు | [illegible] |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| మహ్మదాపురం గ్రామము దుగ్గొండి మండలము | | | | | | |
| 1 | **300** | Dry | పట్టా | 0.20 | **పట్టాదారు** పాలడుగుల రమేష్ తండ్రి కొమురయ్య **ప్రస్తుతం మొఖాపై ఉన్న వారు** పాలడుగుల రమేష్ తండ్రి కొమురయ్య | లేవు |
| 2 | **312/1** | Dry | పట్టా | 0.09 | **పట్టాదారు** మైదమ్ కమల భర్త చిన్న రవి **ప్రస్తుతం మొఖాపై ఉన్న వారు** మైదమ్ కమల భర్త చిన్న రవి | లేవు |
| 3 | **356/1** | Dry | పట్టా | 0.1350 | **పట్టాదారు** కామ వేణు తండ్రి సాంబయ్య **ప్రస్తుతం మొఖాపై ఉన్న వారు** కామ వేణు తండ్రి సాంబయ్య | లేవు |
| 4 | | | ప్రభుత్వ భూమి | 0.06 | డొంక | లేవు |
| | | మొత్తం : **1.0850** | | | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత పునరావస పునరాశ్రయ హక్కు చట్టం 30 /2013 లోని నియమములోని సెక్షన్ 11 [1] ప్రకారం సంబంధిత భూయజమానులకు సరైన భూనష్ట పరిహారము చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, వరంగల్ మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, నర్సంపేట్ గారి కార్యాలయములో వుంచనైనది సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలో తనకి చేసుకోవచును జిల్లా కలెక్టర్, వరంగల్ గారు భూసేకరణ అధికారి / రెవెన్యూ డివిజినల్ అధికారి, నర్సంపేట్ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబందించి సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు భూమి కొలతలు తీసుకొనుటకు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 [4] ప్రకారం భూ సేకరణ ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, వరంగల్ గారి అనుమతి లేకుండ ప్రాథమిక ప్రకటన జారి చేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదాహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం తనఖి మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏవైనా అభ్యంతరములు వున్న యెడల చట్టములోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, వరంగల్ లేదా భూ సేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, నర్సంపేట్ గారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసి వున్నది.

ఇట్టి ప్రకటన జారి చేసిన [60] దినముల లోపల ఏమైన అభ్యంతరములు వున్న యెడల వారు తమ అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసి వున్నది.

సం/- భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి నర్సంపేట.
సం/- అదనపు కలెక్టర్[రెవెన్యూ] వరంగల్
సం/- జిల్లా కలెక్టర్ వరంగల్

DIPR RO NO. 484/LA/PP/Advt/Pub/2026-27


## వివాదాస్పద భోజ్‌శాల పక్కన ప్రార్థనల కోసం...

# ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి

**సుప్రీంకోర్టు ఆదేశం: ఇది తాత్కాలికమేనని స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ :** వివాదాస్పద భోజ్‌శాల స్థలానికి ఆనుకుని ఉన్న ప్రదేశంలో శుక్రవారాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3గంటల మధ్య నమాజ్ చేసుకునేందుకు ముస్లింలకు బహిరంగ స్థలాన్ని కేటాయించాలని మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే, ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్ల తుది ఫలితానికి లోబడి ముస్లింలకు సంబంధించిన ఈ ఏర్పాటు తాత్కాలికంగా ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అనుమతి లేకుండా ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణ మార్పులు చేపట్టరాదని భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. భోజ్‌శాల ఒక సున్నితమైన విషయం కాబట్టి హిందువులు, ముస్లిం పక్షాలు ఓపిక పట్టాలని కోరుతూ, ఈ విషయాన్ని రోజువారీగా విచారించి సమస్యను పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాల సముదాయం సరస్వతీదేవికి అంకితం చేయబడిన ఆలయమని పేర్కొన్న మధ్యప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వును సవాల్ చేస్తూ దాఖలైన పలు అప్పీళ్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. ప్రతీ వ్యక్తీకరణ విషయంలోనూ చాలా జాగ్రత్తగా ఉండాలని కోర్టు చెప్పింది. ఇవి చాలా సున్నితమైన విషయాలు. సమావేశంలో చెప్పే మాటలు అనవసరంగా వివాదాలు సృష్టించవచ్చు లేదా తప్పుడు అభిప్రాయాన్ని కలిగించవచ్చు. మనం ఉపయోగించే ప్రతీ పదం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మధ్యంతర ఏర్పాటుకు సంబంధించిన అంశం మా ముందుకు రావడం ఇదే మొదటిసారి. హైకోర్టు ఉత్తర్వు, శాంతిభద్రతలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం యొక్క నిస్సహాయతను కూడా గమనిస్తున్నాం. ప్రస్తుతం అమలులో ఉన్న ఏర్పాటు ఏదైనప్పటికీ, ఈ విషయాన్ని 10నుంచి 15 రోజుల్లోగా తగిన ధర్మాసనం ముందు విచారణకు పెట్టవచ్చని మా అభిప్రాయం' అని మౌఖికంగా తెలిపారు.సోమవారం ఉదయం ముస్లిం అప్పీల్‌దారుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది హుజెఫా అహ్మదీ, న్యాయవాది నిజాం పాషా, ఈ పిటిషన్లను అత్యవసర ప్రాతిపదికన విచారించాల్సిన అవసరం ఉందని ధర్మాసనాన్ని కోరారు. భారతప్రధాన న్యాయమూర్తి అప్పీల్‌దారుల తరపు న్యాయవాదిని పిటిషన్లలోని లోపాలను సరిదిద్దాలని కోరారు. వాటిని త్వరలో ధర్మాసనం ముందు విచారణకు జాబితా చేస్తామని సిజెఐ వారికి హామీ ఇచ్చారు. మే 15న భోజ్‌శాల–కమల్ మౌలా మసీద్ కాంప్లెక్ సరస్వతీదేవికి అంకితం చేయబడిన ఆలయమని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. అదేసమయంలో, ఆ ప్రదేశంలో ముస్లిం సమాజం ప్రార్థనలు చేసుకోవడానికి అనుమతించి, దశాబ్దాల నాటి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ఉత్తర్వును కూడా రద్దు చేసింది.

# బంకుల్లో ఇ20, ప్యూర్ పెట్రోల్ ఆప్షన్స్ ఇవ్వాలి

**ప్రధాని మోదీకి ఆప్ అధినేత కేజ్రీవాల్ లేఖ**




**న్యూఢిల్లీ :** ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై వ్యక్తమవుతున్న ఆందోళనపై చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం లేఖ రాశారు. ఒకవేళ మాట్లాడేందుకు అవకాశం ఇస్తే ఇ20 పెట్రోల్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలను, ప్రజల నుంచి తనకు వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను మోదీకి వివరిస్తానని పేర్కొన్నారు. పెట్రోల్ బంకుల్లో ఇ20 పెట్రోల్‌తో పాటు, స్వచ్ఛమైన పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఇ20 పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ బంకుల్లో స్వచ్ఛమైన పెట్రోల్ లేదా ఇ20 పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం వినియోగదారులకే ఉండాలని కేజ్రీవాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. 'ఎవరికైనా స్వచ్ఛమైన పెట్రోల్ కావాలంటే వారికి ఆ ఆప్షన్ ఉండాలి. అలాగే ఇథనాల్ కలిపిన పెట్రోల్ కావాలంటే వారికి ఆ ఛాయిస్ కూడా ఉండాలి' అని అన్నారు. ఇ20 పెట్రోల్‌కు సంబంధించి ప్రజలతో మాట్లాడి, వారి ఆందోళనలను అర్థం చేసుకున్న తర్వాతే తాను ప్రధాని మోదీకి లేఖ రాశానని తెలిపారు. సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే, ఇథనాల్ కలిపిన ఇంధనం (ఇ20) తక్కువ మైలేజీని ఇస్తుందని, అందువల్ల ఇ20 పెట్రోల్ ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు ఇ20 పెట్రోల్‌తో ఎదురవుతున్న అనుభవాలను స్వయంగా తెలియజేయడానికి తమ పార్టీ తరఫున ఒక ఆన్‌లైన్ పిటిషన్‌ను ప్రారంభించినట్లు కేజ్రీవాల్ తెలిపారు. దీనిని ఉపయోగించుకొని మైలేజీ, ఇతర సమస్యలపై ప్రజలు తమ ఆందోళనలను పంచుకోవాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌పై పెద్ద సంఖ్యలో సంతకాలు చేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలా సేకరించిన ప్రజా స్పందనలను తాను స్వయంగా ప్రధానికి సమర్పిస్తానని అన్నారు. ప్రధాని మోదీ తనకు త్వరలోనే అపాయింట్‌మెంట్ ఇస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, ఆప్ కార్యకర్తలు, ఇతరులు పెట్రోల్ బంకులు, సర్వీస్ స్టేషన్లకు నేరుగా వెళ్లి, వినియోగదారులతో మాట్లాడి, వారి అనుభవాలను వీడియోల రూపంలో సోషల్ మీడియాలో షేర్ చేయాలని కేజ్రీవాల్ కోరారు.

## నిషేధిత సిపిఐ (మావోయిస్టు)కు నిధుల సేకరణ కేసులో ఎన్ఐఎ మరో చార్జిషీట్


**న్యూఢిల్లీ:** నిషేధిత సిపిఐ (మావోయిస్టు) సంస్థకు నిధులు సమీకరించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) మరో చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో చందన్ కుమార్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ జార్ఖండ్‌లోని రాంచీ ప్రత్యేక న్యాయస్థానంలో మూడో చార్జిషీట్‌ను సమర్పించినట్లు నియా అధికారులు తెలిపారు. 2021 డిసెంబర్‌లో ఎన్ఐఎ స్వయంగా నమోదు చేసిన ఈ కేసు దర్యాప్తులో, చందన్ కుమార్ నిషేధిత సిపిఐ (మావోయిస్టు) కోసం చురుకుగా నిధులు సేకరించినట్లు తేలిందని వెల్లడించింది. ఈ కేసులో అతడిని 2026 జనవరిలో ముంబైలో అరెస్టు చేసినట్లు తెలిపింది.

## ఎపి, హర్యానాలో 'సర్' గడువు పొడిగింపు



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్, హర్యానాలలో జరుగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర ప్రక్రియ (సర్)కు సంబంధించిన వివిధ కార్యకలాపాల గడువును ఎన్నికల సంఘం మంగళవారం పొడిగించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు వేర్వేరుగా లేఖలు రాసింది. హర్యానా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి చేసే పరిశీలన ప్రక్రియ జులై 14 వరకు ఉండగా, ఇప్పుడు దానిని 24 వరకు పొడిగించారు. ఈ రెండు రాష్ట్రాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాలను మొదట జులై 21న విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే, ఇప్పుడు అవి 31న విడుదల కానున్నాయి. మే 14న ప్రారంభమైన సర్ ప్రక్రియలో ఈ రెండు రాష్ట్రాలు మూడవ దశలో భాగంగా ఉన్నాయి. మూడవ దశ పూర్తయ్యాక, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లడాఖ్ మినహా దేశమంతా సర్ ప్రక్రియ పరిధిలోకి వస్తుంది. వివిధ కారణాల వల్ల సర్ షెడ్యూల్‌లో తరచుగా మార్పులు చేయాల్సి వచ్చింది.

# లాలూ బెయిల్ ఉత్తర్వులపై జోక్యానికి 'సుప్రీం' నిరాకరణ




**న్యూఢిల్లీ :** ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. పశుగ్రాసం కుంభకోణం కేసులో బెయిల్ మంజూరు చేస్తూ జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. జస్టిస్‌లు ఎం.ఎం. సుందరేష్, పి.బి. వరలేలతో కూడిన ధర్మాసనం, ఈ విషయంలో పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లపై విచారణను వేగవంతం చేసి, వీలైతే ఆరు నెలల్లోగా వాటిపై తీర్పు ఇవ్వాలని హైకోర్టును కోరింది. హైకోర్టు జులై 2019 నాటి ఉత్తర్వును సవాలు చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. తాము ఉత్తర్వులో జోక్యం చేసుకోవడానికి సుముఖంగా లేమని ధర్మాసనం పేర్కొంది. పశుగ్రాసం కుంభకోణం కేసుల్లో ఒకదానిలో, ట్రయల్ కోర్టు విధించిన శిక్షను హైకోర్టు తప్పుగా నిలిపివేసి, రాష్ట్రీయ జనతా దళ్ అధినేతకు బెయిల్ మంజూరు చేసిందని పేర్కొంటూ సిబిఐ హైకోర్టు ఉత్తర్వును సవాలు చేసింది. బిహార్ మాజీ ముఖ్యమంత్రి అయిన యాదవ్, డియోఘర్ ఖజానాకు సంబంధించిన కేసులో దోషిగా తేలారు. అతనికి మూడున్నర సంవత్సరాల జైలు శిక్ష విధించింది. దేవ్‌ఘర్ ఖజానా నుండి రూ. 89.27 లక్షలను మోసపూరితంగా ఉపసంహరించుకున్నారనే ఆరోపణల కేసులో, యాదవ్ ఇప్పటికే సగం శిక్షను పూర్తి చేశారనే కారణంతో హైకోర్టు ఆ శిక్షను నిలిపివేసి, అతనికి బెయిల్ మంజూరు చేసింది.


**LOST & FOUND**

Lost original GPA No. 1799/1983 (Dt: 18-08-1983) of **Kandula Linganna S/o Rajanna** on 06-07-2026 between Mancherial Chowrasta and Bhagyanagar Road, Nirmal. Notary Affidavit obtained. Finder please contact: **Kota Ravindar, 8096629680.**


# హఫీజ్ సయీద్‌పై ఎన్ఐఎ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్




**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అధిపతి హఫీజ్ సయీద్ పై ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పహల్గామ్ ఉగ్రదాడి కేసులో సయీద్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసిన రెండు రోజుల తర్వాత, ఈనెల 8న ఎన్ఐఎ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఈ ఉత్తర్వును జారీ చేశారు. భారత్, అమెరికా దేశాలు ప్రపంచ ఉగ్రవాదిగా ప్రకటించిన సయీద్, 2008 ముంబయి ఉగ్రదాడుల సూత్రధారిగా కూడా పరిగణిస్తున్నారు. జమ్మూలోని ప్రత్యేక ఎన్ఐఎ కోర్టులో దాఖలు చేసిన ఈ అనుబంధ ఛార్జిషీట్‌లో, 76 ఏళ్ల సయీద్‌పై అతని వ్యక్తిగత హోదాతో పాటు, నిషేధిత ఎల్ఇటి, దాని అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) అధిపతిగా కూడా అభియోగాలు మోపారు. అతనిపై భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్), 2023, చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967లోని పలు నిబంధనల కింద కేసులు నమోదయ్యాయి. కోర్టు ఉత్తర్వు ప్రకారం, పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్ర సర్గోడా నివాసి, పరారీలో ఉన్న ఉగ్రవాది సయీద్, పహల్గామ్ ఉగ్రదాడిలో నిందితుడని, ఉద్దేశపూర్వకంగా అరెస్టు నుండి తప్పించుకుంటున్నాడని కోర్టుకు ఎన్ఐఎ తెలియజేసింది. 'నిష్పక్షపాతమైన, సంపూర్ణమైన, సమర్థవంతమైన దర్యాప్తు కోసం నిందితుడి (సయీద్) అరెస్టు, కస్టడీ విచారణ అవసరం. అందువల్ల అతనిపై నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేయబడింది. చట్ట ప్రకారం అమలు చేయడానికి దానిని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి), ఎన్ఐఎ జమ్ముకు పంపినట్లు' అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. గత సంవత్సరం ఏప్రిల్ 22న, దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు 26 మందిని పొట్టపెట్టుకున్నారు. వీరిలో ఎక్కువ మంది పర్యాటకులే ఉన్నారు.


**SUMATHI REDDY**
INSTITUTE OF TECHNOLOGY FOR WOMEN
Learning at its best
AN AUTONOMOUS INSTITUTION
Estd:2009
(SR Educational Academy)
Private Un-Aided Non-Minority Institution

College Code | **SRIW**

Ananthasagar, Hasanparthy, Warangal - 506 371
Email: principal@sritw.org, www.sritw.org
Mobile: +91 90526 36390, 96181 22472

AUTONOMOUS | Approved by AICTE | Affiliated to JNTUH | Accredited by NAAC with 'A' Grade | Accredited by NBA

**SPOT ADMISSIONS : ECET 2026-27**

Few seats are available in **II-B.Tech (Lateral Entry) CSE, CSE(AI&ML) and CSE(Data Science), CSE(Cyber Security) and ECE** branches for the academic year 2026-27. Interested eligible candidates who have not taken admission in any other institution can attend for Spot Admissions on **17.07.2026 at 10:00a.m**. Students are advised to attend Spot Admissions with all original certificates and necessary fee.

Admissions will be made as per the guidelines issued by the Convenor, TGECET-2026.

**Note: The Candidates admitted under Spot Admissions are not eligible for fee reimbursement/scholarship.**

Date:15.07.2026 Sd/- Secretary & Correspondent

# ఇరాన్ క్షిపణి దాడుల్లో మరో భారత నావికుడు మృతి

- పదిమంది భారత నావికులకు గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం
- వరుసగా మూడోరోజూ అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు
- బహ్రైన్‌లో అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్‌పై విరుచుకుపడిన ఇరాన్ డ్రోన్లు
- తక్షణం దాడులు ఆపాలని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ డిమాండ్

**దుబాయ్:** హోర్ముజ్ జలసంధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన రెండు సూపర్ ట్యాంకర్స్‌పై మంగళవారం ఇరాన్ చేసిన క్రూయిజ్ క్షిపణి దాడుల్లో ఒక భారత నావికుడు మరణించాడు. మరో పదిమంది భారత నావికులు గాయపడ్డారు. గాయపడిన భారత నావికులలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడినవారిలో ఇద్దరు ఉక్రేన్ జాతీయులు కూడా ఉన్నారు. దాడి కారణంగా రెండు మంటలు చెలరేగడంతో నావికులు గాయపడ్డారు. ఆ తర్వాత మంటలను అదుపు చేశారు. ఒమన్ ప్రాదేశిక జలాల్లో నౌకలు ప్రయాణం చేస్తుండగా ఈ దాడులు జరిగాయి. దీంతో భారతదేశం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హోర్ముజ్‌లో నావికుల భద్రతను ప్రశ్నించింది. జలసంధిలో నావికులు,పౌర మౌలిక సదుపాయాలు లక్ష్యంగా దాడులను తక్షణం నిలిపివేయాలని భారత విదేశీమంత్రిత్వశాఖ డిమాండ్ చేసింది.

మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్,అమెరికా కూడా ఈ పరిణామాల అదనుగా ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ ఉండటంతో జలసంధిలో యుద్ధ ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరుకున్నాయి. ఇరాన్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని, తమకు ప్రతీకారహక్కు ఉందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ హెచ్చరించింది. దీనిని బహిరంగ దాడిగా పేర్కొంటూ తీవ్రంగా ఖండించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎంటి అల్ బహియా, ఎంటి మొంబాసా అనే రెండు నౌకలలో మొత్తం 46 మంది నావికులు ప్రయాణం చేస్తున్నారు. వీరిలో మొత్తం 30 మంది భారత నావికులు ఉన్నారు. మూడోరోజు మంగళవారం అల్ బహియా ట్యాంకర్‌పై ఇరాన్ చేసిన క్షిపణి దాడి వల్ల వీరిలో ఒక భారత నావికుడు మరణించాడు. గడచిన మూడు రోజుల యుద్ధంలో ఇద్దరు భారత నావికులు ఇరాన్ దాడుల కారణంగా హత్యకు గురయ్యారు. అంతకుముందు జూన్ 10వ తేదీ బుధవారం అమెరికా చేసిన దాడుల్లో ముగ్గురు భారత నాయకులు హత్యకు గురయ్యారు. దీంతో పశ్చిమాసియా యుద్ధంలో ఇప్పటివరకూ మరణించిన మొత్తం భారత నావికుల సంఖ్య 14కు పెరిగింది. ఈ పరిస్థితులమధ్య హోర్ముజ్ జలసంధిలో వివిధ దేశాలకు చెందిన వేలాదిమంది నావికులు తీవ్ర అభద్రతకు గురవుతూ ఉండటంతో భారత ప్రభుత్వం తక్షణం దాడులు ఆపాలని డిమాండ్ చేసింది. దీనిపై ఇరాన్ ఐఆర్‌జిసి వివరణ ఇచ్చింది. తాము నిర్దేశించిన మార్గంలో వెళ్ళకుండా తప్పుదారిన రెండు సూపర్ ట్యాంకర్లూ ప్రయాణం చేస్తున్నాయని, పదే పదే హెచ్చరికలు చేసినప్పటికీ వారు మాట పెడచెవినపెట్టి నిర్లక్ష్యంగా మందుపాతరలు అమర్చిన మార్గంలో ప్రయాణం చేశారని అందుకే వాటిపై క్షిపణి దాడులు చేశామని పేర్కొంది. ఐతే నౌకల పేర్లను ఐఆర్‌జిసి ప్రకటించలేదు.కాగా ఒమన్‌లోని ఖల్హాత్‌కు ఈశాన్యంగా ఒక ట్యాంకర్‌పై దాడి జరిగిందని, ఎలాంటి నష్టం వాటిల్లలేదని బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజన్సీ ప్రకటించింది.ఈ పరిణామాలతో మంగళవారం చమురు ధరలు నెలరోజులక్రితంనాటి హెచ్చుస్థాయికి చేరుకున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర 9.6 శాతం పెరిగింది. దీని బ్యారెల్ ధర 85 డాలర్ల సమీపానికి చేరింది. చట్టవిరుద్ధమైన మార్గాలలో నుండి ప్రయాణం చేయాల్సిందిగా నౌకలను అమెరికా రెచ్చగొడుతోందని, ఈ దాడులకు అమెరికా బాధ్యత వహించాలని పేర్కొంది. దురాక్రమణలకు పాల్పడుతున్న శత్రువులతో చేతులు కలిపి వారికి సహకరిస్తే ఇదేవిధంగా యుద్ధం కొనసాగుతుందని, హోర్ముజ్ జలసంధిని తెరవడంలో జాప్యం జరుగుతుందని, చివరకు ప్రపంచానికి తీవ్ర ఇంధన సంక్షోభమే మిగులుతుందని ఐఆర్‌జిసి హెచ్చరించింది. హోర్ముజ్ జలమార్గం భవిష్యత్తును నిర్ణయించడంలో అమెరికాకు,పశ్చిమ దేశాలకు ఎలాంటి ప్రమేయం లేదని, వారి జోక్యాన్ని అనుమతించబోమని ఇరాన్ ఉన్నతస్థాయి సంయుక్త సైనిక కమాండ్ హెచ్చరించింది. ఈ ఘర్షణలు ఈ ప్రాంతాన్ని అస్థిరపరచాయని, యుద్ధం ఈ ప్రాంతం అంతటా విస్తరించిందని విమర్శించింది.ఇంకోవైపు అమెరికా-ఇరాన్ మధ్య వరుసగా మూడోరోజు మంగళవారం కూడా భీకర స్థాయిలో పరస్పర దాడులు కొనసాగాయి. ఇరాన్ ప్రమేయం లేకుండా హోర్ముజ్ జలసంధిని తామే స్వాధీనం చేసుకుని నిర్వహిస్తామని, నౌకల నుండి ఇరవైశాతం ఛార్జీలు వసూలు, ఇరాన్ ఓడరేవులపై తొలగించిన దిగ్బంధనాన్ని మళ్ళీ అమలు వంటి ప్రకటనలతో ఇరాన్‌ను ట్రంప్ రెచ్చగొట్టడంతో యుద్ధం విస్తరించింది. ఎంఓయు ఒప్పందాన్ని మీరంటే మీరే ఉల్లంఘించారని ఆరోపణలు చేసుకుంటూ హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యంకోసం అమెరికా-ఇరాన్ కొత్త యుద్ధానికి తెరతీయడంతో వాణిజ్య నౌకలలో ఉన్న నావికులు, కార్మికులు, సిబ్బంది ప్రాణభయంతో ఉన్నారు.

మంగళవారం తెల్లవారకముందుగానే బహ్రైన్‌లో ఉన్న అమెరికా నౌకా కేంద్రం ఫిఫ్త్ ఫ్లీట్‌పై ఇరాన్ ఐఆర్‌జిసి సైన్యాలు క్షిపణులు,డ్రోన్లతో దాడులు చేశాయి. దీంతో ఆగ్రహించిన అమెరికా సెంట్ కామ్ సైన్యాలు ఇరాన్‌పై తీవ్రస్థాయిలో గగనతల దాడులు చేయడం ప్రారంభించింది. మంగళ-బుధవారాలలో ఇరాన్‌ను తీవ్రస్థాయిలో అణచివేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. బహ్రైన్‌పై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడటంతో సైరన్లు అదేపనిగా మోత మోగాయి. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని బహ్రైన్ ప్రభుత్వం తక్షణ ఆదేశాలు జారీ చేసింది

## నావికుడి హత్యపై ఇరాన్‌కు భారత్ తీవ్ర నిరసన

- యుద్ధ దాడుల్లో ఇప్పటివరకూ 14 మంది భారత నావికులు మృతి

**న్యూఢిల్లీ:** ఒమన్ ప్రాదేశిక జలాల్లో వెళుతున్న చమురు ట్యాంకర్‌లో ఉన్న మరో భారత నావికుణ్ణి హత్య చేయడంతో ఇరాన్‌కు కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిరసన తెలియజేసింది. న్యూఢిల్లీలో ఉన్న ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ రాయబార కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ మహ్మద్ జవాద్ హోస్సేనీని భారత విదేశీ మంత్రిత్వశాఖాధికారులు పిలిపించి తీవ్ర నిరసన తెలియజేశారు. పశ్చిమాసియాలో హింస నివారించి, శాంతి-సుస్థిరతలను తిరిగి నెలకొల్పేందుకు చర్చలు,దౌత్యానికి తిరిగి రావాలని మరోసారి పిలుపు ఇచ్చింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎంటి అల్ బహియా, ఎంటి మొంబాసా అనే రెండు నౌకలలో మొత్తం 46 మంది నావికులు ప్రయాణం చేస్తున్నారు. వీరిలో మొత్తం 30 మంది భారత నావికులు ఉన్నారు. అల్ బహియా ట్యాంకర్‌లో 12 మంది భారతీయులు ఉండగా, దీనిపై ఇరాన్ చేసిన క్షిపణి దాడివల్ల ఒక భారత నావికుడు మరణించగా మరొకరు గాయపడ్డారు. మొంబాసా ట్యాంకర్‌లో ఉన్న 18 మంది భారతీయులలో తొమ్మిదిమంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరు భారత నావికుల పరిస్థితి విషమంగా ఉంది. ఫిబ్రవరి 28వ తేదీన యుద్ధం మొదలైనప్పటినుండీ ఇప్పటివరకూ 14 మంది భారత నావికులు హోర్ముజ్ జలసంధిలో జరిగిన దాడుల్లో మరణించారు.

జులై 12వ తేదీన సైప్రస్ జెండాతో వెళుతున్న చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడి చేయడంతో ఒక భారతీయ నాయకుడు గల్లంతయ్యాడు. ఇప్పటివరకూ ఆయన జాడ తెలియరాలేదు. ఆయనకోసం సైప్రస్ షిప్పింగ్ మంత్రిత్వశాఖ ఒమన్ అధికారులతో కలిసి ఉమ్మడిగా తీవ్ర గాలింపు చర్యలు కొనసాగుతున్న సమయంలో మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చమురు ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఈ దాడిలో మరో భారతీయ నావికుడు మరణించగా మరో పది మంది నావికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలను భారత ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించి జవాద్ హోస్సేనీని తమ సమక్షానికి పిలిపించి భారత విదేశీ మంత్రిత్వ శాఖ హెచ్చరిక చేసింది. తక్షణం హోర్ముజ్ జలసంధిలో దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేసింది. మరణించిన భారత నావికుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేసింది. గాయపడిన భారత నావికులంతా సత్వరం కోలుకోవాలని ఆకాంక్షించింది. వారికి తగిన వైద్యసేవలు లభిస్తున్నాయని పేర్కొంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని భారత రాయబార కార్యాలయాలు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని, ఈ ఘటనల్లో చిక్కుకున్న భారత నావికులు అందరికీ సాధ్యమైనంత ఎక్కువ సహాయం అందేవిధంగా గల్ఫ్‌దేశంలో ఉన్న అధికారులతో భారత దౌత్యవేత్తలు,సిబ్బంది సంప్రదింపులు జరుపుతున్నారని విదేశీమంత్రిత్వశాఖ తెలియజేసింది. ''హోర్ముజ్ వంటి కీలకమైన అంతర్జాతీయ జలమార్గాలలో సురక్షిత,స్వేచ్ఛాయుతమైన నౌకాయానానికి అంతరాయం కలిగిస్తూ, నావికులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ దాడులను హింసాత్మక చర్యలను భారత్ తీవ్రంగా ఖండిస్తోంది, దాడులను వ్యతిరేకిస్తోంది,పశ్చిమాసియాలో దాడులు తిరిగి ప్రారంభం కావడంపట్ల భారత్ తీవ్ర ఆందోళనతో ఉంది, ఈ ప్రాంతంలో శాంతి,సుస్థిరతల కోసం దౌత్యమార్గంలోకి తిరిగి వారాలి, చర్చలు మళ్ళీ ప్రారంభించాలి'' అని భారత విదేశీమంత్రిత్వశాఖ కోరింది. ''ముఖ్యంగా అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నౌకాయానాన్ని సత్వరం పునరుద్ధరించాలంటే పౌర,వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిలిపివేయడం ఒక్కటే పరిష్కారం'' అని పేర్కొంది.

కాగా భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రణధీర్ జైస్వాల్ మంగళవారం న్యూఢిల్లీలో పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, ఇరాన్ దౌత్యవేత్తకు భారత్ తన తీవ్ర నిరసన తెలియజేసిందని, ఈ దాడులు వీలైనంత త్వరగా ఆగిపోవాలని కోరుకుంటున్నామన్నారు. పశ్చిమాసియాలో పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోందని, హోర్ముజ్ జలసంధిలో నిరాఘాటంగా నిశ్చింతగా వాణిజ్య నౌకలు రాకపోకలు సాగించాలని పదే పదే తాము కోరుతూనే ఉన్నామని, ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఇంధన,ఆర్థిక భద్రత సాధించడానికి ఈ జలమార్గం అత్యంత కీలకమైనదని రణధీర్ జైస్వాల్ అన్నారు.

ఇదిలా ఉండగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రక్షణమంత్రిత్వశాఖ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, ఒమన్ ప్రాదేశిక జలాల్లో హోర్ముజ్ జలసంధి దక్షిణ షిప్పింగ్ మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో ఎంటి మొంబాసా, ఎంటి అల్ బహియా నౌకలపై ఇరాన్ క్రూయిజ్ క్షిపణి దాడి చేసిందని పేర్కొంది. సైప్రస్ జెండాతో వెళుతున్న కంటైనర్ షిప్ జిఎఫ్ఎస్ గెలాక్సీపై ఇరాన్ దాడి చేసిన రెండు రోజుల తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నౌకలపై జులై 14 ఉదయం మళ్ళీ దాడులు చేసింది. గెలాకీ నౌకలో ఒక భారతీయులు జాడతెలియకుండా పోగా, పదిమంది సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. జాడతెలియని భారత నావికుడికోసం గాలింపు కొనసాగుతోంది.

### అవినీతిపై చైనా పోరాటం

# కమ్యూనిస్టుపార్టీ పొలిట్ బ్యూరో నేత బహిష్కరణ



**బీజింగ్:** వివిధ రంగాలలో అవినీతిపై చైనా దీర్ఘకాలంగా చేస్తున్న పోరాటంలో భాగంగా అధికార కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ చైనా (సిపిసి) నుండి ఒక సీనియర్ నాయకుణ్ణి పార్టీ బహిష్కరించింది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించి ప్రజాసేవలు చేయకుండా అవినీతికి పాల్పడినందుకు గ్జిన్‌జియాంగ్ రాష్ట్ర పార్టీ ఉన్నతస్థాయీ మాజీ అధిపతి మా జింగ్రుయీ(67)ని పార్టీ బహిష్కరించింది.ప్రభుత్వ సేవల నుండి తొలగించింది. దేశంలో అత్యున్నతమైన నిర్ణయాధికార సంస్థ,శక్తిమంతమైన పొలిట్‌బ్యూరోలో సభ్యుడుగా కూడా కొనసాగుతున్న జింగ్రుయీ పార్టీకి ఉన్న నమ్మకాలు,ఆదర్శాలను కోల్పోయారని, రాజకీయ విశ్వాసాలను వదిలిపెట్టి పార్టీ మూల సూత్రాలకు ద్రోహం చేశారని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా ఒక ప్రకటనలో పేర్కొంది. ఆయన పార్టీ రాజకీయ నియమాలు, సూత్రాలను తీవ్రంగా ఉల్లంఘించినట్లు దర్యాప్తులో వెల్లడైందని చైనా ప్రభుత్వ వార్తాసంస్థ జిన్హువా వెల్లడించినట్లు పిటిఐ వార్తాసంస్థ పేర్కొంది. మా జింగ్రుయీ 24 మంది సభ్యులున్న పొలిట్‌బ్యూరోలో సభ్యుడు. ఈ విధంగా అవినీతి విచారణకు గురైనవారిలో మూడవ నాయకుడు.105 సంవత్సరాల పార్టీ చరిత్రలో సమీపకాల పరిణామాల్లో ఇది అత్యంత అరుదైన ఘటనగా పేర్కొం ది. మా జింగ్రుయీ పార్టీ రాజకీయ,సంస్థాగత క్రమణశిక్షణ ఉల్లంఘించి మార్కెట్ ధరలకంటే తక్కువగా ఇళ్ళు కొనుగోలు చేయడం, అధికారం, డబ్బు సంపాదించడానికి లైంగిక సంబంధాల లావాదేవీలలో పాల్గొనడంతోపాటు తన పదవి, అధికారం ఉపయోగించుకుని కుటుంబ సభ్యులు భారీగా ప్రయోజనం పొందడానికి అనుమతించారని తమ దర్యాప్తులో తేలిందని సిపిసి పేర్కొంది. వ్యాపార ప్రయోజనాలు,ప్రాజెక్టుల కాంట్రాక్టులు, ఉద్యోగ పదోన్నతుల ప్రయోజనాలు ఇతరులకు కల్పించాలని సిఫార్సులు చేసినట్లు పేర్కొంది. బంధువులు,సన్నిహితులు,ఇతరులతో కుమ్మక్కై భారీ మొత్తంలో ధనాన్ని, కానుకలను స్వీకరించారని ఈ కారణంగా ఆయన పొలిట్‌బ్యూరో సభ్యత్వాన్ని రద్దుచేయాలని, ప్రభుత్వ పదవి నుండి తొలగించి పార్టీ నుండి బహిష్కరించి అక్రమ ఆస్తులు జప్తుచేయాలని,20వ సిపిసి జాతీయ కాంగ్రెస్ ప్రతినిధిగా ఆయన హోదాను రద్దుచేయాలని సిపిసి ఆదేశించిందని జిన్హువా పేర్కొంది.

2012లో జీ జిన్‌పింగ్ దేశాధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టినప్పటినుండీ అన్నిస్థాయిల్లోనూ అవినీతిని పర్యవేక్షిస్తున్నారు. సైనికరంగంలో ఉన్నతస్థాయీ జనరల్స్‌సహా ఎవ్వరినీ వదిలిపెట్టకుండా బహిష్కరణతోపాటు మరణ దండన శిక్షలు కూడా కఠినంగా ఆయన అమలు చేస్తున్నారు.అవినీతి వ్యతిరేక చర్యల్లో భాగంగా వందలమందిపై ఆయన క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.

## దూషణలు ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. అధికారంలో ఎవరు ఉన్నా నిపుణుల సలహాలు, సూచనలు, అధికారుల అభిప్రాయాల మేరకు విధానాలను రూపొందించే వారు మాత్రమేనన్న అంశం మరువరాదని పేర్కొన్నారు.

### కేంద్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలి

ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు కోరారు. వెంటనే నిపుణుల కమిటీని రంగంలోకి దించాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) ద్వారా నిపుణులను ఇక్కడికి పంపించి అధ్యయనం చేయించడం ద్వారా అసలు విషయం తేల్చి ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ చూపాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి నీళ్లు వదిలితే అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కూడా ప్రమాదంలో పడతాయని ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదికను సిడబ్ల్యుసికి పంపి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలో కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉంటే ఇప్పటికే ఏదో ఒక పరిష్కారం లభించేదని, కానీ ఈ అంశాన్ని రాజకీయాల కోసం అలాగే వదిలేశారని పేర్కొన్నారు.

### ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వం నిర్లక్ష్యం

గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. తుది దశకు చేరుకున్న ప్రాజెక్టులు అనేకం ఉన్నాయని వీటికి కొద్ది మొత్తం నిధులు కేటాయిస్తే ఇప్పటికే పూర్తు అందుబాటులోకి వచ్చేయని, ప్రస్తుత వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో ఇవి ఎంతో ఉపయోగపడేవని ఆయన పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా వంటి ప్రాజెక్టులతో పాటు తమ ప్రాంతంలోని సీతారామ ప్రాజెక్టు పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. తక్కువ బడ్జెట్ పూర్తయ్యే అవకాశమున్న ఈ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయకుండా రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.

### ఓటర్ల నమోదు ప్రక్రియ గడువును 3 నెలలు పెంచాలి

ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించి ఈ నెల 24తో గడువు ముగుస్తున్న నేపథ్యంలో, ఆ సమయం ఏమాత్రం సరిపోదని, గడువును కనీసం మరో మూడు నెలల పాటు పొడిగించాలని సాంబశివరావు ఎన్నికల కమిషన్ కోరారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలలోనే 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉన్నందన సమాచారం నేపథ్యంలో అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదును పర్యవేక్షించాలని డిమాండ చేశారు.

### ఎన్‌డిఎస్‌ఎ ప్రత్యేక కమిటీ త్వరగా నివేదిక అందించాలి : పశ్యపద్మ

కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీటిని పంపింగ్ చేయవచ్చని కొందరు, అది సాధ్యం కాదని మరికొందరు వాదిస్తున్న నేపథ్యంలో గత జూన్ 30న ఎన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ త్వరితగతిన పరిశీలన పూర్తి చేసి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని పశ్యపద్మ డిమాండ చేశారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, దీనిపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ అధికార పార్టీ కాంగ్రెస్ నేతలు ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించే వరకు అందరూ కలిసి పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలోని దాదాపు 63 శాతం మండలాలలో లోటు వర్షపాతం నమోదు కావడంతో ఇప్పటికే రైతులు లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, కంది, మినుము, పెసర వంటి పంటలు సాగు చేయగా, ఈ పంటలు చివరి దాకా చేతికి వస్తాయన్న నమ్మకం లేదన్నారు. ఈ నేపథ్యంలో మెట్ట పంటల రైతులకు ఎకరాకు రూ.8 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని, తద్వారా రైతులకు కొంతైనా వెసులుబాటు కలిగి, వారు ప్రత్యామ్నాయంగా మెట్ట పంటల ద్వారా ఆహార పదార్థాలను అందించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## పూర్తి చేయండి

(మొదటి పేజీ తరువాయి)

బ్యారేజీకి సీప్లేన్లు హైదరాబాద్ హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీప్లేన్లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరగా, అందుకు సమంధించిన అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సిఎంను కేంద్ర మంత్రి కోరారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్‌అండ్‌బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావుతో పాటు పౌర విమానయాన శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు**

అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మీడియాతో వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకు సహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచారలోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని సిఎం చెప్పారు.

**ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి**

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో పనుల ప్రారంభానికి కేంద్ర మంత్రిమండలి అనుమతి ఇప్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలు రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తికావడమే కాకుండా నిర్మాణ వ్యయం తగ్గుతుందని వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని ఈ సందర్భంగా సిఎం కోరారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపి పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్ విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బందరు పోర్ట్ వరకు రవాణా వేగవంతమవుతుందని తెలిపారు. మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సిఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారికి అనుమతులు మంజూరు చేయాలని నితిన్ గడ్కరీని కోరారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని సిఎం చెప్పారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సిఎం ప్రతిపాదించారు. సమావేశంలో నల్గొండ ఎంపి రఘువీర్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హక్కులు పరిశీలించకుండా లీజు సరికాదు-హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవన యజమాని అనుమతి లేకుండా ఉపలీజుకు ఇచ్చిన భవనాన్ని పోలీస్ స్టేషన్‌గా వినియోగించడం చట్టవిరుద్ధమని హైకోర్టు స్పష్టం చేసింది. హక్కులను పరిశీలించకుండా భవనాన్ని లీజుకు తీసుకున్న చర్లపల్లి ఎస్‌హెచ్‌ఓ తీరును తప్పుబట్టింది. భవన యజమాని ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలించి మూడు నెలల్లో తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. అద్దె ఒప్పందం గడువు ముగిసిన నేపథ్యంలో ఉపలీజు చెల్లదని పేర్కొంటూ, అవసరమైతే తిరిగి కోర్టును ఆశ్రయించవచ్చని పిటిషనర్‌కు సూచించింది.

## మాజీ డిజిపిలకు భద్రత కొనసాగించండి-హైకోర్టు

మాజీ డిజిపిలు స్వరణ్‌జిత్‌సేన్, జె.పూర్ణచంద్రరావులు దాఖలు చే సిన పిటిషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వారి వినతిపత్రాలను ప్రభుత్వం పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే వరకు ప్రస్తుతం కల్పిస్తున్న భద్రత, బుల్లెట్ ప్రూఫ్ వాహనం సహా అన్ని సదుపాయాలను కొనసాగించాలని ఆదేశించింది.

పిటిషనర్ల వాదనలు విని తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తూ పిటిషన్లను ముగించింది.

## ఇరాన్‌ను నెట్టేశాం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ఉభయసభలకు ట్రంప్ లిఖితపూర్వకంగా తెలియజేశారు. కాంగ్రెస్‌అమోదం లేకుండా అమెరికా అధ్యక్షు డు 60 రోజులపాటు ఏ దేశంమీద అయినా యుద్ధం చేయవచ్చు. ఆ తర్వాత యుద్ధం చేయాలంటే కాంగ్రెస్ ఉభయసభల్లో తీర్మానం చేయాలి. ఇంతకుముందు ఫిబ్రవరి 28న యుద్ధం ప్రా రంభించి ఏప్రిల్ రెండో తేదీన ఆపేశారు. గతనెల (జూన్ 17,18)లో ఇరాన్‌తో సంతకాలు చేసిన ఎంఒయును ఆయన చులకనచేసి మాట్లాడారు. అది ఒక పరీక్ష మాత్రమేనని, ఆ ఒప్పంద నిబంధనలకు కట్టుబడి ఉండని నీచమైన దెయ్యాలతో తాము తలపడాల్సివస్తోందని, అందువల్ల ఈ ఒప్పందానికి అర్థంలేదని విమర్శించారు. ఐతే ఇరాన్ కూడా అమెరికాపై ఇదే తరహా విమర్శలు చేసింది. ఇస్లామాబాద్ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని, వారు ఒప్పందానికి కట్టుబడి ఉండని మనుషులని, వారికి నీతి లేదని విమర్శించింది. హోర్ముజ్ జలసంధిలో నియంత్రణ ఇరాన్‌కే ఉంటుందని గలనెలలో ఎంఓయు తేల్చి చెప్పిందని, ఈ ఒప్పందాన్ని వారు ఉల్లంఘించారని విమర్శించింది. అందువల్ల ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్‌పై ఇరాన్ నియంత్రణ చట్టబద్ధమైనదని పేర్కొంది.

ఇరాన్ నాగరికతను సర్వనాశనం చేస్తామని గతంలో ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలు చెలరేగాయి. ఆయన సొంత పార్టీలో,ప్రతిపక్షంలో కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. కానీ నెలల విరామం తర్వాత ట్రంప్ మళ్ళీ అదేతరహా విమర్శలు ఎక్కుపెట్టారు. హోర్ముజ్ జలసంధికోసం రెండు దేశాలమధ్యా పోరాటం అదుపుతప్పిన తరుణంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ పాలకులకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి నిరసన చేసే ప్రదర్శకులకు మద్దతు కొనసాగిస్తారా? అని ప్రశ్నించగా, ఈ ఆలోచనను వ్యతిరేకించారు. నిరాయుధులైన నిరసన ప్రదర్శకులను ప్రభుత్వ సాయుధ బలగాలు ఉక్కుపాదంతో అణచివేస్తున్నాయని,వారి ముందు సామాన్య ప్రజలు ఎదురు నిలబడలేరని అన్నారు. పాలకులపై తిరగబడాలని తాను కోరుకున్నప్పటికీ, ఇరాన్‌లో తిరుగుబాటు విజయవంతమవుతుందని తానెప్పుడూ విశ్వసించలేదన్నారు. ఇరాన్‌తో ఎంఓయు సమయంలో నెతన్యాహూను బలిపశువును చేశారన్న విమర్శలపై స్పందిస్తూ, ఆ దేశంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు.తామిద్దరం అధికారంలో లేకపోతే ఇజ్రాయెల్ ఈనాడు ఈ విధంగా ఉండేదికాదన్నారు.

అంతకుముందు మంగళవారం తెల్లారకముందుగా సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెడుతూ, ఇరాన్ ఓడరేవులపై మళ్ళీ దిగ్బంధనాన్ని పునరుద్ధరించినట్లు ప్రకటించారు. సెంట్‌కామ్ 'రక్షకుడు పాత్ర' నిర్వహిస్తుందని,ఈ జలసంధి ద్వారా ప్రయాణించే అన్ని కార్గో నౌకల నుండి 20 శాతం ఛార్జీలు వసూలు చేస్తామని ప్రకటించారు. ''ఇకమీదట అమెరికాను 'హోర్ముజ్ సంరక్షకుడు' అని పిలుస్తారు, అత్యంత అస్థిరమైన ఈ ప్రాంతంతో భద్రత నిమిత్తం ప్రతిఫలం తీసుకుని జలసంధిని కాపాడతాం'' అని పేర్కొన్నారు.

## దీక్ష విరమించ

(మొదటి పేజీ తరువాయి)

పోస్టు చేశారు. వాంగ్‌చుక్ ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తనకు ఫోన్ చేశారని, ఆయన పరిస్థితి పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని దీప్కే తెలిపారు. మరో పోస్ట్‌లో, శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే కూడా తనతో మాట్లాడారని, వాంగ్‌చుక్ ఆరోగ్యం వేగంగా క్షీణిస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారని దీప్కే వెల్లడించారు. నిరవధిక నిరాహార దీక్షలో ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చేరిన ఎఐఎస్ఎ కార్యకర్త దీపక్, మంగళవారం ఉదయం డిశ్చార్జ్ అయ్యారు. మిగిలిన కార్యకర్తలు నేహా, మనీష్, అమీన్ నిరసన స్థలంలోని వేరొక వేదిక వద్ద తమ నిరవధిక దీక్షను కొనసాగిస్తున్నారని ఆ సంస్థ తెలిపింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షలలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అందించాలని సిజెపి డిమాండ్ చేస్తోంది.

**దీక్ష విరమించాలని ప్రతిపక్ష నేతలు, ప్రముఖులు విజ్ఞప్తి**

ఇదిలా ఉండగా, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంక్‌చుక్ కొనసాగిస్తున్న నిరవధిక దీక్షను విరమించాలని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతిపక్ష నాయకులు, పలువురు ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. హృదయం లేని బిజెపి ప్రభుత్వానికి ఏ త్యాగం కూడా విలువైనది కాదని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. వాంగ్‌చుక్‌ను తన దీక్షను విరమించాల్సిందిగా కోరారు. సోనమ్ ప్రాణం ప్రపంచం మొత్తానికి అమూల్యమైనదని, ప్రజాస్వామ్యం పట్ల ఉన్నట్టే మానవత్వం, పర్యావరణం పట్ల కూడా ఆయనలో అదే అంకితభావం కనిపిస్తుందని అఖిలేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆమరణ దీక్ష ద్వారా ఆయన మేల్కొల్పాలని ప్రయత్నిస్తున్న బిజెపి ప్రభుత్వం స్వయంగా ఒక విలువలు లేని, అవినీతిమయమైన వ్యవస్థ అని, దాని అసంవేదన, కఠిన హృదయ స్వభావం దృష్ట్యా, ఎవరి త్యాగమైనా దానికి ఏమాత్రం ముఖ్యం కాదని దుయ్యబట్టారు. అందువల్ల బిజెపి సభ్యుల నుండి ఔచిత్యాన్ని లేదా వారిలో మార్పును ఆశించడం పూర్తిగా వ్యర్థమన్నారు. అయోధ్యలోని రామమందిరంలో విరాళాల చోరీ ఘటనపై కూడా యాదవ్ బిజెపిని విమర్శించారు. అధికారం కోసం గుళ్ళను కూడా దోచుకునే వారికి 'సత్యాగ్రహం' ప్రాముఖ్యత ఎలా అర్థమవుతుందని ప్రశ్నించారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహిస్తున్న నిరసనకు తమ పార్టీ మద్దతును ప్రకటించారు. అలాగే, వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన నిరవధిక నిరాహార దీక్షను విరమించాలని ఆయన కోరారు. మంగళవారం మీడియా సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ వాంగ్‌చుక్‌కు, సిజెపి నిరసనకు తన మద్దతును తెలియజేయడానికి గురువారం సాయంత్రం 5 గంటలకు జంతర్ మంతర్‌ను సందర్శిస్తానని చెప్పారు. వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తోందని, ఆయన దేశానికి ఒక ఆస్తి వంటివారన్నారు. ఆయన తన నిరాహార దీక్షను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఈ పోరాటానికి ఇతర మార్గాలు కూడా ఉన్నాయని కేజ్రీవాల్ తెలిపారు. పేపర్ లీక్‌లను అరికట్టడానికి, భవిష్యత్తులో విద్యార్థులు సమస్యలు ఎదుర్కోకుండా కాపాడటానికి పరీక్షా విధానాన్ని మెరుగుపరచాలని కేజ్రీవాల్ అన్నారు. అంతకు ముందు శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే కూడా వాంగ్‌చుక్ ఆరోగ్యం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ తన నిరాహార దీక్షను విరమించాలని కోరారు.

**ధర్మేంద్ర ప్రధాన్ డిమాండ్‌కు ప్రముఖులు మద్దతు**

రచయిత్రి అరుంధతీ రాయ్, నటులు నసీరుద్దీన్ షా, రత్నా పాఠక్ షా, ఆర్థికవేత్త జయతి ఘోష్ లతో సహా పలువురు ప్రముఖ పౌరులు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌కు తమ పూర్తి మద్దతును ప్రకటిస్తూనే, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నిరసనకారులను తమ దీక్షను విరమించుకోవాలని కోరారు. సోమవారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో సంతకం చేసిన వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిస్తున్నందుకు నిరసనకారులకు అత్యంత కృతజ్ఞతలు తెలిపారు, అదే సమయంలో క్షీణిస్తున్న సోనమ్ ఆరగ్యం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత కోసం మీరు ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న తీరు, వారి సంకల్పం, ధైర్యసాహసాలకు తాము సెల్యూట్ చేస్తున్నాన్నారు. 'ముందున్న సుదీర్ఘమైన, కఠినమైన పోరాటాన్ని దృష్టిలో ఉంచుకుని, దయచేసి ఈ నిరాహార దీక్షను తక్షణమే విరమించుకోవాలని మేము మిమ్మల్ని కోరుతున్నాము. ఈ పోరాటం ఒక మారథాన్ లాంటిది, స్వల్పకాలిక పరుగు పందెం కాదు; రాబోయే రోజుల్లో మాకు మీరు, మీ బలం, మీ నాయకత్వం అవసరం. డిమాండ్లపై స్పందించడంలో ప్రభుత్వం విఫలమవ్వడం వల్ల నిరాహార దీక్ష చేస్తున్న వారి ఆరోగ్యం మరింత ప్రమాదంలో పడవచ్చని తాము ఆందోళన చెందుతున్నాం' అని సంతకం చేసిన వారు పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యే రోజున, సిజెపి తలపెట్టిన పార్లమెంటు మార్చ్‌లో పాల్గొనాలని ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. రాయ్, నసీరుద్దీన్ షా, రత్న పాఠక్ షా, జయతీ ఘోష్ లతో పాటు, విద్యావేత్తలు అనురాధ చెనోయ్, నివేదిత మీనన్, తనికా సర్కార్, ఆదిత్య నిగమ్, చిత్రనిర్మాత సంజయ్ కాక్, కార్యకర్త లలితా రామ్‌దాస్, కవితా శ్రీవాస్తవ, స్త్రీవాది మధు భూషణ్, సాంస్కృతికవేత్త అరుంధతీ ఘోష్‌లు కూడా ఈ ప్రకటనపై సంతకాలు చేశారు.

# ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో భారత్‌దే విజయం

ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా ఎట్టకేలకు విజయం సాధించింది. వరుసగా నాలుగు పరాజయాల తర్వాత మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసింది. మంగళవారం ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో సమష్టిగా రాణించిన భారత్ 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. అక్షర్ పటేల్(4/62, 57*) ఆల్‌రౌండర్ ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించగా.. శుభ్మన్ గిల్(75 బంతుల్లో 11 ఫోర్లు, సిక్సో 80 రిటైర్డ్ హర్ట్) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 47.5 ఓవర్లలో 258 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ నాలుగు వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్‌బ్రార్ రెండేసి వికెట్లు పడగొట్టారు. జస్ప్రీత్ బుమ్రా, శివమ్ దూబేకు చెరో వికెట్ దక్కింది. అనంతరం భారత్ 45.2 ఓవర్లలో 4 వికెట్లకు 262 పరుగులు చేసి 28 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని కైవసం చేసుకుంది. శుభ్మన్ గిల్, అక్షర్ పటేల్(52 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సో 57 నాటౌట్), వాషింగ్టన్ సుందర్(63 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సో 52



నాటౌట్) హాఫ్ సెంచరీలతో సత్తా చాటగా.. శ్రేయస్ అయ్యర్(35) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 259 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియాకు ఆశించిన శుభారంభం దక్కలేదు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన రోహిత్ శర్మ(11)తో పాటు విరాట్ కోహ్లి (5) తీవ్రంగా నిరాశపర్చారు. సామ్‌కరణ్ బౌలింగ్లో రోహిత్ శర్మ క్యాచ్ ఔటవ్వగా.. విరాట్ కోహ్లిని జోఫ్రా ఆర్చర్ ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. ఈ ఇద్దరూ వెనువెంటనే వెనుదిరిగడంతో భారత్ 48 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో కెప్టెన్ శుభ్మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆచితూచి ఆడి ఇన్నింగ్స్ను నిలబెట్టారు. అయ్యర్ కాస్త నిదానంగా ఆడినా.. గిల్ తనదైన శైలిలో బౌండరీలు బాదాడు. ఈ క్రమంలో శుభ్మన్ గిల్ 51 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 101 పరుగుల భాగస్వామ్యంతో ఈ జోడీ క్రీజులో పాతుకుపోయింది. గిల్ సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ అతన్ని దురదృష్టం వెంటాడింది. క్రాంప్స్ రావడంతో గిల్ రిటైర్డ్ హర్ట్గా వెనుదిరిగాడు. అతను మైదానం వీడిన కాసేపటికే క్రీజులో సెట్ అయిన శ్రేయస్ అయ్యర్.. అనవసర పరుగుకు ప్రయత్నించి రనౌటయ్యాడు. ఆ వెంటనే కేఎల్ రాహుల్(1) క్లీన్ బౌల్ కావడంతో భారత శిబిరంలో ఆందోళన మొదలైంది. కానీ అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆచితూచి ఆడి జట్టును విజయం దిశగా నడిపించారు. అక్షర్ పటేల్ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించాడు. ఈ క్రమంలో అతను 39 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేయడంతో భారత విజయం లాంఛనమైంది. విన్నింగ్ షాట్‌గా సిక్సర్ బాదిన సుందర్.. 63 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే గురువారం జరగనుంది.

## వెంటాడిన భుజం గాయం.. సాత్విక్ చిరాగ్ జోడీ నిష్క్రమణ..!

జపాన్ ఓపెన్‌లో దుమ్మురేపాలనుకున్న భారత డబుల్స్ ద్వయం కల చెదిరింది. టోర్నీలో ఫేవరెట్ అయిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జంట అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. మొదటి మ్యాచ్‌లోనే సాత్విక్ సాయిరాజ్‌కు భుజం గాయం తిరగబెట్టడంతో ఇక ఆడలేమంటూ.. తొలి ఈ స్టార్ జోడీ కోర్టును వీడింది. దాంతో.. డెన్మార్క్ జంటను విజేతగా ప్రకటించారు నిర్వాహకులు. ఫేవరెట్‌గా జపాన్ ఓపెన్ బరిలో నిలిచిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి ద్వయం డెన్మార్క్ ఆటగాళ్ల డానియెల్ లుండ్గర్డ్ మాడ్స్ వెస్టెర్గార్డ్తో మ్యాచ్ సమయంలో సాత్విక్ కుడి భుజం నొప్పి కారణంగా ఆటను కొనసాగించలేకపోయాడు. ఈ ఏడాది పలుమార్లు సాత్విక్ భుజం గాయంతో బాధపడ్డాడు. మార్చి నెలలో ఇదే సమస్యతో సాత్విక్ చిరాగ్ ద్వయం స్విట్జర్లాండ్ ఓపెన్ నుంచి ఇంటాకొచ్చేసింది. ఏప్రిల్లో బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్షిప్,.. అనంతరం ఇండోనేషియా ఓపెన్‌లో సైతం వీరు ఆడలేదు. అయితే.. థామస్ కప్‌లో కాంస్యం.. సింగపూర్ ఓపెన్‌లో టైటిల్ విజయంతో దారిలో పడిన ఈజంట.. జపాన్ ఓపెన్‌ను బాధతో వీడక తప్పలేదు. ఆసియా క్రీడల్లో పతకమే లక్ష్యంగా పెట్టుకున్న సాత్విక్ చిరాగ్ అంతకం టే ముందే బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్ షిప్‌లో పోటీపడనున్నారు.




## వైదొలుగుతున్న టీమిండియా కోచ్ డస్కేట్



వరుసగా రెండు టి20 సిరీస్‌లు కోల్పోయిన భారత జట్టుకు మరో షాక్. సహాయక కోచ్ రియాన్ టెన్ డస్చేట్ తన బాధ్యతల నుంచి వైదొలగనున్నాడు. వ్యక్తిగత కారణాలతో అతడు ఒక కొనసాగవద్దనే నిర్ణయానికి వచ్చాడని సమాచారం. ఇదే విషయాన్ని డస్చేట్ ప్రధాన కోచ్ గౌతం గంభీర్, బీసీసీఐకు అతడు తెలియజేశాడు. ఒకవేళ గౌతీ, భారత బోర్డు ఆమోద ముద్ర వేస్తే ఇంగ్లండ్ పర్యటనతోనే టీమిండియా అసిస్టెంట్ కోచ్గా డస్చేట్ పదవీకాలం ముగియనుంది. టి20ల్లో ఊహించని విధంగా ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో టీమిండియా వైట్‌వాష్‌కు గురయ్యాక.. ఆటగాళ్లపైనే కాదు కోచింగ్ సిబ్బందిపైనా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్‌తో తొలి వన్డే జరుగుతుండగానే అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్చేట్ రాజీనామా వార్త వెలుగులోకి వచ్చింది. క్రిక్బజ్ కథనం ప్రకారం.. తనను సహాయక కోచ్ బాధ్యతల నుంచి తప్పించాలని అతడు హెడ్కోచ్ గౌతం గంభీర్, బీసీసీఐని కోరాడు. అయితే.. అటు గౌతీగానీ, ఇటు భారత బోర్డుగానీ డస్చేట్ గురించి ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఒకవేళ.. డస్చేట్ కోరినట్టే వెళ్లేందుకు అంగీకరిస్తే.. ఇంగ్లండ్తో మూడుల వన్డే సిరీస్తో భారత అసిస్టెంట్ కోచ్గా అతడి ప్రస్థానం ముగియనుంది. నెదర్లాండ్స్ మాజీ ఆటగాడైన డస్చేట్ రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయక కోచ్గా చేరాడు. ఐపీఎల్లో కోల్కతా నైట్ రైడర్స్ కోచింగ్ సిబ్బందిలో ఒకటైన అతడిని గౌతం గంభీర్ తన బృందంలో చేర్చుకున్నాడు.

## మహిళ

## మహిళల్లో 'ఎడిహెచ్‌డి' గుర్తింపులో ఆలస్యం ఎందుకు?

అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివిటీ డిజార్డర్' (ఎడిహెచ్‌డి) గురించి చాలా కాలంగా ఉన్న సాధారణ అభిప్రాయం ఏమిటంటే, ఇది చిన్న పిల్లల్లో, ముఖ్యంగా అల్లరి చేసే అబ్బాయిల్లో కనిపించే సమస్య అని. కానీ ఇటీవలి పరిశోధనలు ఈ అభిప్రాయం పూర్తిగా సరైనది కాదని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా మహిళల్లో 'ఎడిహెచ్‌డి' తరచుగా గుర్తించబడకుండా పోతోంది. అధ్యయనాల ప్రకారం, పురుషులతో పోలిస్తే మహిళలకు 'ఎడిహెచ్‌డి' నిర్ధారణ సగటున ఐదేళ్లు ఆలస్యంగా జరుగుతోంది. చాలామందికి మొదట ఆందోళన, నిరాశ లేదా ఇతర మానసిక ఆరోగ్య సమస్యలుగా తప్పుగా నిర్ధారణ అవుతోంది. మరికొందరికి జీవితాంతం అసలు 'ఎడిహెచ్‌డి' ఉన్నట్లు కూడా తెలియకపోవచ్చు.

**లక్షణాలు దాచిపెట్టే సామాజిక ఒత్తిడి...**నిపుణుల అభిప్రాయం ప్రకారం, మహిళల్లో 'ఎడిహెచ్‌డి' ఆలస్యంగా గుర్తించబడటానికి ప్రధాన కారణం సామాజిక అంచనాలు. చిన్నప్పటి నుంచే అమ్మాయిలు ప్రశాంతంగా ఉండాలి, క్రమశిక్షణతో ప్రవర్తించాలి, ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదనే భావన సమాజంలో బలంగా ఉంటుంది. దీంతో చాలామంది తమ అసలు ప్రవర్తనను బయటపెట్టకుండా నియంత్రించుకోవడం నేర్చుకుంటారు. దీనినే 'మాస్కింగ్' అంటారు. బయటకు వారు శ్రద్ధగా వింటున్నట్లుగా, పనులు క్రమబద్ధంగా చేస్తున్నట్లుగా కనిపించినా, వారి మనసులో మాత్రం నిరంతరం ఆలోచనలు పరుగులు తీస్తుంటాయి. తరగతి గదిలో పగటి కలలు కనడం, పనులను చివరి నిమిషం వరకు వాయిదా వేయడం, ఒకేసారి అనేక పనులు చేయాలనే ప్రయత్నం, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు కనిపించినా, అవి ఇతరులకు పెద్దగా కనిపించవు. ఈ కారణంగా ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, వైద్యులు కూడా వాటిని 'ఎడిహెచ్‌డి'గా గుర్తించలేకపోతారు.



**ఎలా కనిపిస్తుంది?...**నిపుణులు చెబుతున్నట్లుగా, 'ఎడిహెచ్‌డి' ప్రతి వ్యక్తిలో ఒకే విధంగా ఉండదు. ఇది కేవలం లింగం ఆధారంగా మారదు. వ్యక్తిత్వం, కుటుంబ పరిస్థితులు, సంస్కృతి, సామాజిక వాతావరణం వంటి అనేక అంశాల ప్రభావం ఉంటుంది. కొంతమంది మహిళలు చిన్నప్పటి నుంచే చదువులో బాగా రాణిస్తారు. అందువల్ల వారికి 'ఎడిహెచ్‌డి' ఉండదని భావిస్తారు. కానీ వాస్తవానికి వారు అధిక శ్రమతో, తమసమస్యలను దాచుకుంటూ ఆ స్థాయికి చేరుకుని ఉండవచ్చు. ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, పిల్లల సంరక్షణ వంటి ఒత్తిడులు పెరిగే కొద్దీ ఈలక్షణాలు మరింత స్పష్టంగా బయటపడతాయి. ముఖ్యంగా మధ్యవయస్సులో హార్మోన్ల మార్పులు ప్రారంభమైనప్పుడు ఏకాగ్రత లోపం, జ్ఞాపకశక్తి సమస్యలు, మానసిక అలసట వంటి ఇబ్బందులు ఎక్కువ కావచ్చు. అప్పుడు మాత్రమే చాలామంది తమ సమస్యకు అసలు కారణం 'ఎడిహెచ్‌డి' అని తెలుసుకుంటారు.

**అవగాహన అవసరం...**గతంలో 'ఎడిహెచ్‌డి'పై పరిశోధనలు ఎక్కువగా చిన్న వయసు అబ్బాయిల ఆధారంగా జరిగాయి. అందువల్ల మహిళల్లో కనిపించే లక్షణాలు చాలావరకు నిర్లక్ష్యానికి గురయ్యాయి. అయితే ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. సామాజిక మాధ్యమాలు, కొత్త పరిశోధనలు, మహిళలు తమ అనుభవాలను బహిరంగంగా పంచుకోవడం వల్ల ఈ అంశంపై అవగాహన పెరుగుతోంది. 'ఎడిహెచ్‌డి'ని కేవలం ఒక వ్యాధిగా కాకుండా, మెదడు పనితీరులో సహజమైన వైవిధ్యంగా కూడా చూడాలనే అభిప్రాయం బలపడుతోంది. సరైన సమయంలో గుర్తిస్తే చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం వంటి రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను మెరుగ్గా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఇదే మహిళలకు సరైన సహాయం అందించడానికి, వారి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కీలకమైన ముందడుగు అవుతుంది.

## ఎదురుగాలులకు ఎదురెళ్లిన బెరిల్

'ఈ ప్రయాణం అసాధ్యం.. ఎదురుగాలులను జయించడం ఎవరి వల్లా కాదు' అని అందరూ చెప్పారు. వాదించారు. వారించారు. కానీ ఆ మాటలు 34 ఏళ్ళ బెరిల్ మార్కమ్ సంకల్పాన్ని ఏమాత్రం కదిలించలేకపోయాయి. తన చిన్న విమానాన్ని ఆకాశంలోకి ఎగరేసి, ప్రపంచం అసాధ్యమని భావించిన సవాలును ఆమె స్వీకరించింది. ఇంగ్లాండ్‌లో జన్మించిన బెరిల్ మార్కమ్ బాల్యం నేటి కెన్యాలో గడిచింది. చిన్నప్పటి నుంచే ప్రకృతితో మమేకమై, గుర్రాల శిక్షణలో నైపుణ్యం సంపాదించింది. అనంతరం కెన్యాలో తొలిమహిళా వాణిజ్య పైలట్‌గా గుర్తింపు పొందింది. అడవులు, పర్వతాలు, నిర్జన ప్రాంతాల మీదుగా తపాలా, మందులు, ప్రయాణికులను సురక్షితంగా చేరవేస్తూ ధైర్యవంతమైన పైలట్‌గా పేరుతెచ్చుకుంది. ఆ రోజుల్లో అట్లాంటిక్ మహాసముద్రాన్ని తూర్పు నుంచి పడమరకు ఒంటరిగా దాటడం దాదాపు అసాధ్యమని విమానయాన నిపుణులు భావించేవారు. ఎందుకంటే అనుకూల గాలులకు బదులుగా ఎదురుగాలులు నిరంతరం విమానాన్ని వెనక్కి నెట్టేవి. ఇం ధనం వేగంగా ఖర్చవుతుంది, చిన్న పొరపాటు కూడా ప్రాణాంతకంగా మారుతుంది. అయినప్పటికీ బెరిల్ వెనక్కి తగ్గలేదు. 1936 సెప్టెంబర్ 4న ఆమె ఇంగ్లాండ్ నుంచి ఒంటరిగా బయలుదేరింది. దాదాపు 21 గంటలపాటు చీకటి, మంచు, తీవ్ర గాలి అలజడులు, తగ్గిపోతున్న ఇంధనంతో పోరాడింది. చివరకు గమ్యస్థానం న్యూయార్క్ చేరుకోలేకపోయినా, కెనడాలోని నోవా స్కోషియాలో అత్యవసరంగా విమానాన్ని దింపి ప్రాణాలతో బయటపడింది. విమానం దెబ్బతిన్నా, ఆమె మాత్రం భయంతో కాకుండా, చిరునవ్వుతో విమానం నుంచి బయటకు రావడం విశేషం. ఆ చిరునవ్వే ఆమె విజయానికి నిజమైన గుర్తుగా నిలిచిపోయింది. అట్లాంటిక్‌ను తూర్పు నుంచి పడమరకు ఒంటరిగా విజయవంతంగా దాటిన తొలి మహిళగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. తరువాత ఆమె తన అనుభవాలను 'వెస్ట్ విత్ ది నైట్' అనే పుస్తకంగా రాసింది. ఆ రచనను ప్రముఖ రచయిత ఎర్నెస్ట్ హెమింగ్‌వే కూడా ప్రశంసించాడు. విజయం అంటే ఎప్పుడూ గమ్యాన్ని సంపూర్ణంగా చేరుకోవడం కాదు. ప్రపంచం అసాధ్యం అని చెప్పినప్పుడు కూడా మనపై మనకు నమ్మకం ఉంచి ముందుకు సాగడం. మార్గంలో ఎదురుదెబ్బలు తగిలినా ధైర్యాన్ని కోల్పోకపోవడం. ఎదురుగాలులను చూసి వెనక్కి తిరిగినవారు సాధారణంగా మిగిలిపోతారు. అదే ఎదురుగాలుల వైపే ఎగిరినవారే చరిత్రలో నిలిచిపోతారు. బెరిల్ సాహసయాత్ర ఈ విషయాలను గుర్తుచేస్తునే ఉంటుంది.



# 'సర్' గడువు పొడిగించాలి

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) గడువును కనీసం మూడు నెలల పాటు పెంచాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ సుమారు 25 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో జరుగుతోందని, దీనిపై సాధారణ ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ఓటర్లకు సరైన అవగాహన కల్పించడంలో ఎన్నికల సంఘం అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) ఇళ్లకు పంపిణీ చేసిన ఫారాలలో కేవలం 15 శాతం వరకు మాత్రమే తిరిగి పూరించి అందజేశారని తెలిపారు. ఇంత తక్కువ శాతంతో గడువు ముగిస్తే లక్షలాది మంది అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ కోసం ఓటర్లు పాత రికార్డులను (కొన్ని సందర్భాల్లో 2002 నాటి ఓటర్ లిస్ట్ వివరాలను లేదా శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలను) సమర్పించాల్సి వస్తోందని, సాధారణ ప్రజలు రోజువారీ కూలీలు ఈ డాక్యుమెంట్లను తక్కువ సమయంలో సంపాదించడం కష్టంగా మారిందని అన్నారు. సర్వే కోసం బిఎల్‌ఓలు ఇళ్లకు వెళ్లినప్పుడు చాలా ఇళ్లకు తాళాలు వేసి ఉండటం, ఉపాధి కోసం ప్రజలు వేరే ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల చాలా మంది ఓటర్ల వివరాల నమోదు సాధ్యం కాలేదని,ఉదయాన్నే పనులకు వెళ్లే కార్మికులు, పారిశుధ్య కార్మికులు బిఎల్‌ఏలను కలవలేకపోతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే బూత్ లెవెల్ అధికారులకు, ఈ కొత్త నిబంధనలు, ఫారాలను ఎలా పూరించాలనే దానిపై సరైన శిక్షణ లేదని, దీనివల్ల ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతోందని, జూలై 24గా ఉన్న ప్రస్తుత గడువును కనీసం మరో 3 నెలల పాటు పొడిగించాలని, అప్పుడే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభిస్తుందన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరునికి ల్పించిన ఓటు హక్కును దూరం చేయవద్దని, అందరికీ ఎస్ఐఆర్ అవకాశం కల్పించడం ద్వారానే ఒక్కరికి ఒకే ఓటు లక్ష్యం సక్రమంగా నెరవేరుతుందన్నారు. ప్రజలందరికీ సమాన అవకాశం కల్పించేలా ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ గడువును పొడిగించాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, పంజాల రమేష్, సంగి ఎలేందర్, ఓర్సు రాజు, మహ్మద్ అక్బర్‌పాషా, రాజేందర్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.




# కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు


## ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ పిలుపు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేలా కేంద్రంపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ పిలుపునిచ్చారు. నిర్మల్ పట్టణంలో జరిగిన ఎఐటియుసి 4వ జిల్లా మహాసభలకు బాలరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిర్మల్ పట్టణంలోని గాంధీ పార్క్ నుంచి పెన్షనర్ భవన్ వరకు వందలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి బాలరాజ్‌తో పాటు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.ఫయాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి రమేష్ సారథ్యం వహించారు. అనంతరం పెన్షనర్ భవన్‌లో సీనియర్ నాయకులు ఎస్ఎన్.రెడ్డి ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. పి.పద్మకుమారి, ఎస్‌కె.ఫయాజ్, పి.ముత్యంల అధ్యక్షతన జరిగిన మహాసభలో స్టీరింగ్ కమిటీ, తీర్మానాల కమిటీ, అర్హతల కమిటీలను సభ ఆమోదించింది. ఎస్. బాలరాజ్ ప్రతినిధుల సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను దోచుకుంటూ నాలుగు కోడ్‌లను తీసుకొచ్చిందని, వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఇప్పటికే 24 సమ్మెలు జరిగాయని బాలరాజ్ తెలిపారు. దేశ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడాన్ని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకించాలని, నాలుగు కోడ్లను రద్దు చేయకపోతే రాబోయే రోజుల్లో తీవ్రమైన పోరాటాలు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో నాలుగు కోడ్‌లను అమలు చేయబోమని తక్షణమే తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేసిన విధంగా అంగన్‌వాడీలకు 18,000 రూపాయలు, మధ్యాహ్న భోజన కార్మికులకు 10,000 రూపాయల వేతనం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికులకు 58 ఏళ్ల వయసు దాటిన తర్వాత కూడా లేబర్ కార్డుల సౌకర్యం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, మెడికల్ కాంట్రాక్ట్, సివిల్ సప్లైస్, ఎయిర్ బస్ కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ మాట్లాడుతూ ఎఐటియుసి పోరాటాలకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి గత మూడేళ్ల నివేదికను, జిల్లా కార్యకలాపాల రిపోర్టును సభకు సమర్పించగా, దానిపై ప్రతినిధులు చర్చించారు. ఆటో, భవన నిర్మాణ, మధ్యాహ్న భోజన, అంగన్‌వాడీ కార్మికులు రాబోయే సమ్మెలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సభలో పలు కీలక తీర్మానాలకు ఆమోదం తెలిపిన అనంతరం ఎఐటియుసి నూతన కౌన్సిల్, నూతన కార్యవర్గం, నూతన ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో నాయకులు టి.గోపి, ఎస్‌కె. లతీఫ్, పుండాలిక్, ఎస్.సాయి, చిట్యాల లక్ష్మి, ఫరాన, లక్ష్మి గంచకర్, శివాజీ, ధర్మరాజు, సందేశ్, రమాదేవి, కె.రాణి, భీమేష్, విట్టల్, రాజేందర్, సాంసంగ్, తదితరులు పాల్గొన్నారు.




## ఆసుపత్రి కార్మికులకు తగ్గించిన వేతనాలు ఏరియర్స్‌తో చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులకు గత 18 నెలలుగా తగ్గించిన వేతనాలను ఏరియర్స్‌తో సహా వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రి పడకల సామర్థ్యాన్ని 30 నుంచి 23కు తగ్గించడాన్ని కారణంగా చూపి కార్మికులు వేతనాలను రూ.11వేల నుంచి రూ.7500కు తగ్గించడం అన్యాయమన్నారు. సమస్యల పరిష్కారం కోసం మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ఆసుపత్రి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన జిల్లా ఆరోగ్య సమన్వయ అధికారి డాక్టర్ చైతన్యగౌడ్, కార్మికులు, యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాములు, ఆసుపత్రి కార్మికులు వరలక్ష్మి, లింగమ్మ, అలివేల, పార్వతమ్మ, రేణుక, పొన్నమ్మ, నాగమ్మ, బాలేశ్వరమ్మ, అనిల్, గణేష్, ప్రసాద్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుకు.. రైతులకు ప్రోత్సాహం అందించాలి

### రైతు సంఘం రాష్ట కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్

**ప్రజాపక్షం /వికారాబాద్ :** ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులకు ప్రోత్సాహం అందించాలి రైతు సంఘం రాష్ట కార్యదర్శి పశ్య పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో పశ్య పద్మ మాట్లాడుతూ ఎల్‌నిఒ ప్రభావంతో రాష్ట్రంలోని దాదాపు 63శాతం మండలాలలో లోటు వర్షపాతం నమోదు కావడంతో ఇప్పటికే రైతులు లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, కంది, మినుము, పెసర వంటి పంటలు సాగు చేయగా, ఈ పంటలు చివరిదాకా చేతికి వస్తాయన్న నమ్మకం లేదన్నారు. ఈ నేపథ్యంలో మెట్ట పంటల రైతులకు ఎకరాకు రూ.8వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని, తద్వారా రైతులకు కొంతైనా వెసులుబాటు కలిగి, వారు ప్రత్యామ్నాయంగా మెట్టపంటల ద్వారా ఆహార పదార్థాలను అందించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. వరికి ప్రత్యామ్నాయ మెట్ట పంటలను సాగుచేసే రైతులకు ప్రోత్సహకంగా ఎకరానికి రూ.8వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వరి పండిన పొలాలకు పంటలకు మళ్లించాలంటే అవసరమైన భూసారాన్ని పెంచడానికి రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, మెట్ట పంటలకు అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి అధికారులకు చర్యలు తీసుకోవాలని కోరారు. మెట్ట పంటలన్నిటికి మద్దతు ధరలను గ్యారెంటీగా అమలు కావడానికి మార్కెట్ శక్తులను నియంత్రించాలని, మద్దతు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు దైర్యంగా భవిష్యత్తులో కూడా పంటలమార్పిడి విదానాన్ని అమలు చేయడానికి వీలు గా రాష్ట ప్రభుత్వం రైతు అనుకూల చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, షీర్‌మహమ్మద్, అనంతయ్య, విమలమ్మ, సావిత్రమ్మ, బాబు తదితరులు పాల్గొన్నారు.




## పెట్టుబడిదారులకు అనుకూలంగా కొత్త కార్మిక చట్టాలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ(గుర్రంపోడు):** పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తూ కార్మికుల పొట్ట కొడుతుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం గుర్రంపోడులో ఎఐటియుసి నల్లగొండ జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించే ఎఐటియుసి నల్లగొండ జిల్లా 11వ మహాసభలు ఈనెల 19న గుర్రంపోడులో జరుగుతాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి మండల గౌరవ అధ్యక్షులు రేపాక లక్ష్మీపతి, మండల అధ్యక్షులు ఎస్‌కె అమీర్, ప్రధాన కార్యదర్శి జాల పెద్ద నరసింహ, ఉపాధ్యక్షులు జాల చిన్న నరసింహ, పోలేపల్లి లింగయ్య, పోలేపల్లి లాలయ్య, పగిడిమర్రి లింగయ్య, ఎస్‌కె మమ్మద్, ఎస్‌కె. ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



# క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఎల్ఐజి ఇళ్లు !

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ఇక పట్టణ ప్రాంతాలకూ విస్తరించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) పరిధిలో దశలవారీగా లక్ష ఎల్ఐజి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనున్నట్టు, ఇందుకు పరిపాలన అనుమతులు ఇప్పటికే మంజూరైనట్టు తెలిపారు. మంగళవారం సచివాలయంలో హౌసింగ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20న పథకానికి అధికారికంగా శ్రీకారం చుడతామని, ఆ రోజు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి దరఖాస్తులు, అర్హతలు, టెండర్ల ప్రక్రియ వంటి మార్గదర్శకాలను వెల్లడిస్తామని మంత్రి తెలిపారు. తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికి 500 నుంచి వెయ్యి ఇండ్ల వరకు నిర్మించనున్నట్టు వివరించారు. హైదరాబాద్‌కు దూరంగా ఇళ్లు కట్టిన గత ప్రభుత్వ విధానంతో పేదలు ఉపాధి కోల్పోయే భయంతో ఇబ్బంది పడ్డారని, తమ ప్రభుత్వం మాత్రం వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే విలువైన ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించి యాజమాన్య హక్కులు కల్పిస్తుందన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలో స్థలాలను గుర్తించి హౌసింగ్ శాఖ స్వాధీనం చేసుకుందని, డిజైన్లపై సిఎం రేవంత్ రెడ్డితో చర్చించి రెండు మూడు రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

### ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తాం

ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా సొంతింటి కల సాకారం చేసుకున్న లబ్ధిదారుల ఆనందం ఇప్పుడు సోషల్ మీడియాను హోరెత్తిస్తోంది. ఇల్లు మంజూరైన రోజు నుంచి పునాది వేయడం, నిర్మాణ పనులు, పైకప్పు పూర్తవడం, చివరకు గృహప్రవేశం వరకు ప్రతి దశను వీడియోల రూపంలో చిత్రీకరించి యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికల్లో పోస్ట్ చేస్తున్నారు. ఈ వీడియోలకు వేలాది మంది వీక్షకులు స్పందిస్తూ అభినందనలు తెలుపుతున్నారు. అనేక మంది లబ్ధిదారులు తమ జీవితకాల సొంతింటి కలను నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. గతంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన కల ఇప్పుడు నిజమైందని, తమ కుటుంబాలకు కొత్త జీవితాన్ని అందించిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన రోజు నుంచి గృహప్రవేశం వరకు తమ అనుభవాలను, ఆనందాన్ని వీడియోల రూపంలో పంచుకుంటున్న లబ్ధిదారులను అభినందించారు. వారి చిరునవ్వులు ప్రభుత్వానికి లభించే అత్యంత విలువైన గుర్తింపుగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు. లబ్ధిదారులే స్వయంగా తమ అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకోవడం పథకంపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతోందన్నారు.


## ప్రధాని మోదీకి రక్తపు వేలిముద్రల సంతకాల పోస్టుకార్డులు



నియోజకవర్గాల పునర్విభజన, ప్రత్యేక ముమ్మర సవరణ ('సర్')తో సంబంధం లేకుండా మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్లతో ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకురాలు డాక్టర్ రజని నేతృత్వంలో మహిళలు సంతకాలు, రక్తపు వేలిముద్రలతో కూడిన పోస్టుకార్డులను మంగళవారం కొండాపూర్‌లోని 'సీఆర్ ఫౌండేషన్' నుండి ప్రధాని మోదీకి పోస్టు చేస్తున్న దృశ్యం.

## 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ తెలంగాణకు రావడం గర్వకారణం

కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియాకు రాష్ట్ర మంత్రుల కృతజ్ఞతలు..



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఆతిథ్య రాష్ట్రంగా తెలంగాణను ఎంపిక చేసినందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాకు రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎపి జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలంగాణకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం రాష్ట్ర క్రీడా రంగానికి గొప్ప గుర్తింపుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను దేశంలోనే క్రీడారంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## నిఖత్ జరీన్ మరింత ఎదగాలి:డిజిపి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ బాక్సింగ్ ఛాంపియన్, తెలంగాణ పోలీసు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నిఖత్ జరీన్ సోమవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆనంద్ ఆమెకు అభినందనలు తెలియజేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో ఆమె సాధించిన విజయాలు తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని ప్రశంసించారు. భారత బాక్సింగ్ రంగంలో ఆమె విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో నిఖత్ జరీన్ మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు, దేశానికి, తెలంగాణ పోలీసు శాఖకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు చూపిన క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతోనే భవిష్యత్తులోనూ ముందుకు సాగాలని సూచించారు. తాను కూడా క్రీడాకారుడిగా ఉన్న అనుభవాన్ని పంచుకున్న డీజీపీ, క్రీడల్లో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, అంకితభావం, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం అత్యంత అవసరమని తెలిపారు. లక్ష్యసాధనపై దృష్టి నిలిపి యువతకు ఆదర్శంగా నిలవాలని, పోలీసు అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే అంతర్జాతీయ బాక్సింగ్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిఖత్ జరీన్ మాట్లాడుతూ, తన క్రీడా విజయాలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీసు శాఖ తనను డిఎస్‌పిగా నియమించడం పట్ల హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని పేర్కొన్నారు. డిఎస్‌పిగా నియామకం తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్న నిఖత్ జరీన్, భవిష్యత్తులో భారతదేశానికి మరిన్ని పతకాలు సాధించి, తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ పోలీసు శాఖకు అంతర్జాతీయ స్థాయిలో మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## తాడిచర్ల-2 బ్లాక్ సింగరేణికి గొప్ప వరం

సింగరేణి జిఎం టి.శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి సంస్థకు కొత్త గనుల ఆవశ్యకత అత్యంత తీవ్రంగా ఉన్న దశలో కొత్తగా తాడిచర్ల2 బ్లాక్‌కు మైనింగ్ లీజు అనుమతులు లభించడం సింగరేణికి ఒక వరం లాంటిదని సంస్థ జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన తాడిచర్ల2 బ్లాక్ సాధన విజయోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పాత గనులు మూతబడుతున్న నేపథ్యంలో కొత్త గనులను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవతో గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్‌కు పూర్తి అనుమతులు సాధించి ఉత్పత్తి కూడా ప్రారంభించామని, ఇప్పుడు మైనింగ్ లీజు పొందిన తాడిచెర్ల2 బ్లాక్‌ను కూడా అనతి కాలంలో ప్రారంభించనున్నామని ఆయన తెలిపారు. ఇంకా సింగరేణి ప్రాంతంలో ఉన్న ఇతర బొగ్గు బ్లాక్‌లు కూడా సింగరేణికి వచ్చే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, కొత్త బ్లాక్‌ల రాకతో సింగరేణికి పూర్వ వైభవం రానుందని తెలిపారు. తాడిచర్ల2 బ్లాక్ నుండి ప్రతీ ఏడాది కనీసం 60 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశం ఉందని, ఈ విధంగా 45 ఏళ్ల పాటు ఈ గనిలో ఉత్పత్తి కొనసాగుతుందని తెలిపారు. ఈ గని కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు, అనుమతులు మంజూరు చేసిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలంగాణ పోలీస్ అకాడమీ– ఎఎస్‌సిఐ మధ్య అవగాహన ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) మధ్య మంగళవారం అవగాహన ఒప్పందం కుదిరింది. అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్త్, ఎఎస్‌సిఐ రిజిస్ట్రార్ సెక్రటరీ ఒపి సింగ్ ఒప్పందంపై సంతకాలు చేశారు.ఈ ఒప్పందం ద్వారా నాయకత్వ వికాసం, సామర్థ్య నిర్మాణం, పరిశోధన, ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించడంతో పాటు పోలీసు అధికారులకు ఆధునిక పరిపాలనా నైపుణ్యాలు, ఉత్తమ విధానాలపై శిక్షణ అందించేందుకు ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఈ కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు, ఎఎస్‌సిఐ ప్రతినిధులు పాల్గొన్నారు.



# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

గద్వాల జిల్లాలో రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు

ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్ల నిధులతో ఉప కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల:** నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కు, ఇతర అతిధులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన భాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే లు కృష్ణమోహన్ రెడ్డి, విజేముడు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలో జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక , పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33/ కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగా సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలకులు రాష్ట్రాన్ని దోపిడీ చేశారు.

### ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారు

వడ్డేపల్లి మండలం జులుకల్ స్టేజి దగ్గర మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.8,21,000కోట్ల అప్పులు పెట్టి రాష్ట్రాన్ని అప్పగించిందని, కేవలం రెండున్నర ఏళ్లలోనే రూ.2,08,000 కోట్ల అప్పులకు వడ్డీ, అసలు కట్టాం అన్నారు. ధనిక రాష్ట్రంగా అప్పగిస్తే, గత పాలకులు రాష్ట్రాన్ని దోపిడీ చేశారు తప్ప ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా షాదీముబారక్, కళ్యాణ లక్ష్మీ పథకాలను బంద్ చేయకుండా కొనసాగిస్తున్నం అన్నారు. ప్రతి నెల ఉద్యోగులకు క్రమంతప్పకుండా జీతాలు ఇస్తున్న ప్రభుత్వం అని, రైతులకు పంపు సెట్ల చిత కరెంట్ సొమ్మును ప్రతి నెల ప్రభుత్వమే చెల్లిస్తోందని గృహ వినియోగదారులకు ప్రతి నెల 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, చేయడం జరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణరావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహు లు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు , తదితరులు పాల్గొన్నారు.

## నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం నిర్వహించిన 'రైతు నేస్తంకార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రైతులతో నేరుగా ముచ్చటించారు. ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందని మంత్రి తెలిపారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు అందుకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ రైతులకు సరైన సమాచారం అందించాలని, ఇందుకు వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ విభాగంఅధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు అందించాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని, ఇందుకు శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి రకాల విత్తనాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును మరింత విస్తరించాలని రైతులకు సూచించారు.భారత వాతావరణ విభాగం హైదరాబాద్ సంచాలకురాలు స్టెల్లా మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు.

## 'తెలంగాణ తెలుగు అకాడమీ' డైరెక్టర్‌గా ఆచార్య భట్టు రమేష్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతిష్ఠాత్మకమైన తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులు ఆచార్య భట్టు రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు భాషా పరిరక్షణ, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక భూమిక పోషించే తెలుగు అకాడమీ బాధ్యతలను ఆచార్య భట్టు రమేష్‌కు అప్పగించడం పట్ల పలువురు విద్యావేత్తలు, ఆచార్యులు, పరిశోధకులు ,గిరిజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య భట్టు రమేష్‌కు ఉన్నత విద్యా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా బోధన అనుభవం ఉన్నది. పైగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అత్యుత్తమ సేవలను అందించారు. జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతిగా, గిరిజన అధ్యయన శాఖ అధిపతిగా, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడినిగా కూడా ఆయన పలు కీలక బాధ్యతలను నిర్వర్తించారు.గిరిజన సామాజిక నేపథ్యం నుండి వచ్చిన ఆచార్య రమేష్ జానపద, గిరిజన సంస్కృతుల పరిరక్షణకు విశేష కృషి చేశారు. తన కెరీర్‌లో పలు మేజర్, మైనర్ పరిశోధన ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారు. అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పాల్గొని, పరిశోధన పత్రాలను సమర్పించారు. జానపద గిరిజన విజ్ఞానానికి సంబంధించి 30కి పైగా పరిశోధనా గ్రంథాలకు ఎడిటర్‌గా వ్యవహరించారు. ఏడు పుస్తకాలను సొంతంగా ప్రచురించారు. గిరిజన బాలల కోసం 'బంజారా భారతి', 'బంజారా గణితం' వంటి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. భట్టు రమేష్ పర్యవేక్షణలో పలువురు పరిశోధకులు ఎంఫిల్, పిహెచ్.డి పట్టాలను అందుకున్నారు.కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజ శ్రేయస్సు కోరి వివిధ పబ్లిక్ కమిటీల్లో భాగస్వామ్యం వహించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాలంలో పీపుల్స్ వార్ గ్రూప్, జనశక్తి వంటి పార్టీలతో జరిపిన శాంతి చర్చలలో మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. రాష్ట్ర స్థాయి మద్యపాన నిషేధ సలహా కమిటీ సభ్యుడిగా , గిరిజన భూ రక్షణ చట్టాల పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా సేవలందించారు. వరంగల్ జిల్లాలో గుడుంబా బాధితులైన 200 పైగా గ్రామాల్లోని యువ గిరిజన వితంతువుల సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహించి, వారి పునరావాసం కోసం జిల్లా కలెక్టర్ సహాయంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పని చేసి నివేదికలను సమర్పించి, వారి అభివృద్ధికి కృషి చేశారు. ఆయన విద్యా సేవలను గుర్తిస్తూ 2014లో తెలంగాణ ప్రభుత్వం నుండి 'రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు' లభించింది. అలాగే గిరిజన సాహిత్యం, జానపద కళల రంగంలో ఆయనకు 2017లో 'డా. బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ అవార్డు' వరించింది.

### తెలంగాణ సంస్కృతీ,సంప్రదాయాల పరిరక్షణకు కృషి : భట్టు రమేష్

తెలంగాణ తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా తనకు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఆచార్య భట్టు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు అకాడమీ ద్వారా తెలుగు భాషా వికాసానికి, పాఠ్యపుస్తకాల ప్రచురణకు, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు తన వంతుగా శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.

## 'రెండవ బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశా'లకు సమగ్ర ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో హైదరాబాద్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మకమైన ''రెండవ బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశా''లకు ముందస్తుగానే సమగ్ర ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. ఆగస్టు 4, 5వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ''రెండవ బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశ'' ఏర్పాట్లపైన హైదరాబాద్‌లోని సచివాలయంలో సంజయ్ జాజు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సును విజయవంతం చేసేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయం, ఏర్పాట్లు, భద్రత తదితలర అంశాలపైన చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు భారత ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. '2వ బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్' సమావేశానికి బ్రిక్స్ లోని 11 సభ్య దేశాల నుంచి సుమారు 40 మంది అంతర్జాతీయ ప్రతినిధులు,అదనంగా, భారత ప్రభుత్వానికి చెందిన సుమారు 40 మంది సీనియర్ అధికారులు కూడా హాజరుకానున్నట్టు వారు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డిఒపిటి ) సంయుక్త కార్యదర్శి సుశీల్ కుమార్ పటేల్ సమావేశ నిర్వహణకు సంబంధించిన అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, అత్యవసర వైద్య సేవలు, రవాణ, ప్రొటోకాల్, వసతి, సమావేశ వేదిక నిర్వహణతో పాటు ఇతర లాజిస్టిక్ ఏర్పాట్లలో సహకా రం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సంజయ్ జాజు మా ట్లాడుతూ ఈ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసా ద్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కి షోర్, జిఎడి ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, అదనపు డిజిపి (శాంతి భద్రతలు) మహేష్ భగవత్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, ప్రోటోకాల్ డైరెక్టర్ శివ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి అమలులోకి భారత్–బ్రిటన్ వాణిజ్య ఒప్పందం

**న్యూఢిల్లీ:** భారత్–బ్రిటన్ దేశాలమధ్య కుదిరిన అతిపెద్ద సమగ్ర ఆర్థిక,వాణిజ్య ఒప్పందం (సిఇటిఎ) బుధవారం నుండి అమలులోకి వస్తుంది. భారతదేశం ఇప్పటివరకూ ఆరు దేశాలతో ఇలాంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. బ్రిటన్‌తో ఒప్పందం ప్రకారం భారత్‌కు చెందిన ఎగుమతులలో దాదాపు 99 శాతం ఉత్పత్తులకు సుంకాల నుండి విముక్తి కలుగుతుంది. ఐతే వీటిల్లో రెండు దేశాలకు సంబంధించిన కొన్ని మినహాయింపు నిబంధనలు కూడా అమలులో ఉన్నాయి. తాజా యాపిల్స్,వాల్‌నట్స్ (అక్రోట్), మజ్జిగ,కొన్ని మిశ్రమాలతో కూడిన మజ్జిగ, కొన్ని రకాల వ్యవసాయ విత్తనాలు, బండారు కడ్డీలు,స్మార్ట్‌ఫోన్లపై భారత్ ఎటువంటి రాయతీలు ఇవ్వలేదు. అదేవిధంగా బ్రిటన్ కూడా వివిధ రకాల మాంస ఉత్పత్తులు, గ్రుడ్డుతో చేసిన ఆహార వస్తువులు,మిల్లింగ్ చేసిన బియ్యం,ఘనరూపంలో ఉన్న చెరకు,బీట్ చక్కెర వంటివాటిపై ఎలాంటి మినహాయింపులూ ఇవ్వలేదు. భారత్ ఇప్పటివరకూ బ్రిటన్‌తో సహా మారిషస్,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా,యూరోపియన్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఇఎఫ్‌టిఎ),ఒమన్‌తో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. ఇవన్నీ 2014 నుండి నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత చేసుకున్న సమగ్రవాణిజ్య ఒప్పందాలేనని కేంద్ర ప్రభుత్వ అధికారులు ఈ సందర్భంగా చెప్పారు. భారతదేశం గతంలో ఎన్నడూలేనివిధంగా ఈ ఎఫ్‌టిఎ ఒప్పందంలో బ్రిటన్‌లో తయారైన పూర్తిగా నిర్మించిన కార్లు,లారీలకు గణనీయంగా సుంకాలను తగ్గించింది. వీటిపై సుంకాలను క్రమంగా దశలవారీగా 110 శాతం నుండి 10 శాతానికి భారత్ తగ్గిస్తుంది. అదేవిధంగా 3.78 లక్షల యూనిట్ల సంప్రదాయ ఇంజన్ ప్యాసింజర్ కార్లను భారత్ అనుమతిస్తుంది. బ్రిటన్‌లో తయారైన లారీలకు దిగుమతి సుంకాన్ని కూడా తగ్గిస్తుంది. అదేవిధంగా ఆల్కాహాల్ ఉత్పత్తులపై కూడా గణనీయంగా సుంకాలను భారత్ తగ్గిస్తుంది. కార్మిక శక్తిపై చాలా ఎక్కువగా ఆధారపడి ఉత్పత్తులు జరిగే రంగాలైన వస్త్రాలు,రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు,కార్పెట్స్,శుద్ధి చేసిన ఆహారం, ధాన్యాలు,కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, చేపలు,మాంసం,శుద్ధిచేసిన ఉత్పత్తులన్నీ బ్రిటన్ మార్కెట్‌లోకి భారత్ నుండి ఒక్క పైసా కూడా సుంకాలు లేకుండా ప్రవేశిస్తాయి. అదేవిధంగా ఆటోమొబైల్స్,మోటారుసైకిళ్ళు, వాటి విడిభాగాలు,మెషీనరీ,ఎలక్ట్రానిక్స్,నిర్మాణ అవసరాల నిమిత్తం వివిధ ఆకారాలలో తీర్చిదిద్దిన లోహ వస్తువులు,సిరామిక్స్,మట్టి,పింగాణీలతో చేసిన ఉత్పత్తులు,గ్లాస్,రాతి వస్తువులు, సిమెంటు ఉత్పత్తులు వంటివి కూడా భారత్ నుండి బ్రిటన్ మార్కెట్‌లోకి వెళ్ళినప్పుడు లాభాలు పొందుతాయి. అదేవిధంగా బ్రిటన్ నుండి భారత్‌కు వచ్చే గొర్రెమాంసం,సాల్మన్ చేప మాంసం ఉత్పత్తులు,యంత్రాలు,ఎలక్ట్రానిక్స్, చాక్లేట్స్, సాఫ్ట్ డ్రింక్స్,కాస్మొటిక్స్,సబ్బులు, ఫెర్ఫ్యూమ్‌లు,షేవింగ్ క్రీమ్స్,గోళ్ళ రంగులు వంటివన్నీ భారత మార్కెట్‌లోకి బ్రిటన్ నుండి సుంకాలు లేకుండా వస్తాయి. ఇక బ్రిటన్ నుండి భారతదేశం అతిభారీస్థాయిలో దిగు మతి చేసుకునే వెండిపై రాబోయే పది సంవత్సరాల కాలంలో క్రమంగా సుంకాలను పూర్తిగా తొలగిస్తుంది.

## హరీష్ రావు డైవర్షన్ రాజకీయాలను తెలంగాణ ప్రజలు నమ్మరు : బీర్ల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ మంత్రి హరీష్ రావు డైవర్షన్ రాజకీయాలను తెలంగాణ ప్రజలు నమ్మబోరని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతోందని తెలిపారు. మంగళవారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు.రైతుల కోసం 25 నెలల్లో రూ.1.68 లక్షల కోట్లు ఖర్చు చేశామని, రూ.20 వేల కోట్ల రుణమాఫీ, రూ.36 వేల కోట్ల రైతు భరోసా అందించామని తెలిపారు. సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో పాటు రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు.'మిల్చి మిల్క్' సంస్థతో హరీష్ రావు కుటుంబానికి ఉన్న సంబంధాలు, పెట్టుబడుల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి నిధులను మిల్చి మిల్క్‌లో పెట్టుబడులుగా పెట్టారని, దీనిపై సిబిఐ విచారణకు కేంద్రం స్పందించడం లేదని విమర్శించారు. ఇందుకు హరీష్ రావు బిజెపితో చేసుకున్న రహస్య ఒప్పందాలే కారణమని పేర్కొన్నారు.

## సిఎం సహాయనిధితో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** పేద ప్రజలకు అండగా నిలుస్తూ సిఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించడం అభినందనీయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరి నగర్‌కు చెందిన కావలి బాబు భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా, వైద్య ఖర్చుల నిమిత్తం సిపిఐ ఎమ్మెల్యే, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు చొరవతో సిఎం సహాయనిధి నుంచి రూ.2లక్షలు ఆర్థిక సహాయం మంజూరైం ది. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం సిపిఐ లక్ష్యమన్నారు. గత రెండేళ్లుగా జగద్గిరిగుట్ట డివిజన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అనేక మంది పేదలకు సిఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ఈ సహాయంతో లబ్ధి పొందిన ప్రజలు పార్టీ పట్ల విశ్వాసం వ్యక్తం చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాడుతుందని, ప్రజలు కూడా సామాజిక సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి రాములు, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం కార్యదర్శి వెంకటేష్, శాఖ నాయకులు చంద్రయ్య, కరుణాకర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని ఖుషీ గార్డెన్స్‌లో 11.70 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పా రామారావు, మాజీ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అన్ని డివిజన్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి,శోభారాణి, కార్తీక్‌గౌడ్, నర్సింహరెడ్డి, ప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## దుండిగల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై దురుసు ప్రవర్తన

### కెబిఆర్ రెస్టారెంట్ నిర్వాహకులపై కేసు నమోదు

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల విధులకు ఆటంకాలు కలుగజేసిన బహుదూర్‌పల్లి లోని కెబిఆర్ రెస్టారెంట్ నిర్వాహకులపై దుండిగల్ డిప్యూటి కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దుండిగల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఎసిబి శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం జూలై 10న రోడ్ల అక్రమణాలపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఇబ్బందికరంగా ఉన్న అక్రమాలను తొలగిస్తున్నామని, అందులో భాగంగా బాదురుపల్లిలో గల కెబిఆర్ రెస్టారెంట్ నిర్వాహకులు ప్రధాన రోడ్డును ఆనుకొని అక్రమణలకు గురిచేయడం రోడ్డు అక్రమాలు తొలగించే నేపథ్యంలో రెస్టారెంట్ యాజమాన్యం తమ విధులకు అడ్డుకోవడమే కాకుండా తమ తోటి ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. ఇకపై ఎవరైనా అక్రమాలకు పాల్పడి తమ విధులను అడ్డపడితే కఠిన చర్యలు తప్పవని సర్కిల్ అధికారులు తెలిపారు.



## రహస్య కమిటీపై హిల్స్ వ్యూ కాలనీవాసుల తిరుగుబాటు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** హిల్స్ వ్యూ కాలనీ కమిటీ ఏర్పాటుపై తీవ్ర వివాదం నెలకొంది. కాలనీవాసులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తగిన సభ్యుల హాజరు లేకుండానే కొందరు ఏకపక్షంగా కమిటీని ఏర్పాటు చేశారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా పారదర్శకంగా రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలోని ముత్వెల్లిగూడ హిల్స్ వ్యూ కాలనీలో ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీపై కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కమిటీ ఏర్పాటుకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని తగిన సభ్యులు సమక్షంలో సమావేశం నిర్వహించలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ప్రకటించిన కమిటీని రద్దుచేసి అందరి సమక్షంలో కొత్త కమిటీని ఎన్నుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని హిల్స్ వ్యూ కాలనీ నివాసితులు డిమాండ్ చేస్తున్నారు.

## జలమండలి కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యమిస్తాం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ఐడిపిఎల్ చౌరస్తాలోని జలమండలి కార్యాలయాన్ని తరలిస్తే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం టిఆర్ఎస్ నేత ఎత్తరి మారయ్య హెచ్చరించారు. కుత్బుల్లాపూర్‌లో తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ఐడిపిఎల్ చౌరస్తాలో గల జలమండలి కార్యాలయాన్ని మియాపూర్ ప్రాంతాని కి మార్చాలని చూస్తున్నారని, ఆ కారణంగా అనేక బస్తీలు, కాలనీలు తాగునీటికోసం ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఐడిపిఎల్ చౌరస్తాలోని జలమండలి కార్యాలయంపై వందల బస్తీలు, కాలనీలు ఆధారపడి ఉన్నాయని, ఈ కార్యాలయాన్ని తరలిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నేతలు పడాల మనోజ గౌడ్, శీలం వీరేందర్ కుమార్, దామర్తి సీతారామ్ పాల్గొన్నారు.




## అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి కాకతీయనగర్ డివిజన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నేత చింతమల్ల కపిలేశ్వర్ రూ.25 వేలు ఆర్థిక సాయంగా అందించారు. స్థానిక పార్టీ నేత చింతమల్ల కపిలేశ్వర్ డివిజన్ అధ్యక్షుడు యూసూఫ్, బాలరాజు, ధరన్‌సాయి, నరేష్‌లతో కల్సి మంగళవారం బాధిత నివాసానికి వెళ్లి సాయం అందించారు.

# రూ.25కోట్ల విలువైన స్థలాలు రక్షించిన హైడ్రా

### బోడుప్పల్ జయప్రద కాలనీలో 4400 గజాల ల్యాండు చుట్టూ ఫెన్సింగ్



**ప్రజాపక్షం/హైదరాబాద్/బోడుప్పల్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. చెంగిచెర్ల విలేజ్‌లోని జయప్రద కాలనీలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన దాదాపు రూ.25 కోట్ల విలువైన 4400 గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల బారి నుంచి కాపాడింది. ప్రజావాణి ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం జయప్రద కాలనీలో పార్కు కోసం 1200గజాలు, షాపింగ్ కాంప్లెక్స్ నిమిత్తం 1200 గజాలు, దేవాలయాలకు 400 గజాలు, పాఠశాల గ్రంథాలయానికి 800గజాలు, వాటర్ ట్యాంక్‌కోసం మరో 800 గజాల స్థలాన్ని లేఅవుట్‌లో కేటాయించారు. అయితే, షాపింగ్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు రియల్టర్లు నివాస స్థలాలుగా మార్చేసి, ఇప్పటికే రెండు ఇళ్లను కూడా నిర్మించారు. వరుస ఆక్రమణలపై ఆందోళన చెందిన కాలనీవాసులు 'హైడ్రా ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు బాధితుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆక్రమణలను నిర్ధారించారు.అనంతరం రంగంలోకి దిగి ప్రజా అవసరాల స్థలాల చుట్టూ ఫెన్సింగ్ వేసి, ఇవి హైడ్రా ఆధీనంలో ఉన్నాయంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడటంపై కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

**రామంతాపూర్ పెద్దచెరువులో కూల్చివేతలు**

**2180గజాల మేర ఆక్రమణలు తొలగించిన హైడ్రా**

ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్దచెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోని ఆక్రమణలపై హైడ్రా మంగళవారం చర్యలు చేపట్టింది. చెరువు విస్తీర్ణాన్ని కాపాడే క్రమంలో భాగంగా 2180 గజాల పరిధిలో ఉన్న అక్రమ కట్టడాలను భారీ క్రేన్‌లతో కూల్చివేసింది. రూ.19 కోట్లతో చెరువు సుందరీకరణ పెద్దచెరువు మొత్తం 30 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉండగా, ఇందులో దాదాపు 16 ఎకరాల మేర కబ్జాకు గురైంది. 12 ఎకరాల్లో ఇప్పటికే శాశ్వత భవనాలు నిర్మించగా, మిగిలిన 4 ఎకరాల పరిధిలోని తాత్కాలిక షెడ్లు, గుడిసెలను తొలగించారు. ఇందులో భాగంగా నిర్మిస్తున్న ఒక జీ ప్లస్ 2 వాణిజ్య భవనానికి చెందిన 1900 గజాలు, 280 గజాల ఆటో గ్యారేజీని అధికారులు నేలమట్టం చేశారు. దీంతో రూ.19 కోట్లతో చేపట్టనున్న చెరువు అభివృద్ధి పనులకు, ఎఫ్‌టిఎల్ విస్తరణకు మార్గం సుగమమైంది. పేదలకు అండగా ప్రభుత్వం ప్రతి ఏటా వర్షాకాలంలో చెరువు నీరు చేరి ఇబ్బందులు పడుతున్న ఇక్కడి చెత్త సేకరించే కూలీలు, పేద కుటుంబాల పరిస్థితిని హైడ్రా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. మానవీయ కోణంలో స్పందించిన ప్రభుత్వం, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేసేందుకు సానుకూలంగా స్పందించి, ప్రాధాన్యత క్రమంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టింది.

## ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు ఒకటిన మహాధర్నా



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** పిఆర్సీ ప్రకటించి డిఎ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించటంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంతంలో ధర్నా నిర్వహించిన అనంతరం జిల్లా ప్రత్యేక అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, రాష్ట్ర బాధ్యులు గోపాల్, జిల్లా అధ్యక్షులు మోడిగారి శ్రీధర్‌లు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యా య సమస్యల పరిష్కారం, పిఆర్‌సి అమలు, 6 డిఏలు, పెండింగ్ బిల్స్ పూర్తిగా చెల్లించాలన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆగస్టు ఒకటిన రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నా చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని, మొదటి వారంలోనే గ్రాంట్స్ విడుదల చేయాలని, ఉపాధ్యాయుల వార్షిక పదోన్నతులకు సంబంధించి క్యాలెండర్ ప్రకటించాలన్నారు. సంఘానికి చెందిన వెంకట రమణ, రామారావు, రమేష్, లక్ష్మ ణ్, మహేందర్, తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

## 16న తాండూరులో మంత్రుల పర్యటన

### రూ.290కోట్ల నిధుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/తాండూరు:** వికారాబాద్ జిల్లా తాండూరులో ఈ నెల 16న రాష్ట్ర మంత్రులు పర్యటించనున్నారని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. అందుకుగాను తగు ఏర్పాట్లును పూర్తి చేసినట్లు తెలిపారు. తాండూరులో రూ.290కోట్ల నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు మంత్రులు శంఖుస్థాప న చేస్తారని తెలిపారు. అనంతరం జిపిఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. తాండూరు పర్యటనకు రాష్ట్ర రోడ్డు రవాణశాఖ మంత్రి కోమట్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి శ్రీధర్ బాబులు హాజరవుతారని తెలిపారు. జిపిఆర్ గార్డెన్‌లో నిర్వహించే బైపాస్ రోడ్డులో భూ నిర్వాసితులకు చెక్‌ల పంపిణీ చేపడుతారని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతంచేయాలని కోరారు.

## ఎన్ఎస్ఎస్ బలోపేతానికి అనురాగ్ వర్సిటీ కీలక భేటీ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** యువతలో సేవా స్ఫూర్తిని పెంపొందించి జాతీయ సేవా పథకాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా అనురాగ్ విశ్వవిద్యాలయం కీలక ముందడుగు వేసింది. విశ్వవిద్యాలయం సామాజిక అభ్యాస విభాగం అసోసియేట్ డైరెక్టర్ ఎన్ఎస్ఎస్ సెల్ కార్యక్రమాల సమన్వయకర్త డాక్టర్ మల్లేష్ హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ సంచాలక కార్యాలయంలో నూతన ప్రాంతీయ సంచాలకుడు సైదా రామావత్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, మొక్క, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం విద్యార్థుల్లో సామాజిక సేవా భావన , పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత పెంపు భవిష్యత్తులో సంయుక్తంగా మరిన్ని సేవా కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు.అనురాగ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను సైదా రామావత్ అభినందిస్తూ పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



## ప్రతిభ కనపరచిన పోలీసులకు అవార్డులు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** లోక్‌అదాలత్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన కుషాయిగూడ పోలీసు సిబ్బందికి అవార్డులు దక్కాయి. ఉప్పల్ డిసిపి సురేష్ మంగళవారం ఈ అవార్డులను అందచేసారు. కుషాయిగూడ ఏఎస్ఐ నర్సింగరావు, కానిస్టేబుళ్లు సంతోష్‌రెడ్డి (పిసి 4970), అశోక్ (పిసి10271) అందుకొన్న వారిలో ఉన్నా రు. దీంతోపాటు ఇటీవల చోరీ అయిన 14 బైకులను స్వాధీ నం చేసుకొన్న విషయం లో ప్రతిభ కనపరచిన డిటెక్టివ్ ఇనస్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సై విజయ్, హెచ్‌సి యాదగిరి (పిసి532), ఎస్. శ్రీనివాస్ (పిసి 5640), దినేష్ (పిసి 9608), సిహెచ్ మహే ష్ (పిసి9665), సౌమ్య మహిళా కానిస్టేబుల్ (పిసి 10864) లకు సైతం ఈ సందర్భంగా అవార్డులను డిసిపి అందచేసారు.

## పోలీసులకు వైద్య పరీక్షలు అవసరం



**ప్రజాపక్షం/ఉప్పల్:** రేయింబవళ్లు విధి నిర్వహణలో సతమతమయ్యే పోలీసు ఉద్యోగులు తప్పనిసరిగా క్రమం తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాలు పాటించాలని ఉప్పల్ ట్రాఫిక్ ఎసిపి సంపత్ కుమార్ సూచించా రు. ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది బిపి, డయాబెటిస్, ఈసిజి, దంత పరీక్షలు జరిపించుకొన్నారు. ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ నాగరాజు, ఆర్ఐ గోవర్ధన్, ఎస్సైలు ఈ శిబిరంలో పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తులు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ విద్యా సంవత్సర జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికిగాను ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిణి రేణుకాదేవి కోరారు. తమ ధరాఖాస్తు ఫారాలు national awardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## 38 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం స్వాధీనం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న సబ్సిడీ బియ్యం (పిడిఎస్) అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల్లో మల్కాజిగిరి పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుండి 38 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం, ఒక అశోక్ లీ ల్యాండ్ గూడ్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఎస్ఐ శంకర్‌కు అందిన విశ్వసనీయ సమాచారంతో మంగళవారం మౌలాలి ఆర్టీసీ కాలనీలోని సంపూర్ణ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా తరలించేందుకు యత్నిస్తుండగా దాడిచేసి నిందితుల్లో ఎండి ఆదిల్‌ను అదుపులోకి తీసుకొన్నారు. మరో నిందితుడిని ఎస్‌కె ఇఫ్రాస్ అలియాస్ బబ్బుగా గుర్తించి అతడి కోసం గాలిస్తున్నారు. నిత్యావసర వస్తువుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తీసుకొంటామని పోలీసులు హెచ్చరించారు.

## ప్రభుత్వ మోస పూరిత హామీలపై సమర శంఖం పూరించాలి

### బిఆర్ఎస్ ఎల్పి విప్, కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, మోసపూరిత హామీలపై సమర శంఖం పూరించాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద, ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు శంబీపూర్ రాజులు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 18న సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సు కార్యాచరణపై పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద, రాష్ట్ర బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు శంబీపూర్ రాజులు విచ్చేసి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు ఆ హామీని అమలు చేయకుండా నిరుద్యోగ యువత ఆశలను వమ్ము చేసిందని విమర్శించారు. గత రెండున్నరేళ్లుగా ఉద్యోగులు, రైతులు, మహిళలు, బడుగు, బలహీన వర్గాలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగులు, ఆటో కార్మికులు, విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ హామీల పై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వారిపై ఒత్తిడి తీసుకువచ్చి కేసుల బెదిరింపులతో భయపెట్టే ధోరణి ప్రభుత్వం అవలంబిస్తోందని అన్నారు.

ఈ నెల 18వ తేదీన సరూర్ నగర్ స్టేడియంలో జరిగే యువ సంగ్రామ సదస్సుకి రాష్ట్ర నలుమూలల నుండి యువకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



## ప్రజాస్వామ్య ఉద్యమాలను అణచి వేసేందుకు అక్రమ అరెస్టులా?

**ప్రజాపక్షంబ/ఉప్పల్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేసారు. ప్రజాస్వామ్య ఉద్యమాలను అణచి వేసేందుకు పోలీసులు హౌజ్ అరెస్టులు చేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం నాచారం పోలీసులు ఉదయాన్నే ఇంటినుండి బయటకు వెళ్లకుండా తనతో పాటు అనేక మందిని అక్రమంగా హౌజ్ అరెస్ట్ చేయించటం ప్రభుత్వం పోలీసు వ్యవస్థను దుర్వినియోగపరచటమేనన్నారు. ప్రభుత్వం రీఇంబర్స్‌మెంట్ బకాయిలుగా పేరుకుపోయిన రూ.10వేల కోట్లను విడుదల చేయకపోవటం వల్ల ప్రయివేట్ కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి తేవటమే కాకుండా కోర్సులు పూర్తయిన వారికి ధృవపత్రాలు ఇవ్వటం లేదని, ఫలితంగా ఉన్నత విద్య, ఉద్యోగాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు.



## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ బాధ్యత బిఎల్‌ఒలదే

### జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బిఎల్‌ఒలు కొనసాగిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పూర్తి చేసిన ఫారాల స్వీకరణ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఉప్పల్ నియోజకవర్గంలోని 375, 376 పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఎన్యూమరేషన్ సెంటర్లలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఉప్పల్ తహసీల్దార్ పూల్‌సింగ్‌తో కల్సి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు పంపిణీ చేయటంతో పాటు వాటిని సక్రమంగా పూరించి తీసుకోవటంలో బిఎల్‌ఓలే పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఫారాలు పూరించటంలో ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ సహకరించాలన్నారు. దీంతోపాటు స్వీకరించిన ఫారాల్లో నమోదైన వివరాలను వెంటవెంటనే ఆపరేటర్ల ద్వారా డిజిటలైజేషన్ సైతం బిఎల్‌ఒలే రోజు చేయించాలన్నారు. బిఎల్‌ఒలు వారికిచ్చిన టార్గెట్‌లను ఏ విధంగా పూర్తి చేయాలన్న విషయంలో అదనపు కలెక్టర్ దిశానిర్దేశం చేసారు.




## బిఎల్‌ఒలకు ఫారాలను అందజేయాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్‌ఒలకు తప్పనిసరిగా అందజేయాలని చర్లపల్లి కంటెస్టెంట్ కార్పొరేటర్, టిడిపి సీనియర్ రాష్ట్ర నాయకులు రుద్రగోని రాంచందర్ గౌడ్ అన్నారు. మంగళవారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నింపిన రెన్యూమరేషన్ ఫారాలని బిఎల్‌ఒ రాజు, శ్రీలతలకు ఆయన అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కడియాల అనిల్, చికెన్ శ్రీనివాస్, కిరణ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌ఎంపి డాక్టర్లకు అండగా ఉంటాం

**ప్రజాపక్షం /పరిగి :** ఆర్‌ఎంపీ డాక్టర్లకు అండగా అంటాం అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి పట్టణంలోని బృందావనం గార్డెన్ లో వికారాబాద్ జిల్లా ఆర్‌ఎంపి యూనియన్‌జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.నరేందర్‌ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ వార్షికోత్సవ మహసభకు ఎమ్మెల్యే హాజిరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర సేవలందిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యుల సేవలు అభినందనీయమని అన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా తన వంతు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోయూనియన్ నాయకులు ,వైద్యులు ,ప్రజా ప్రతినిదులు ,స్థానిక నాయకులు పాల్గోన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**ప్రజాపక్షం/మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లిమండల పరిధిలోని సిరిపురంగ్రామం లో పాఠశాల మరుగుదోడ్లు,ప్రహరీగోడ నిర్మాణ పనులను గ్రామంలో ని నూతనంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీడీఓ శాంత, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు ఇచ్చిన గడువులోపు ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణ పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

## రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి

### మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పుట్టం పురుషోత్తమ్‌రావు

**ప్రజాపక్షం/తాండూరు:** మున్నూరు కాపులు సంఘటితమై సమాజంలోని ఇతర కులాలను కలుపుకొని బహుజన రాజ్యాధికారం వైపు అడుగులు వేయాల ని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం తాండూరు పట్టణంలోని తులసి గార్డన్‌లో మున్నూర్ కాపు సంఘం పట్టణ అధ్యక్షులు పట్లోళ బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ నర్సిములు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా మున్నూరు కాపు సంఘం ముఖ్యనాయకుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ ముఖ్యఅథితిగా హజరైనారు. రాష్ట్ర అధ్యక్షులుగా మొదటి సారిగా తాండూరుకు వచ్చేసిన పుట్టం పురుషోత్తమరావు పటేల్‌ను గజ మాలతో ఘనంగా సత్కరించారు.

12

ప్రజాపక్షం
Telugu National Daily

మహబూబ్‌నగర్
బుధవారం
15-07-2026
www.prajapaksham.in


ఫహద్ ఫాజిల్ హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్స్‌పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్.కార్తికేయ నిర్మించిన చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ యేలేటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

రీల్



# 'రా ఎన్‌టిఆర్'తో సంబంధం లేదు

జూనియర్ ఎన్‌టిఆర్ ప్రకటన

'రా ఎన్‌టిఆర్' పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థకు, సదరు వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని జూనియర్ ఎన్‌టిఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ రాజకీయ పార్టీ పెడుతున్నారని వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. ఈ మేరకు ఒక ప్రకనట జారీ చేశారు. 'రా ఎన్‌టిఆర్ అనే సంస్థతో , ఆ సంస్థ చేసే కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం, అనుబంధం, ఎన్‌టిఆర్ నుంచి అనుమతి కూడా లేదని ప్రకటనలో స్పష్టం చేశారు. ఆ సంస్థకు గాని, ఆ వ్యక్తికి గాని ఎన్‌టిఆర్ తరపున ప్రాతినిధ్యం వహించే హక్కు లేదని పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు చెయ్యడానికి , ఎన్‌టిఆర్ పేరును వాడుకోడానికి ఎలాంటి అధికారము అతనికి ఇవ్వలేదని అన్నారు. ఎన్‌టిఆర్‌కు సంబధించిన ఏ అంశం అయినా అధికారికంగానే తెలియజేస్తామని చెప్పారు. ఇలాంటి గుర్తు తెలియని వ్యక్తులు ప్రకటనలు చేస్తే నమ్మొద్దని అన్నారు. ఇలాంటి పుకార్లు వచ్చినపుడు దయచేసి మీడియా ఎన్టీఆర్ కు సంబధించిన అధికారిక వ్యక్తులను సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

# ఆడబిడ్డ కన్నీటి కథే 'వెంకట్రామయ్య గారి తాలూకా'

'ప్రీ రిలీజ్ ఈవెంట్'లో నిర్మాత కోమలి



ప్రముఖ జానపద గాయని కోమలి నిర్మాతగా మారుతూ నిర్మించిన కుటుంబ కథా చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ధినేష్ కుమార్ హీరోగా, ఈ టీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఫోక్ సింగర్ కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారని ప్రశంసించారు. సినిమా ఘనవిజయ ం సాధించాలని ఆకాంక్షిస్తూ, చిన్న సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించాలని సూచించారు. తెలంగాణలో చిన్న సినిమాల అభివృద్ధికి తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలుగు సినిమా మాదిరిగానే తెలుగు ప్రజలు కూడా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రధాన పాత్రధారి మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ తన సినీ జీవితంలో ఎంతో కాలంగా చేయాలనుకున్న పాత్ర ఈ చిత్రంలో లభించిందని చెప్పారు. 'డిజె టిల్లు' తర్వాత తనకు అత్యంత సంతృప్తినిచ్చిన పాత్ర ఇదేనని చెప్పారు. వెంకట్రామయ్య పాత్రలో నటిస్తున్నప్పుడు గ్లిజరిన్ అవసరం లేకుండానే భావోద్వేగంతో కన్నీళ్లు వచ్చాయని తెలిపారు. ఈ సినిమా ప్రతి ఒక్కరి గుండెను తాకుతుందని, మానవ సంబంధాల విలువను గుర్తు చేస్తుందని అన్నారు. నిర్మాత కోమలి మహేందర్ మాట్లాడుతూ ఇది తన నిజ జీవిత అనుభవం ఆధారంగా రూపొందించిన చిత్రమని తెలిపారు. ఇది ఒక ఆడబిడ్డ కన్నీటి కథ. నా జీవితంలో ఎదురైన అనుభవాలను ఈ చిత్రంగా మలిచాను. 17న ప్రతి ఒక్కరూ థియేటర్లకు వచ్చి మా సినిమాను చూసి ఆశీర్వదించాలి అని కోరారు. సీనియర్ నటి సుధ , సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడారు. దర్శకుడు సతీష్ ఆవాల, హీరో దినేష్ కుమార్ ,హీరోయిన్ దివిజ ప్రభాకర్ , నటి జబర్దస్త్ సత్యశ్రీ పాల్గొన్నారు.

హీరోయిన్ నభా నటేష్ తెలుగు తెరపై సక్సెస్ కోసం తెగ ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల విడుదలైన నాగబంధంపై భారీగా ఆశలు పెట్టుకున్న నభా నటేష్‌కు నిరాశే ఎదురైంది. కాకపోతే మంచి నటిగా పేరు వచ్చింది. టాలీవుడ్‌లో కేవలం పేరుతోనే సరిపెట్టుకుంటే కుదరదు. స్టార్‌డం రావాలంటే ఖచ్చితంగా ఒక మంచి కమర్షియల్ సక్సెస్ కెరీర్‌లో వుండలేనిసింది. 'నాగబంధం' సినిమాలో పార్వతి అనే పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో నభా నటేష్ నటన ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. ఒకే పాత్రలో అనేక వైవిధ్యమైన భావోద్వేగాలను పలికించడం ద్వారా నటిగా తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకుంది. దయ, పట్టుదల, ధిక్కారం, బలహీనత, భక్తి..ఇలా అనేక ఎమోషన్స్‌ను తన నటనలో పలికించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. తారలకు ఇలాంటి అవకాశం రావడం అరుదు. ఆ అవకాశాన్ని తన టాలెంట్, డెడికేషన్‌తో సద్వినియోగం చేసుకుంది నభా. నాలుగు భిన్నమైన కోణాల్లో ఒకే పాత్రను పోషించి సర్ ప్రైజ్ చేసింది నభా నటేష్. అందమే కాదు ప్రతి ఎక్స్ ప్రెషన్‌లో స్టోరీని ఆవిష్కరించింది. నటిగా తనకున్న ప్రతిభను మరోసారి ప్రూవ్ చేసుకుంటూ...ప్రేక్షకులను మైమరపించే నటనను కనబర్చింది. భారీ పాన్ ఇండియా మూవీగా దర్శకుడు అభిషేక్ నామా 'నాగబంధం' చిత్రాన్ని రూపొందించారు. కిషోర్ అన్నపరెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మించారు. విరాట్ కర్ణ హీరోగా నటించారు. 'నాగబంధం' సినిమా ప్రస్తుతం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.



## యాక్టింగ్ పరంగా సంతృప్తిగా ఉంది

నభా నటేష్

ఈ సినిమా నభా నటేష్ కెరీర్ లో ఓ స్పెషల్ మూవీగా మిగిలిపోతుందని నభ నటేష్ అంటోంది. ప్రస్తుతం తన యాక్టింగ్ తో సంతృప్తిగానే ఉన్నానని నభ నటేష్ చెప్పింది.



# రాజమౌళి సమర్పణలో 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'

ఫహద్ ఫాజిల్ హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్స్‌పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్.కార్తికేయ నిర్మించిన చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ యేలేటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీని సెప్టెంబర్ 11న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎస్.ఎస్ కార్తికేయ మాట్లాడుతూ 'ఫహద్ ఫాజిల్ తో సినిమా నిర్మిస్తుండటం ఆనందంగా ఉంది. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' మనసుకు హత్తుకునే చిత్రం. ఇకపై నుంచి రాబోయే కంటెంట్‌ని చూస్తే ఆ విషయం మీకే అర్థం అవుతుంది. 'వారణాసి' ప్రారంభం కంటే ముందే ఈ చిత్రం పూర్తి అవ్వాల్సింది. కానీ కొన్ని కారణాల వల్ల ఈ మూవీని ఆలస్యంగా స్టార్ట్ చేశాం. ఫహద్ నా భార్య తరుపు బంధువు. నాకు ముందు నుంచీ ఫహద్ గారంటే ఇష్టం. ఓసారి 'పుష్ప' చిత్రీకరణ సమయంలో ఆయన్ని కలిశాం. ఆ టైంలోనే మేం కొన్ని స్క్రిప్ట్‌లు రెడీ చేస్తున్నాం. 'ఆక్సిజన్' అనే స్క్రిప్ట్ ఆయన కోసమే రెడీ చేశాం. కొంత స్క్రిప్ట్ కూడా ఉండగా ఈ కథ చెప్పాం. ఆయనకు చెప్పిన ఫస్ట్ వెర్షన్‌లోనే 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'ని ఓకే చేశారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి జానర్‌లో సినిమా రాలేదు. ఈ చిత్రంలో చాలా విఎఫ్ఎక్స్ వర్క్ ఉంది. రాజమౌళి స్టాంప్ వద్ద తర్వాతే స్క్రిప్ట్ లాక్ అయింది. మూవీ అంతా పూర్తయ్యాక రాజమౌళి ఆయనకు చూపించి సలహాలు తీసుకుంటాం అని అన్నారు.నిర్మాత శోభు యార్లగడ్డ మాట్లాడుతూ దక్షిణాది భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేస్తున్నాం. ఇప్పటికి అయితే ప్యాన్ ఇండియా అని ప్లాన్ చేయలేదు. రిలీజ్ టైం వరకు ఏం జరుగుతుందో చెప్పలేం అని అన్నారు.దర్శకుడు శశాంక్ యేలేటి, సంగీత దర్శకుడు కాల భైరవ, చైల్డ్ ఆర్టిస్ట్ సారా పాల్గొన్నారు.

# '1=100' సినిమా టీజర్ రిలీజ్



శకుంతల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బాబా మైలవరం దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం '1=100' టీజర్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ నిర్మాత రిజ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. వెస్ట్రన్ స్టైల్ విజువల్స్, యాక్షన్ ఎలిమెంట్స్, అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో కూడిన ఈ టీజర్ ప్రేక్షకులను, సినీ ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. అనిల్ కుమార్ వేగూరు సినిమాటోగ్రఫీ, కెన్నీ చైతన్య సంగీతం, నందమూరి హరి ఎడిటింగ్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయి. రాజు ఎంటర్‌టైనర్స్, స్పార్కిల్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఇప్పటికే టీజర్‌కు వస్తున్న భారీ రెస్పాన్స్ తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందని, త్వరలోనే సినిమా మరిన్ని వివరాలను వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కొరియోగ్రఫీ: సూర్యాస్ మాస్టర్ జోజో, ఫైట్స్: కృష్ణ ఎస్.ఎం. రాజు, డైమండ్ వెంకట్, ఆర్ట్ డైరెక్టర్: నానాజీ.

# 'మనసా మనసా' పాట విడుదల



కమిటీ కుర్రోళ్లు మూవీ ఫేమ్ త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, సిద్ధార్థ్ రాయ్ సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న సినిమా 'అదే నీవు అదే నేను'. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్ పై గోవిందు కాంగ్రేగుల నిర్మిస్తున్నారు. రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో దర్శకుడు కొండల్ రూపొందిస్తున్నారు. 'అదే నీవు అదే నేను' సినిమా త్వరలో థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'మనసా మనసా' సాంగ్‌ను స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్ లాంచ్ చేశారు. ఈ చిత్రంలోని పాటలు నచ్చి ఆదిత్య మ్యూజిక్ ఆడియో రిలీజ్ చేసేందుకు ముందుకొచ్చింది. తమ మూవీలోని సాంగ్ లాంచ్ చేసి తమకు సపోర్ట్ చేస్తున్న వినాయక్‌కి ప్రొడ్యూసర్ గోవిందు కాంగ్రేగుల, డైరెక్టర్ కొండల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ కొండల్ ఫస్ట్ టైమ్ డైరెక్ట్ చేస్తూ అదే నీవు అదే నేను సినిమా రూపొందిస్తున్నారు. ఈ మూవీ ఆయనకు మంచి పేరు తీసుకురావాలి. గోవింద్ రికి నిర్మాతగా తొలి చిత్రమిది. ప్రొడ్యూసర్‌గా గోవింద్ ఈ సినిమా విజయాన్ని అందుకుని, మరిన్ని మూవీస్ చేయాలి. మనసా మనసా సాంగ్ చాలా బాగుంది. ఈ సినిమా సూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నా అన్నారు. 'మనసా మనసా' పాట ఎలా ఉందో చూస్తే ఎన్నెన్నె ఎన్నెన్నె వర్ణాలు ఉన్నా, నువు లేని వెలితేదో మిగిలున్నదే, ఇన్నాళ్లకైనా నిన్ను చూశాను అన్న ఆనందం నా సొంతమే. ఈ పాటకు పూర్ణాచారి లిరిక్స్ రాయగా, మ్యూజిక్ డైరెక్టర్ కనిష్క మంచి ట్యూన్‌తో కంపోజ్ చేశారు. టాప్ సింగర్ జావెద్ అలీ అద్భుతంగా పాడారు. త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, తన్వి నేగి, సహర్ కృష్ణన్, కల్పలత, సునయన, బిత్తిరి సత్తి, మీర్, సూర్యతేజ, నరేందర్, రమణ భార్గవ్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ నార్ని శ్రీనివాస్,పాటలు పూర్ణాచారి, మాటలు వై.అమ్మిరాజు, డిఒపి నిమ్మల జయపాల్ రెడ్డి, ఎడిటర్ ఛోటా కె ప్రసాద్, సంగీతం కనిష్క.

# వెంటనే ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

బిఎల్‌ఓలకు అందించి ఓటుహక్కు కాపాడుకోవాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును కాపాడుకునేందుకు వెంటనే ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి, బూత్ లెవెల్ అధికారులకు (బిఎల్‌ఓ)లకు అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ) సి.సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రాఫ్ట్ (ముసాయిదా) ఓటర్ల జాబితాలో పేరు నమోదు కావాలంటే ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాన్ని ఖచ్చితంగా బిఎల్‌ఓలకు అందజేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. బిఎల్‌ఓలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా వివరాలు రాయాలని, వాటిపై పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను తప్పనిసరిగా అతికించాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారంలో ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్‌ఓ సంతకం కూడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకదానిని పూరించి, బిఎల్‌ఓకు ఇవ్వాలన్నారు. రెండవ ఫారాన్ని ఓటరు భవిష్యత్తు అవసరాల కోసం తమ వద్దే భద్రపరుచుకోవాలన్నారు. ఒకవేళ 2002 ఓటరు జాబితాలో మీ ఓటరు వివరాలు ఉన్నట్లయితే, వాటిని తప్పనిసరిగా ఫారంలో పేర్కొనాలని, ఆ వివరాలు లేకపోయినా ప్రస్తుత వివరాలతో ఫారాలను నింపి అందజేయవచ్చు అని తెలిపారు. రాష్ట్రంలో గత గత 25వ తేదీన ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. మరో పది రోజుల్లోనే ఈ గడువు ముగియనుందని, కాబట్టి ఓటర్లు ఆలస్యం చేయకుండా ఈరోజే తమ ఫారాలను సమర్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటి వరకు కేవలం 1,66,70,610 మంది (49.28 శాతం) మాత్రమే తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించారని సిఇఓ వెల్లడించారు. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తక్షణమే స్పందించి బిఎల్‌ఓలకు సహకరించాలని సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# అయోధ్య అవినీతిపై సిబిఐ విచారణ జరపాలి

వి. హనుమంతరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంగారం, విరాళాల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సిబిఐతో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయోధ్య అవినీతిపై సిబిఐ విచారణ కోరుతూ ఈ నెల 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తాను మౌన దీక్ష చేపట్టనున్నానని ఎఐసిసి అగ్రనేతలు సహా అందరూ పాల్గొని మద్దతు ఇవ్వాలని కోరారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అయోధ్యలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నా చిన్న జీయర్ స్వామి సహా ఇతర ఆధ్యాత్మిక ప్రముఖులు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై తాను ఇప్పటికే కరీంనగర్, భద్రాచలంలో మౌన దీక్షలు చేపట్టినట్లు తెలిపారు.తిరుమలలో ప్రతి రోజు నగదు, బంగారం లెక్కలను బహిరంగంగా వెల్లడిస్తారని, అయోధ్యలో బంగారం, విరాళాల వ్యవహారంలో కూడా పూర్తి పారదర్శకత ఉండాలని అన్నారు.'మొన్నటి వరకు ఓటు చోరీ, సీటు చోరీ జరిగిందని, ఇప్పుడు రాముడి బంగారం చోరీ జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. తిరుపతి లడ్డూలో నెయ్యి నాణ్యతపై ఆరోపణలు వచ్చినప్పుడు విచారణ చేపట్టిన సిబిఐ అయోధ్యలో బంగారం, విరాళాల వ్యవహారంలో ఎందుకు దర్యాప్తు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా స్పందించాలని కోరారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)పై తమకు విశ్వాసం లేదని, సిబిఐతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎసిబి సోదాలు

(మొదటి పేజీ తరువాయి)



భూమి, మోకిలలో నిర్మాణంలో ఉన్న విల్లా, కొండాపూర్ మస్జిద్ బండలో జీ+4 భవనంకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రూ.3.82 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.45.05 లక్షల నిల్వలు, సుమారు 1,440 గ్రాముల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, గృహోపకరణాలు, మొబైల్ ఫోన్లు, ఐప్యాడ ట్యాబ్లెట్లు, హార్డ్‌డిస్క్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, అలాగే ఇన్నోవా హైక్రాస్, టాటా సఫారి, ఇన్నోవా క్రిస్టా, మహీంద్రా ఎక్స్‌యూవీ సహా నాలుగు వాహనాలను గుర్తించినట్లు ఎబిసి వెల్లడించింది. అవినీతి నిరోధక చట్టం1988 (2018 సవరణలతో) లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నిందితుడిని ప్రత్యేక ఎబిసి కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. మరిన్ని ఆస్తులకు సంబంధించిన వివరాలపై విచారణ కొనసాగుతోందని, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని ఎసిబి పేర్కొంది.

**రెండు లక్షలు తీసుకుంటూ పట్టుబడ్డ మున్సిపల్ ఎఇ**



పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం మున్సిపల్ ఎఇ సతీష్ రూ.2 లక్షలు కాంట్రాక్టర్ నుంచి ఇంటి వద్ద లంచం తీసుకుంటూ ఉండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మున్సిపల్ పరిధిలో జరిగిన వర్క్ బిల్లు కోసం బత్తుల శ్రీనును రూ.4.50 లక్షలు డిమాండ్ చేయగా రెండు లక్షల రూపాయలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. అవినీతి నిరోధక శాఖ జేడీ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు సమాచారం. దాడుల్లో కరీంనగర్ ఎసిబి డిఎస్‌పి మహేందర్ రెడ్డి తో పాటు ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఏఈ సతీష్ ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి రూ.32 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

## సేవలందించలేం

(మొదటి పేజీ తరువాయి)

రేట్లు చాలా తక్కువగా ఉన్నాయని, వీటితో ఆస్పత్రుల నిర్వహణ ఆర్థికంగా సాధ్యం కాదని అసోసియేషన్ తెలిపింది. సీజీహెచ్ఎస్ ప్యాకేజీ రేట్లను యథాతథంగా అమలు చేయకుండా, క్షేత్రస్థాయి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని, శాస్త్రీయ పద్ధతిలో చికిత్సా ఖర్చులను సవరించాలని కోరారు. వాస్తవిక ధరలను నిర్ణయిస్తేనే నెట్వర్క్ ఆసుపత్రులు ఈ పథకంలో భాగస్వాములు అవుతాయన్నారు. పాలక మండలితో పాటు కీలకమైన కమిటీల్లో వివిధ వైద్య విభాగాలకు చెందిన కనీసం 10 మంది నెట్వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులకు చోటు కల్పించాలని, తద్వారా విధానపరమైన నిర్ణయాల్లో భాగస్వామ్యం దక్కడంతో పాటు, సమస్యలను తక్షణమే పరిష్కరించుకునే వీలు అవుతుందని వారు వివరించారు. కొత్త పథకంలో నిర్దిష్ట కాలపరిమితితో కూడిన, పారదర్శకమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పాత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 నుంచి 80 శాతం వైద్య సేవలను నెట్వర్క్ ఆసుపత్రులే అందిస్తున్నాయన్నారు.

## జల గండం?

(మొదటి పేజీ తరువాయి)

ప్రవాహం గోదావరి పరీవాహకంలో 2022లో నమోదైంది. 71.3 అడుగుల గోదావరి నీటి మట్టం భద్రాచలం వద్ద నమోదైంది. భవిష్యత్‌లో ఇంతకంటే ఎక్కువ వరద వస్తే పరిస్థితి ఏంటీ అనేదే ప్రజల భయం. గోదావరి వరదతో పాటు బ్యాక్‌వాటర్ తోడైతే భద్రాచలంతో పాటు గోదావరి పరివాహక పరిసర ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై స్పష్టమైన సమాధానాలు కరువయ్యాయి. ఈ అనుమానాలకు తెరదించాలంటే ప్రభుత్వాలు శాస్త్రీయమైన పద్ధతుల్లో లెక్కలు తేల్చి ప్రజల ముందు ఉంచాలని పలువురు కోరుతున్నారు. పోలవరం పూర్తి జలాశయం మట్టం 150 అడుగులు(45.72 మీటర్లు), భారీవరద సమయంలో గోదావరి సహజ ప్రవాహంపై బ్యాక్ వాటర్ ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్నదే కీలకం. భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని ఉపనదులు, వాగులు, వంకలు కాలువలు, డ్రైన్‌ల నీరు గోదావరిలో సాఫీగా చేరని పరిస్థితి ఏర్పడితే లోతట్టు ప్రాంతాలు వేగంగా జల దిగ్బంధంలో చిక్కుకునే పరిస్థితి ఉందనే ఆందోళన తీవ్రంగా వ్యక్తమవుతోంది.

**ఇకకైనా మౌనం వీడాలి**

ఇప్పటికైనా కేంద్రంతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మౌనం వీడాలి. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంపై సమగ్ర హైడ్రాలిక్ అధ్యయనం చేపట్టి భద్రాచలానికి వాస్తవంగా ఏ మేరకు ముప్పు ఉంది. ఏపీ ప్రాంతాలు మునకకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎంత వరద ప్రవాహానికి ఎంత నీటి మట్టం నమోదవుతుంది అనే వివరాలు ప్రజల ముందు ఉంచాలని పలువురు కోరుతున్నారు.

## కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఆయన హైదరాబాద్‌లో ని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పద్మనాభం మృతితో రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక అధ్యాయానికి తెరపడింది. ఆయన మరణవార్త తెలుసుకు న్న రాజకీయ ప్రముఖులు, కాపు సంఘాల నాయకులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జననం విద్యాభ్యాసం ముద్రగడ పద్మనాభం1953లో అప్పటి తూర్పు గో దావరి జిల్లా (ప్రస్తుతం కాకినాడ జిల్లా) కిర్లంపూడి గ్రామంలో జన్మించారు. 1978 నుంచి 1989 వరకు వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.ముద్రగడ పద్మనాభం ఎన్.టి.రామారావు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వంలోనూ, అనంతరం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.కాపు సామాజిక వర్గానికి విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆయన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. పలుమార్లు నిరాహార దీక్షలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించారు.

**సిఎం, డిప్యూటీ సిఎం, ప్రముఖుల సంతాపం**

ముద్రగడ పద్మనాభం మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, తెలంగాణ ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు, ఎపి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఎపి మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు,బిఆర్ఎస్ ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు, బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజురవిచంద్రతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, కాపు సంఘాల నాయకులు, సామాజిక సంస్థలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ పద్మనాభం ప్రజా సేవలు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని వారు కొనియాడారు. పద్మనాభం మృతి రాజకీయ రంగానికి తీరని లోటని వారు పేర్కొన్నారు.

## తీవ్ర ఉద్రిక్తం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర తోపులాట చేటు చేసుకోవడంతో అక్కడి కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ తోపులాటలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.అప్పటికే భారీ చేరుకున్న పోలీసులు విద్యార్థులను విద్యార్థి సంఘాల నేతలను బలవంతంగా అరెస్టు చేసి అక్కడి నుంచి సమీప పోలీసు స్టేషన్లకు తరలించారు.

**రూ.11 వేల కోట్ల బకాయిలను ఏక కాలంలో విడుదల చేయాలి : విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్**

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, అశోక్ రెడ్డి, ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి , పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనగిరి మధుకర్, ఎఐఎస్‌బి రాష్ట్ర నాయకుడు సన్నీ గౌడ్, ఎఐపిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ,ఆడేపు రవి కుమార్ వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనేరూ.11 వేల కోట్ల బకాయిలన్నింటినీ ఏక కాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఉద్యమాలకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ రాక చదువులకు దూరమవుతున్నారు. కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, గొంతు నొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని అరెస్టులతో మా ఉద్యమాలను ఆపలేరని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు వంశీ వర్ధన్ రెడ్డి,అన్వర్,చైతన్య యాదవ్,మురళి కృష్ణ, శరత్, పార్థసారథి, శేఖర్, నరేష్, శాంతి కుమార్,అనిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు లెనిన్ గువేరా,శంకర్, పవన్,నాగరాజు,శ్రీకాంత్,పిడిఎస్‌యు సంఘాల నాయకులు రానా ప్రతాప్, బి శ్రీకాంత్,మస్తాన్, ఎఐఎఫ్‌డిఎస్ నాయకులు కుమార్, ఎఐపిఎస్‌యు నాయకులు జి. పరమేశ్,రాజారాం తదితరులు పాల్గొన్నారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com